అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సోమవారం 8-5-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

www.navatelangana.com

సంపుటి : 9 సంచిక : 127 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 10 పేజీలు వెల : 6.50





బ్రిజ్ భూషణ్ ను జైలుకు పంపండి

రెజ్లర్లకు రైతు నేతల మద్దతు

- సుప్రీం మాజీ న్యాయమూర్తితో ఉన్నత స్థాయి విచారణ జరపాలి : హన్నన్ మొల్లా
- టిక్రీ సరిహద్దు వద్ద రైతులను అడ్డుకున్న పోలీసులు
- బారికేడ్లను నెట్టుకొని జంతర్ మంతర్‌కు చేరుకున్న మహిళా రైతులు

నవతెలంగాణ ..న్యూఢిల్లీ బ్యూరో

లైగింక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఎఫ్ఐ) చీఫ్, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్‌ను 15 రోజుల్లోగా అరెస్టు చేయాలి. లేకపోతే తాము దేశవ్యాప్తంగా ఆందోళన చేపడతామని రైతు నేతలు హెచ్చరించారు. మహిళా రెజ్లర్లు చేస్తున్న ఆందోళనకు సంయుక్త కిసాన్ మార్చ్(ఎస్కేఎం) ఆధ్వర్యంలో రైతు సంఘాలు మద్దతు పలికాయి. ఢిల్లీ సరిహద్దుల్లో మోహరించిన భారీ పోలీసు బలగాలను దాటుకుని ఎస్కేఎం నేతలు రాకేశ్ తికాయత్, దర్శన్ పాల్, హన్నన్ మొల్లా, జోగేంద్ర సింగ్ ఉగ్రహాన్, అరబ్ సింగ్ అష్లోవత్ తదితర నేతలు జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న రెజ్లర్లను కలిశారు.

పంజాబ్, హర్యానా, ఉత్తర ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చిన వేలాది మంది రైతులు, మహిళా రైతులతో కలిసి రైతు నేతలు మహిళా రెజ్లర్లకు సంఘీభావం ప్రకటించారు. హర్యానాలోని వివిధ 'ఖాప్‌ల' ప్రతినిధులు కూడా మహిళా రెజ్లర్లకు తమ మద్దతు తెలిపారు.

కొనసాగుతున్న ఆందోళన..

బ్రిజ్ భూషణ్ ను అరెస్టు చేయాలనీ, బాధిత రెజ్లర్లకు న్యాయం చేయాలని రోడ్డెక్కిన రెజ్లర్లు, ఆదివారం కూడా తమ ఆందోళనను కొనసాగించారు. గత 15 రోజులుగా జరుగు తున్న ఈ ఆందోళన రోజు రోజుకూ ఉధృతమవు తోంది. ఆదివారం రైతులు వచ్చి మద్దతు తెలిపి, అండగా ఉంటా మని హామీ ఇవ్వడంతో రెజ్లర్లలో ఆత్మ విశ్వాసం మరింత పెరిగింది. రైతుల రావడంతో జంతర్ మంతర్ వద్ద భారీ సంఖ్యలో పోలీస్ బలగాలు మోహరించాయి. హర్యానా,... 5లో

గుజరాత్‌లో 41 వేల మంది మహిళల అదృశ్యం

మోడీ,అమిత్ షా సొంత రాష్ట్రంలో అంతుచిక్కని మిస్టరీ



దేశానికే ఆదర్శం గుజరాత్. ఆ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి చూసి నేర్చుకొమ్మని ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్‌షా గొప్పగా చెబుతుంటారు. కానీ గుజరాత్‌లో పేదలకు,మహిళలకు ఎలాంటి భద్రత,రక్షణ లేదని జాతీయ నేర రికార్డుల బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) నివేదిక చెబుతోంది. కేరళ ఫైల్స్ పేరిట తీసిన సినిమాలో 32 వేల మంది మహిళల్ని సిరియాకు తీసుకెళ్లినట్టు అబద్ధపు ప్రచారాన్ని బీజేపీ ఎన్నికల అస్త్రంగా వాడుకుంటుంటే..కేంద్ర ప్రభుత్వ సంస్థ విడుదల చేసిన రిపోర్టులో 41 వేల మంది మహిళలు గాయబ్ అయినా..కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవటంలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 5లో..



ఓటమి భయంతో బీజేపీ నాయకుల బెదిరింపులు

టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి 5లో..

- కర్నాటక బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిపై ఫిర్యాదు



బీజేపీని గద్దెదించాల్సిందే...

మేడే స్ఫూర్తితో మరిన్ని ఉద్యమాలు : తమ్మినేని

మతోన్మాద కోరల్లో దేశం

వివరాలు 2లో

పుట్ట పాడులో ఎన్‌కౌంటర్

ఇద్దరు మావోయిస్టులు మృతి 5లో..

కాంగ్రెస్, బీజేపీ దొందూ దొందే..

- తెలంగాణలో పాగా వేయాలి :మాయావతి 3లో..

యువ సంఘర్షణ సభ 3లో..

- నేడు సరూర్‌నగర్ స్టేడియానికి ప్రియాంక

జనగణన జరిగేనా ? 2లో..

- నేటికీ కాలం చెల్లిన లెక్కలే ఆధారం

ప్రాజెక్టుల నిర్మాణాల్లో లోపాలు

ఆయకట్టుకు చేరని నీళ్లు

- మారుతున్న అంచనాలు
- ప్రజాధనం వృధా
- రీడిజైన్లతోనూ ఆర్థికంగా నష్టమే



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాల్లో లోపాల మూలంగా ఆయకట్టు లక్ష్యం నెరవేరడం లేదు. ప్రభుత్వాల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల ధనదాహంతో విలువైన ప్రజాధనం వృధా అవుతున్నది. ఆనక సామాన్య ప్రజలపైనే ఆర్థిక భారాలు పడుతున్నాయి. సాగునీటి ప్రాజెక్టులను సంపూర్ణంగా నిర్మించని ఫలితంగా ఆశించిన ప్రయోజనాలు నెరవేరడం లేదు. పూర్తిస్థాయి ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) ప్రకారం ప్రాజెక్టులు కడితే ఆర్థిక నష్టాలు ఉండవనేది సాగునీటిరంగ నిపుణుల మాట. రాష్ట్రంలోని దాదాపు అన్నీ ప్రాజెక్టుల నిర్మాణాలు ప్రభుత్వాలు, వర్కింగ్ ఏజెన్సీలతో కుదుర్చుకున్న డీపీఆర్ ఒప్పందం(అగ్రిమెంట్) ప్రకారం లేవు. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు నిర్మాణ పరిధిలోని ఆయకట్టు చివరి ఎకరం వరకు తడవడం లేదు. దీంతో ప్రాజెక్టుల లక్ష్యాలు ఎక్కడవేసిన గొంగడి అక్కడేలా ఉంది.

సంపూర్ణ ప్రాజెక్టు అంటే..

పూర్తిస్థాయి ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్) తయారైనప్పటి నుంచి నిర్ణయించిన రేట్లనే అమలుచేయాలి. నిర్ణీత కాలంలో పూర్తి చేయాలి. అప్పుడే అది సమగ్ర ప్రాజెక్టు అవుతుంది. కానీ భూసేకరణ జరగలేదనీ, బిల్లులు ఇవ్వడం లేదంటూ కాంట్రాక్టర్లు అదనపు నిధుల కొరకు వెంపర్లాడుతూ అంచనాల సవరణ(రివైజ్డ్ ఎస్టిమేట్లు) పేరుతో డీపీఆర్‌లో ఉన్న మొత్తం కంటే నాలుగైదు రెట్లు పెంచిన సందర్భాలూ ఎన్నో. ఈ తరహా ప్రాజెక్టులు రాష్ట్రంలో ఎక్కువగానే ఉన్నాయి. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు రూ.40.15 కోట్లతో ప్రారంభించి రూ.3000 కోట్లు వ్యయం చేసినా మొదటి దశ పూర్తికాలేదు. కల్వకుర్తి, బీమా, నెట్టెంపాడు, శ్రీరాంసాగర్ రెండోదశ తదితర భారీ ప్రాజెక్టులు ఆ కోవలోకే వస్తాయి. అలాగే ఆసీఫాబాద్‌ను ఆనుకుని ఉన్న జగన్నాథపురం ప్రాజెక్టు రూ. 60 కోట్లతో చేపట్టి రెండు దశాబ్దాలు దాటింది. ఇప్పటివరకు దానికి రూ. 250 కోట్లు ఖర్చుపెట్టినా పూర్తికాకపోవడం గమనార్హం.

ఇవి తప్పనిసరి..

మామూలుగా ప్రాజెక్టుల నిర్మాణాలు జరగాలంటే నాలుగు రకాల అనుమతులు తప్పనిసరి. కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ), అటవీశాఖ, పర్యావరణం, సాంకేతిక అనుమతులు తప్పకుండా తీసుకోవాల్సి ఉంటుంది. వీటిలో ఏదీ సరిగ్గా లేకపోయినా ప్రాజెక్టు నిర్మించడానికి వీలుండదు. ప్రభుత్వాలు ముందు, వెనకా అనుమతులు తీసుకుని నిర్మాణం చేపడు తుంటాయి.

ఎవరెవరు.. ఎంతెంత

రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచే నిర్మాణంలో ఉన్నాయి. ఆయా రాజకీయ పార్టీల పరిపాలనాకాలంలో శ్రీకారం చుట్టారు. టీడీపీ ప్రభుత్వ పాలనలో రూ. 17 వేల కోట్లు ఖర్చుపెట్టగా, కాంగ్రెస్ హయాంలో రూ.92 వేల కోట్లు వ్యయం చేసినట్టు అధికారిక సమాచారం. ఇకపోతే గత ఏనిమిదేండ్లుగా బీఆర్ఎస్ సర్కారు సాగునీటి పథకాలపై రూ. 1.5 లక్షల కోట్లకుపైగానే వెచ్చించింది. అయినా రాష్ట్రంలో ఏ ఒక్క ప్రాజె క్టు సంపూర్ణంగా నిర్మా ణం జరగలేదని సాగునీటి రంగ నిపుణులు అంటు న్నారు.

రివిట్‌మెంట్ పనులే కీలకం

ప్రాజెక్టు పూర్తికావడమంటే ఆ ప్రాజెక్టు డిజైన్‌లో చెప్పినట్టుగా రివిట్‌మెంటుతోపాటు కాలువల లైనింగ్ పనులూ జరగాలి. లైనింగ్ కోసం పూర్తిస్థాయి పరిమాణంతో కూడిన సిమెంట్ పనులు జరగకపోతే ప్రాజెక్టు ఆయకట్టుకు న్యాయం జరగదు. ప్రాజెక్టు పూర్తయిన తర్వాత 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తే కేవలం 50 క్యూసెక్కులు మాత్రమే కాలువ చివరి ఆయకట్టుకు చేరుతుంది. నీరు భారీగా వృధా అవడమేగాక, సహజంగానే ఆయకట్టుకూ తీవ్ర నష్టం జరుగుతున్నది. బ్రాంచ్ కెనాళ్లు, రివిట్‌మెంటు, లైనింగ్ పనులు పెండింగ్‌లో ఉంటూనే ఉన్నాయి. కాలువల్లో చెట్లు, చెత్తాచెదారం పేరుకుపోయి నీళ్లు భూమిలోకి ఇంకిపోతున్నాయి. అలాగే అవి నీటి ప్రవాహానికి ఆటంకంగా తయారవుతున్నాయి. ప్రాజెక్టు పూర్తయిందని చెప్పాలంటే కాలువల నిర్మాణమే అత్యంత ముఖ్యం. ఆ పనులను వదిలేసి ప్రభుత్వాలు మాత్రం ప్రాజెక్టులు పూర్తయ్యాయని చెబుతుంటాయి. తద్వారా నష్టమే తప్ప లాభం జరగదు.



డీపీఆర్లను మార్చేస్తారు..

రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినప్పుడల్లా వర్కింగ్ ఏజెన్సీలు మారతాయి. డీపీఆర్లనూ సవరిస్తారు. డీపీఆర్‌ను మార్చకపోతే పాత కాంట్రాక్టర్లనే కొనసాగించాల్సి వస్తుంది. పాతవారిని తొలగించాలంటే ప్రాజెక్టును రీడిజైన్ చేయాలి. అందులో మార్పులు చేస్తూ కొత్త డీపీఆర్‌ను సర్కారు తయారుచేసి, ఆ మేరకు నిర్మాణ ప్రణాళిక రూపొందించుకోవాలి. నేటి ప్రభుత్వాలు అదే చేస్తున్నాయి. తద్వారా ప్రజాధనం వృధా అవుతున్నది. అవసరం ఉన్నా, లేకున్నా డీపీఆర్లల్లో మార్పులు చేస్తూ తమ రాజకీయ ప్రయోజనాలను నెరవేర్చుకునే పనిలో ప్రభుత్వాలు ఉంటున్నాయి. ఆ నేపథ్యంలో ప్రజలపై ఆర్థిక భారాలు తప్ప, మరే ఇతర లాభం లేదని సాగునీటిరంగ నిపుణులు సారంపల్లి మల్లారెడ్డి చెప్పారు.

సర్కారు చేయాల్సినవి

రాష్ట్ర ప్రభుత్వం డీపీఆర్‌ను కచ్చితంగా అమలు చేయాలి. సత్వరమే నిర్మాణం చేపట్టాలి. డీపీఆర్ ప్రకారం సమయానుకూలంగా పూర్తిచేయించాలి. ఎలాంటి పరిస్థితుల్లో నూ అగ్రిమెంట్ పొడిగించరాదు. పనిచేయని కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలి. ప్రజాధనం వృధా కాకుండా ప్రాజెక్టులను నిర్మించాలి. కాగా రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులు ఇప్పుడు అసంపూర్ణంగానే ఉండటం అందరికి తెలిసిందే. ప్రాజెక్టులకు కేటాయించిన నిధులు బడ్జెట్‌లో స్పష్టంగా చూపించాలి. పారదర్శకత ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. నిధుల నిర్వహణ విషయంలో పారదర్శకత అవసరం.

ప్రాజెక్టుల జీవిత కాలం 25 ఏండ్లు..

డీపీఆర్‌లలో సాంకేతిక విషయాలను ఎప్పటికప్పుడు మార్చడం వలన సవరణ అంచనాలు భారీగా పెరిగి ఆర్థికభారంతోపాటు నిర్మాణమూ ఆలస్యమవుతుంది. సాంకేతిక అంశాలను పరిశీలించినప్పుడు కాస్ట్-బెనిఫిట్ రేషియో 1:4 లేదా 1:5కు మించరాదు. అంటే ఏదైనా ప్రాజెక్టుపై పెట్టిన పెట్టుబడి కనీసం నాలుగైదు సంవత్సరాల్లో తిరిగి రాబట్టుకోవాల్సి ఉంటుంది. కానీ నేడు నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల్లో రెండు దశాబ్దాలు గడిచినా సర్కారుకు పెట్టిన పెట్టుబడి తిరిగిరావడం లేదు. శ్రీరాంసాగర్, జూరాల, నాగార్జునసాగర్ మినహా మిగిలిన అన్నీ ఎత్తిపోతల(లిఫ్ట్ ఇరిగేషన్)పథకాలే కావడం తెలిసిందే. ఈ ప్రాజెక్టుల జీవితకాలం 25 సంవత్సరాలు మాత్రమే. ఆలోపుగానీ, ఆ తర్వాతగానీ పంపులు, పైపులు మార్చాల్సి ఉంటుంది. రివిట్‌మెంట్, లైనింగ్ పనులకు మరమ్మతులు కచ్చితంగా చేయాల్సిందే. లేకపోతే ఆ పథకం ప్రయోజనాలు పూర్తిస్థాయిలో వినియోగదారులకు చేరవు. కల్వకుర్తి, నెట్టెంపాడు, బీమా ప్రాజెక్టులకు 70 శాతం లైనింగ్ పనులను గత ప్రభుత్వాలు పూర్తిచేయగా, ప్రస్తుత ప్రభుత్వం పంపులు బిగించింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎనిమిది లక్షల ఆయకట్టుకుగాను నాలుగు లక్షల ఎకరాలకే కాలువలు ఉన్నాయి. ఆదిలాబాద్ మధ్యతరహా ప్రాజెక్టులకు బ్రాంచ్ కెనాళ్ల ద్వారా పంట కాలువలకు నీటి సరఫరా వ్యవస్థ లేదు. శ్రీరాంసాగర్ రెండో దశ కాలువల లైనింగ్ పనులు పూర్తికాక తుంగలు మొలిచాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నెదర్లాండ్స్ ప్రభుత్వ సహకారంతో నిర్మించిన చిన్న పథకాలైన బెక్కెం లిఫ్ట్, గూడెం, బొడబండ, జటాపూర్, కొడూరు, గోపాలపురం, చలపాడు, చిన్నమర్రూర్ ప్రాజెక్టులకు పట్టినగతే ఈ లిఫ్ట్ పథకాలకూ పడుతుంది.

ప్రపంచ సమనం



అవినీతికి ఆలవాలంగా మారిన అమెరికా న్యాయ వ్యవస్థ!

నెల్లూరు నరసింహారావు

అమెరికా న్యాయవ్యవస్థ అవినీతిమయం అయిందని గత వారం రోజులుగా వెల్లడౌతున్న వాస్తవాలు తెలియజేస్తున్నాయి. ముందుగా అత్యంత అవినీతిపరులైన జస్టిస్ క్లారెన్స్ థామస్, ఆయన భార్య వర్జీనియా జిన్నీ థామస్ చుట్టూ తిరిగిన ఈ కుంభకోణం ఆ తరువాత ప్రధాన న్యాయమూర్తితో పాటు యావత్ సుప్రీం కోర్టును ఆవహించింది. ప్రజాస్వామ్య, కార్మికవర్గ వ్యతిరేకి అయిన క్లారెన్స్ థామస్ రిపబ్లికన్ పార్టీకి చెందిన బిలియనైర్ హర్లాన్ క్రో నుంచి లక్షలాది డాలర్ల విలువైన 'బహుమతుల'ను అందుకున్నట్టు పరిశోధక జర్నలిజం వెబ్ సైట్ "ప్రొపబ్లికా" అనేక డాక్యుమెంట్లను ప్రచురించింది. ఈ హర్లాన్ క్రో హిట్లర్, నాజీల జ్ఞాపికలను సేకరించి తన టెక్సాస్ భవనంలో ప్రదర్శిస్తుంటాడు. అంతేకాదు తనకు మార్క్సిజం అంటే భయమంటాడు.

రెండు దశాబ్దాలపాటు థామస్, అతని భార్య చేసిన విహార యాత్రల వ్యయాన్ని హర్లాన్ క్రో భరించాడు. వీటిని థామస్ తన ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్లలోగానీ, మరెక్కడా కూడా ప్రకటించలేదు. ఫెడరల్ కోర్టులను ప్రగతినిరోధకులతో నింపటానికి ఇతనికి ఫాసిస్టు మేధావులు, కార్పొరేట్ పెట్టుబడిదారులు, మితవాద రాజకీయ నాయకులు సహకరించే వారు.1991లో హైకోర్టులో చేరిన తరువాత థామస్ అనేక అప్రజాస్వామిక, కార్పొరేట్ అనుకూల తీర్పులను ఇవ్వటం జరిగింది. ఈ తీర్పుల్లో 2000వ సంవత్సరంలో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో ఫ్లోరిడా ఓట్లను తిరిగిలెక్కించకుండా చేసి ఓడిపోయిన బుష్‌ను గెలిచేలా చేసిన "బుష్ వర్సెస్ గోర్" కేసు (5అనుకూలం 4ప్రతికూలం) తీర్పుకూడా ఉంది.

థామస్ భాగస్వామ్యంతో ఇచ్చిన తీర్పుల్లో ఎన్నికల ప్రచారానికి కార్పొరేట్ కంపెనీలు ఇచ్చే డొనేషన్లకు పరిమితిని ఎత్తివేసిన "సిటిజెన్ యునైటెడ్ వర్సెస్ ఎఫ్ఇసి" కేసు, మహిళలు ఎబార్షన్ చేయించుకోవటానికి రాజ్యాంగం ఇచ్చిన హక్కును రద్దు చేసిన "డాబ్స్ వర్సెస్ జాక్సన్ విమెన్ హెల్త్" కేసులు కూడా ఉన్నాయి. 2020 అధ్యక్ష ఎన్నికల తీర్పును బైడెన్‌కు వ్యతిరేకంగా మలచటానికి చేసిన ప్రయత్నంలో థామస్ భార్య జిన్నీ భాగస్వామి అయినప్పటికీ ఆ కేసును విచారిస్తున్న బెంచ్ నుంచి వైదొలగటానికి (రెక్యూస్) ఆయన తిరస్కరించాడు. ఇలా అనేక ఆర్థిక అవకతవకలకు థామస్, అతని భార్య జిన్నీ పాల్పడినట్టు "ప్రొపబ్లికా" వెబ్ సైట్ అనేక డాక్యుమెంట్లను ప్రచురించింది. వీళ్ళ అవినీతిని గురించి వాషిగ్టన్ పోస్ట్ కూడా నిర్ధారించటమే కాకుండా అనేక కొత్త విషయాలను కూడా రాసింది.

అయితే అవినీతి, అప్రకటితంగా బహు మతులను అందుకోవటం, ఇతరుల డబ్బుతో విహారయాత్రలు చేయటం, ఉపన్యాసాలను లాభసాటిగా మార్చటం, సంపన్నులతో ఆర్థిక లావాదేవీలను కలిగివుండటం థామస్‌కి, రిపబ్లికన్లకు మాత్రమే పరిమితం కాలేదు. ఇటీవల కాలంలో అనేక విషయాలు బయటకు వచ్చాయి. వాటిలో కొన్ని ఇలా ఉన్నాయి: 2017లో హైకోర్టుకు ప్రమోట్ అయ్యాక ట్రంప్ చేత నియమింపబడిన నీల్ గోర్సచ్ తన ఆస్తిని ఒక లా ఫర్మ్ సిఈఓకి అమ్మటం జరిగింది. ఆ ఫర్మ్ కేసులు కోర్టు ముందున్నవిషయం అందరికీ తెలుసు. కానీ ఈ ఆస్తి అమ్మకం గురించి ఎక్కడా వెల్లడించలేదు. 2007-2014 సంవత్సరాల మధ్యకాలంలో ప్రధాన న్యాయమూర్తి జాన్ రాబర్ట్స్ భార్య జేన్ రాబర్ట్స్ ఖరీదైన లాయర్లను నియమించి ప్రముఖ లా ఫర్మ్‌లా నుంచి 10.3మిలియన్ డాలర్ల కమిషన్లను అందుకుంది. ఆ లా ఫర్మ్‌లాలో కనీసం ఒక కేసును ప్రధాన న్యాయమూర్తి భార్యకు వేల డాలర్లను సమర్పించిన తరువాత ఆ లా పర్మ్‌లాలో ఒక పర్మ్ వాదించటం జరిగింది. ఈ సమాచారాన్ని ఒక ప్రజావేగు(విజిల్ బ్లోయర్) వెల్లడించాడు తప్ప ప్రధాన న్యాయమూర్తి జాన్ రాబర్ట్స్ వెల్లడించలేదు.

అలాగే 2004-2018 సంవత్సరాల మధ్యకాలంలో డెమోక్రాటిక్ పార్టీకి చెందిన జస్టిస్ స్టీఫెన్ బ్రేయర్ ఐరోపా, జపాన్, ఇండియా, హవాయ్‌లకు అనేకసార్లు చేసిన విహారయాత్రలకు అయిన వ్యయాన్ని ఇతరులు భరించారు. అటువంటి విహారయాత్రలలో ఒకదాని వ్యయాన్ని ఒక ప్రయివేటు ఈక్విటీ పెట్టుబడిదారు డేవిడ్ రూబెన్ స్టైన్ భరించాడు. కొన్ని విహారయాత్రల వ్యయాన్ని అమెరికాలో అత్యంత ధనవంతుల జాబితాలోవున్నప్రిట్జ్ కర్ కుటుంబం భరించింది. 2018లో దివంగత జస్టిస్ రుత్ బాడర్ గిన్స్ బర్గ్ చేసిన ఇజ్రాయిల్ యాత్రకు అయిన వ్యయాన్ని కోర్టుముందు వ్యాపార సంబంధిత కేసున్న ఇజ్రాయిలీ బిలియనీర్ మోరిస్ ఖాన్ భరించాడు.

ఇలా చెప్పుకుంటూపోతే అమెరికా న్యాయ వ్యవస్థలో జరిగిన అవినీతి కథలకు అంతే ఉండదు. కార్పొరేట్ క్యాష్, రాజకీయ పలుకుబడి, ఫెడరల్ న్యాయ వ్యవస్థ మధ్యగల అవినాభావసంబంధం గురించి పాలక వర్గాలకు, కార్పొరేట్ మీడియాకు బాగా తెలుసు. ఇప్పటిదాకా ఈ అక్రమ సంబంధం గురించి సాధారణ ప్రజలకు తెలియకుండా చేశారు. ప్రస్తుతం ఐరోపాలో జరుగుతున్న ఉక్రెయిన్ యుద్ధం, ఒక మాజీ అధ్యక్షుడి తిరుగుబాటుతో డీలాపడిన రాజకీయ వ్యవస్థ, ఆర్థిక సంక్షోభం, ప్రజలకు చుక్కలు చూపుతున్న ధరల పెరుగుదల, అమెరికాలోను, అంతర్జాతీయంగాను చెలరేగుతున్న కార్మికవర్గ తిరుగుబాట్లతో సతమతమౌతున్న పాలక వర్గాలకు అవినీతిలో కూరుకుపోయి పరువుపోగొట్టుకుంటున్న సుప్రీంకోర్టు వ్యవహారం మరింత తలపోటుకు కారణమౌతోంది. "చట్ట పాలన"ను కాపాడే సంస్థగా ఒకప్పుడు ప్రజల విశ్వాసాన్ని చూరగొన్న సుప్రీం కోర్టును ఒక తాజా ప్రజాభిప్రాయ సేకరణ ప్రకారం నేడు కేవలం 25శాతం ప్రజలు మాత్రమే గౌరవిస్తున్నారు. అధ్యక్ష, కాంగ్రెస్(అమెరికా శాసన వ్యవస్థ)వ్యవస్థలలాగానే సుప్రీం కోర్టు కూడా ప్రజల దృష్టిలో రోజురోజుకూ చులకనైపోతోందని ఈ మధ్య కాలంలో న్యూయార్క్ టైమ్స్ తన విచారాన్ని వ్యక్తం చేసింది.

అమెరికా న్యాయ వ్యవస్థలో ప్రజల ప్రమేయం లేకుండా జీవితకాలం పదవిలో కొనసాగే న్యాయమూర్తుల అవినీతి ప్రజల ప్రజాస్వామిక, సామాజిక హక్కులపైన దాడిగా పరిణమిస్తోంది. నిజానికి ఇది పెట్టుబడిదారీ వ్యవస్థలో పాలక వర్గ ఆధిపత్యాన్ని కొనసాగేలాచేసే ఏర్పాటులో భాగమే. దీన్ని విడిగా సంస్కరించటం దుస్సాధ్యం. సమాజ విప్లవీకరణతో మాత్రమే మిగిలిన వాటితోపాటుగా న్యాయ వ్యవస్థ కూడా పునఃనిర్మించబడుతుందని చెప్పనక్కరలేదనుకుంటా.

కార్మిక హక్కులను కాలరాస్తూ
ఉద్యమాలను ఆపలేరు

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య

- పలు జిల్లాల్లో ముగిసిన మేడే వారోత్సవాలు



నవతెలంగాణ-భువనగిరి

కార్మిక హక్కులను కాలరాస్తూ ఉద్యమాలను ఆపలేరని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య ప్రభుత్వాలను హెచ్చరించారు. ఆదివారం 137వ మేడే వారోత్సవాల ముగింపు సందర్భంగా పలు జిల్లాల్లో సభలు నిర్వహించారు. యాద్రాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలోని ప్రిన్స్‌చౌరస్తా వద్ద సీఐటీయూ జిల్లా అధ్యక్షులు దాసరి పాండు అధ్యక్షతన జరిగిన సభలో వీరయ్య పాల్గొని మాట్లాడారు. 137 ఏండ్ల కిందటే కార్మికుల ఎనిమిదిగంటల పని దినాన్ని సాధించడం కోసం, కార్మికులు హక్కుల కోసం పోరాడి ప్రాణాలను సైతం అర్పించారే తప్ప వెనకడుగు వేయలేదన్నారు. ఆ అమరవీరుల స్ఫూర్తితో నేడు కార్మిక ఐక్యఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కులం, మతం పేరుతో కార్మికుల మధ్య భావోద్వేగాలను రెచ్చగొడుతూ కార్మికవర్గ ఐక్యతను విచ్ఛిన్నం చేస్తూ ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలను ప్రభుత్వాలు పొందుతున్నారని తెలిపారు. కార్మిక వర్గం ఇది గ్రహించిన రోజు ప్రభుత్వాలు కుప్పకూలుతాయని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం మతాల మధ్య చిచ్చుపెట్టడంతో పాటు నిత్యం పెంచుతున్న నిత్యావసర ధరలు పెంచుతూ ప్రజలపై భారాలు మోపుతున్నారన్నారు. కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 29 చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్‌కోడ్‌లను కేంద్రం తీసుకువచ్చిందని, ఎనిమిది గంటల పని దినాన్ని 12 గంటలుగా చేసిందని విమర్శించారు. దేశం మొత్తం కరోనాతో అతలాకుతలమైతే మోడీ ప్రభుత్వం మాత్రం పారిశ్రామిక వేత్తలకు ఊడిగం చేస్తూ రూ.70 వేలకోట్లు పారిశ్రామికవేత్తలకు రద్దు చేసిందన్నారు. మేడే వారోత్సవాలను పురస్కరించుకొని నిర్వహించిన వివిధ క్రీడల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. బహిరంగ సభలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం, జిల్లా ఉపాధ్యక్షులు ఎండీ పాషా, గొరిగే సోములు, తదితరులు పాల్గొన్నారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం అమరవరంలో జరిగిన మేడే కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి హాజరయ్యారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి పలు చోట్ల జెండాను ఎగురవేశారు.

సీఐటీయూ మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా సంఘం కార్యాలయం నుంచి ఈసీఐఎల్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు.

అనంతరం చౌరస్తాలో సభ నిర్వహించారు. ఈ సభకు సీఐటీయూ మేడ్చల్ జిల్లా కార్యదర్శి జే చంద్రశేఖర్ అధ్యక్షత వహించగా సీనియర్ నాయకులు కోమటి రవి, పీఎస్ఎన్ మూర్తి, జిల్లా సహాయ కార్యదర్శి జీ శ్రీనివాసులు ప్రసంగించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని అన్నానగర్ అమరవీరుల స్తూపం వద్ద అంబేద్కర్ సంఘం సెంట్రింగ్ యూనియన్ జెండా ఏర్పాటు చేశారు.

అనంతరం మేడే వారోత్సవాల కార్యక్రమాలు నిర్వహించారు. కార్మికులకు. పిల్లలకు, మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

జనగణన జరిగేనా?

నేటికీ కాలం చెల్లిన లెక్కలే ఆధారం



న్యూఢిల్లీ : కులగణన జరిపే అధికారం రాష్ట్రానికి లేదంటూ ఇటీవల పాట్నా హైకోర్టు ఇచ్చిన తీర్పు నితీశ్ కుమార్ ప్రభుత్వానికి ఎదురు దెబ్బగా భావించవచ్చు. ఎందుకంటే రూ. 115 కోట్ల వ్యయంతో జనవరి 7న బీహార్ ప్రభుత్వం ఈ బృహత్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అయితే కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే కులగణన చేసే అధికారం ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. దేశంలో కులాలపై సర్వే జరపడం 1931 జనాభా లెక్కల సేకరణతోనే ప్రారంభమైంది. కులగణన సంగతి అటుంచితే జనాభా లెక్కల సేకరణను కూడా ఏ కారణం చేతనో కేంద్రం జరపడం లేదు. 2021లో జనాభా లెక్కలు సేకరించాల్సి ఉండగా ఆ పని నేటికీ జరగకపోవడంతో దేశం ఇప్పటికీ 2011 లెక్కల పైనే ఆధారపడాల్సి వస్తోంది.

ప్రతి పదేండ్లకు ఒకసారి జనాభా లెక్కలు సేకరించే ప్రక్రియను 1881లో ప్రారంభించారు. ఇప్పటి వరకూ అది వాయిదా పడలేదు. జాప్యం కూడా జరగలేదు. జనగణన కోసం కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పరిధిలో రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా కార్యాలయాన్ని (ఓఆర్‌జీఐ) ప్రారంభించారు. జనగణన అనేది పెద్ద ఎత్తున చేపట్టే కసరత్తు. ఇరవై నుండి ముప్పై లక్షల మంది ఎన్యూమరేటర్లు గడపగడపకూ వెళ్లి వ్యక్తిగత, కుటుంబ సమాచారాన్ని సేకరిస్తారు. విద్య, అక్షరాస్యత స్థాయి, గృహవసతి, సంతానం, సౌకర్యాలు, వలస, భాష, ప్రాంతం, కులం...ఇలా అనేక వివరాలు తెలుసుకుంటారు. ప్రజల అవసరాలు తెలుసుకోవడానికి, ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవడానికి ఈ వివరాలు చాలా అవసరం. 2021 జనగణనకు సంబంధించి 2019లో ప్రణాళికలు రూపొందించారు. రూ. 8,754 కోట్ల బడ్జెట్‌ను సైతం కేటాయించారు. మొట్టమొదటిసారిగా డిజిటల్ పద్ధతిలో సమాచార సేకరణ జరపాలని నిర్ణయించారు. అయితే కోవిడ్ కారణంగా ఈ ప్రక్రియను నిరవధికంగా వాయిదా వేశారు. అనంతరం 2022 డిసెంబర్ 31 తర్వాత పని మొదలు పెట్టాలని భావించారు. ఈ తేదీని మరోసారి పొడిగించి ఈ సంవత్సరం జూలై 1వ తేదీగా నిర్ణయించారు. అయితే 2024 లోక్‌సభ ఎన్నికలు పూర్తయ్యేంత వరకూ పని మొదలు పెట్టే అవకాశాలు కన్పించడం లేదు.

అసలు శాస్త్రీయ సమాచారం అంటేనే ఈ పాలకులకు కంపరంగా ఉంటోంది. ఓబీసీల సంఖ్య, మైనారిటీలలో సంతానోత్పత్తి రేటు వంటి అంశాలపై బీజేపీ వాదనలు వాస్తవానికి భిన్నంగా ఉన్నాయి. జనగణన చేస్తే ఆర్థికాభివృద్ధి విషయంలో ఆ పార్టీ నేతలు చెబుతున్న మాటలలో డొల్లతనం బయటపడుతుంది. పేదరిక నిర్మూలనపై శాస్త్రీయమైన సమాచారమేదీ

నేటితో కర్నాటక ప్రచారానికి తెర

- పూర్వ వైభవం కోసం కాంగ్రెస్ ఆరాటం
- అధికారం నిలుపుకునేందుకు బీజేపీ తంటాలు
- మోడీ పైనే కమలనాథుల ఆశలు

బెంగళూరు : కర్నాటకలో ఎన్నికల ప్రచారం చివరి దశకు చేరింది. నేటితో ప్రచారానికి తెర పడుతుంది. మరోవైపు ఓటర్లను ఆకట్టుకునేందుకు తెర వెనుక ప్రయత్నాలు ప్రారంభమవుతున్నాయి. ఈ ఎన్నికలలో ఎలాగైనా గెలిచి పూర్వవైభవం సంపాదించాలని కాంగ్రెస్ విశ్వప్రయత్నం చేస్తుంటే అధికారాన్ని నిలబెట్టుకునేందుకు బీజేపీ తంటాలు పడుతోంది. చివరి నిమిషంలో అందివచ్చే ఏ అవకాశాన్నీ ప్రధాన పార్టీలు వదులుకోవడం లేదు. గతంలో కంటే ఇప్పుడు తన విజయావకాశాలు మెరుగుపడ్డాయని బీజేపీ భావిస్తోంది. ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా వంటి నేతల ప్రచారం తమకు ఓట్లను కురిపిస్తుందని ఆ పార్టీ ఆశిస్తోంది. ముఖ్యంగా మోడీ పైనే కమలనాథులు ఆశలు పెట్టుకున్నారు. బెంగళూరులో శనివారం మోడీ 26 కిలోమీటర్ల మేర రోడ్‌షో నిర్వహించారు. ఆదివారం కూడా ఇది కొనసాగింది. 28 అసెంబ్లీ స్థానాలున్న బెంగళూరు నగరంలో మెజారిటీ సీట్లను సొంతం చేసుకునేందుకు బీజేపీ వ్యూహరచన చేస్తోంది. 2018 ఎన్నికలలో బెంగళూరులో ఆ పార్టీ పనితీరు నిరాశాజనకంగానే ఉంది. అందుకే మోడీ ఈ నగరంపై ప్రధానంగా దృష్టి సారించారు. ఆయన నగరంలో మొత్తం 18 సభలలో ప్రసంగించారు. మరోవైపు కాంగ్రెస్, జేడీ (ఎస్) కూడా ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. కాంగ్రెస్ అగ్రనేతలందరూ రాష్ట్రంలో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. ఆ పార్టీ నేతలు ప్రధాని మోడీపై విమర్శనాస్త్రాలు సంధిస్తూ దుందుడుకుగా వ్యవహరిస్తున్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే కర్నాటకకు చెందిన వాడు కావడంతో రాష్ట్ర రాజకీయాలు ఆయనకు బాగా తెలుసు. అందుకే ఆయన ప్రచార సారథిగా పార్టీని ముందుకు నడిపిస్తున్నారు.

మతోన్మాద కోరల్లో దేశం

నవతెలంగాణ-భూపాలపల్లి

దేశ ప్రజలను మోసం చేసి గద్దెనెక్కి తినే తిండి మీద, కట్టుకునే బట్ట మీద లక్షల కోట్ల రూపాయల పన్నులు వేస్తూ మోయలేని భారాలు మోపుతున్న బీజేపీ ప్రభుత్వాన్ని ఇక గద్దె దించాల్సిందేనని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సుభాష్ కాలనీ అంగడి మైదానంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన మేడే వారోత్సవాల ముగింపు సభ జరిగింది. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి బందు సాయిలు అధ్యక్షతన వహించారు ముందుగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని హనుమాన్ దేవాలయం నుంచి గణేష్ చౌక్, అంబేద్కర్ సెంటర్ మీదుగా సుభాష్ కాలనీ క్రీడా మైదానంలో జరిగే బహిరంగ సభకు ప్రజలు భారీ ర్యాలీగా వచ్చారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో తమ్మినేని మాటా_డుతూ... మేడే స్ఫూర్తితో ఉద్యమాలు జరగాలని, శ్రమజీవుల రాజ్యాన్ని స్థాపించాలని అన్నారు. జిల్లా కేంద్రంలో వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని గద్దెనెక్కిందని, ఇపుడు వాటి ఊసే లేదని విమర్శిం చారు. దేశం నేడు మతోన్మాద కోరల్లో చిక్కుకుందన్నారు. రాజ్యాంగ విలువలకు తూట్లు పొడిచి మనువాద రాజ్యాంగాన్ని అమలు చేస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ జిల్లాలో ఇల్లు లేని నిరుపేదలకు ఇండ్ల స్థలాలు ఇచ్చి పట్టాలిచ్చి పక్కా గృహాలు నిర్మించివ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన డబుల్ బెడ్ రూమ్ వాగ్దానాన్ని అమలు చేయాలని, ఖాళీ స్థలంఉన్న ప్రతి పేదవాడికి 5 లక్షల రూపాయలు. మంజూరు చేయాలని కోరారు. అనంతరం మేడే ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన క్రీడలలో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు జె వెంకటేష్, శ్రీకాంత్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పొలం రాజేందర్, వెలిశెట్టి రాజన్న, చెన్నూరి రమేష్, కంపేట రాజన్న, దామెర కిరణ్, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హిందూ, ముస్లిం, క్రైస్తవుల మధ్య సెంటిమెంట్లు రెచ్చగొట్టి ఎన్నికల్లో మరోసారి లబ్ధి పొందేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది. బీజేపీ పాలనకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలి. దేశంలో మోడీ, అమిత్ షా నేతృత్వంలో కార్పొరేట్ కంపెనీలకు లక్షలకోట్ల రూపాయలు కట్టబెడుతూ ప్రజలపై భారాలు మోపుతున్నారు. ప్రభుత్వ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అమ్మేస్తున్నారు. మానవాభివృద్ధి ,ఆకలి సూచికలో మన దేశం అట్టడుగు స్థానంలో ఉన్నది. లక్షల కోట్ల నల్లధనం తీసుకొచ్చి ప్రతి కుటుంబానికి రూ. 15లక్షలు ఖాతాలో వేస్తామన్న హామీ అటకెక్కింది. దేశ వినాశనానికి పాల్పడుతున్న బీజేపీని ఓడించాలి.

- తమ్మినేని

డబ్బింగ్ షురూ..



బోయపాటి శ్రీను, రామ్

రామ్, బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఈ చిత్రంలో అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్‌తో పాటు యాక్షన్, మాస్ ఎక్కువగా ఉండ బోతున్నాయి. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాస చిట్టూరి భారీ బడ్జెట్‌తో అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన డబ్బింగ్ పనులు ప్రారంభమైయ్యాయి. దీన్ని తెలియజేస్తూ డబ్బింగ్ స్టూడియోలో ఉన్న దర్శకుడు బోయపాటి ఫొటోను మేకర్స్ రిలీజ్ చేశారు. ఇటీవలే విడుదల చేసిన ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో రామ్‌కు జోడిగా శ్రీలీల నటిస్తోంది. ప్రముఖ పాత్రలలో కొంతమంది ప్రముఖ నటీనటులు కూడా నటిస్తున్నారు. దసరా కానుకగా అక్టోబర్ 20న విడుదల కానున్న ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: బోయపాటి శ్రీను, నిర్మాత: శ్రీనివాస చిట్టూరి, సంగీతం: ఎస్ తమన్, డీవోపీ: సంతోష్ డిటాకే,

అదే కస్టడీ ప్రత్యేకత..



కృతిశెట్టి

'దాదాపు అన్ని సినిమాల్లో విలన్‌ని హీరో అంతం చేయడానికి ప్రయత్నిస్తాడు. కానీ 'కస్టడీ'లో మాత్రం విలన్‌ని హీరో కాపాడటానికి ప్రయత్నిస్తాడు. ఇది చాలా ఆసక్తికరంగా ఉంటుంది' అని కథానాయిక కృతిశెట్టి అన్నారు. నాగ చైతన్య, వెంకట్ ప్రభు కాంబోలో తెలుగు-తమిళ ద్విభాషా ప్రాజెక్ట్‌గా వస్తున్న చిత్రం 'కస్టడీ'. కృతి శెట్టి కథానాయిక. శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్ పై ఈ ప్రాజెక్ట్‌ని పవన్‌కుమార్ సమర్పిస్తుండగా, శ్రీనివాస చిట్టూరి నిర్మిస్తున్నారు. ఈనెల 12న సినిమా విడుదల కాబోతున్న నేపథ్యంలో నాయిక కృతిశెట్టి మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

'దాదాపు అన్నీ సినిమాల్లో విలన్‌ని హీరో అంతం చేయడానికి ప్రయత్నిస్తాడు. కానీ ఇందులలో మాత్రం విలన్‌ని హీరో కాపాడటానికి ప్రయత్నిస్తాడు. ఆద్యంతం ఇది ఆసక్తికరంగా ఉంటుంది. ఈ కథలో నా పాత్రకు చాలా ప్రాధన్యత ఉంది. కథ సీరియస్ అవుతున్నప్పుడు నా పాత్ర దాన్ని బ్యాలెన్స్ చేస్తుంది. స్క్రీన్‌ప్లేతో నా పాత్ర ప్రయాణిస్తూ ఉండటమే కాకుండా నటనకు ఆస్కారం వుండే పాత్ర. నా పాత్ర నిడివి కూడా ఎక్కువే. సాధారణంగా సినిమాల కోసం డ్యాన్స్ ప్రాక్టీస్ చేస్తాం, కానీ ఈ సినిమా కోసం జిమ్నాస్టిక్స్ ప్రాక్టీస్ చేశాను. ఇది యాక్షన్‌ఎంటర్ టైనర్. ఈ సినిమా తర్వాత మార్వల్స్ స్టూడియో నుంచి నాకు కాల్ వస్తుందని వెంకట్ ప్రభుతో చెప్పాను (నవ్వుతూ). నా పాత్రలో మంచి ఎమోషన్ ఉంటుంది. ఇందులో ఉన్న అండర్ వాటర్ సీక్వెన్స్ అద్భుతంగా ఉంటుంది. దీన్ని చాలా ఎంజాయ్ చేస్తూ చేశాం. దాదాపు 15 రోజులు ఆ సీక్వెన్స్ చేశాం. ఒక ఐదు రోజుల పాటు కంటిన్యూగా వాటర్ లోనే ఉన్నాం. దీని కోసం రెండు రోజులు శిక్షణ తీసుకున్నాం. ఊపిరి తీసుకోకుండా రెండు నిముషాలు పాటు ఉంటేనే ఒక షాట్ సాధ్యపడుతుంది. ఒక దశలో నాకు భయం వేసింది. నాగ చైతన్య నా ఫేవరట్ నటుడే కాదు వ్యక్తి కూడా. తను చాలా నిజాయితీగా ఉంటారు. ఈ కథలో పాత్రలు చాలా కంఫర్ట్ బుల్‌గా ఉండాలి. నేను ఆఫ్ స్క్రీన్‌లో చైతో కంఫర్ట్ బుల్‌గా ఉంటాను. కాబట్టి ఆన్‌స్క్రీన్ కూడా చక్కగా వర్క్ అవుట్ అయ్యింది. దర్శకుడు వెంకట్ ప్రభు చాలా ఫ్రెండ్లీ. నాకు దర్శకత్వం చేయాలనే ఉంది. అయితే అది ఇప్పుడే కాదు. నేను ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తాను. దీనికి సంబంధించి ఇంకా చాలా విషయాలు నేర్చుకోవాలి. అలాగే ఏ భాషలోనైనా నటించటానికి రెడీగా ఉన్నాను. అయితే కథ మాత్రం తప్పనిసరిగా నచ్చాలి. ప్రస్తుతం శర్వానంద్‌తో ఓ సినిమా చేస్తున్నా. అలాగే ఓ మలయాళం సినిమాతోపాటు ఇంకొన్ని ప్రాజెక్ట్స్ గురించి మేకర్స్ త్వరలోనే అనౌన్స్ చేస్తారు.

నవచిత్రం

సర్‌ప్రైజ్ చేసే యూనిక్ కాన్సెప్ట్

సందీప్ కిషన్, వీఐ ఆనంద్ కాంబినేషన్‌లో వస్తున్న ఫాంటసీ, అడ్వెంచరస్ యాక్షన్ థ్రిల్లర్ 'ఊరు పేరు భైరవకోన'. ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. హాస్య మూవీస్ బ్యానర్ పై రాజేష్ దండా ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, ఏకె ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ పై అనిల్ సుంకర సమర్పిస్తున్నారు. బాలాజీ గుత్తా ఈ చిత్రానికి సహ నిర్మాత. తాజాగా మేకర్స్ టీజర్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా హీరో సందీప్ కిషన్ మాట్లాడుతూ, 'నా బర్త్ డే రోజు టీజర్ విడుదల కావడం స్పెషల్ మూమెంట్. తొలిసారి చండీయాగం చేసి టీజర్ విడుదల చేయడం చాలా పాజిటివ్‌గా ఉంది. ఈ సినిమాలో చాలా మంచి విషయాలు, వినోదాత్మక విషయాలు ఉంటాయి. ఫాంటసీ అడ్వెంచర్ సినిమాలు నాకు వ్యక్తిగతంగా చాలా ఇష్టం. వర్ష బొల్లమ్మ, కావ్య.. ఇలా అందరూ చాలా చక్కగా నటించారు' అని తెలిపారు.



కావ్యా థాపర్, సందీప్ కిషన్

"ఊరు పేరు భైరవకోన' యూనిక్ కాన్సెప్ట్. అలాగే ఫుల్ ఎంటర్ టైన్‌మెంట్ ఉంటుంది. సూపర్ నేచురల్ ఫాంటసీ ఎలిమెంట్స్ ఉంటాయి. నిర్మాత రాజేష్ ఎక్కడా రాజీ పడకుండా పూర్తి సహకారం అందించారు. అనిల్ మొదటి నుంచి నన్ను ప్రోత్సహిస్తున్నారు. వైవా హర్ష పాత్ర ఇందులో కీలకంగా ఉంటుంది. సినిమాని చాలా కొత్తగా ప్రయత్నించాం' అని దర్శకుడు విఐ ఆనంద్ అన్నారు.

సమర్పకుడు అనిల్ సుంకర మాట్లాడుతూ, 'టీజర్ సందీప్‌కి బర్త్ డే గిఫ్ట్ మాత్రమే కాదు బ్లాక్ బస్టర్ గిఫ్ట్ కూడా. దర్శకుడు చెప్పిన దానిలో 70 శాతం విజువల్స్ ఉంటే అది బ్లాక్ బస్టర్ అవుతుంది. కానీ ఆనంద్ చెప్పిన దాని కంటే 50 శాతం ఎక్కువ విజువల్‌గా ఉంది. విజువల్ చూసి చాలా ఆశ్చర్యపోయాను. ప్రేక్షకులు కూడా చాలా సర్‌ప్రైజ్ అవుతారు' అని చెప్పారు. నిర్మాత రాజేష్ దండా మాట్లాడుతూ, 'భారీ స్థాయిలో ఆనంద్ స్టైల్‌లో సూపర్ నేచురల్ ఫాంటసీగా ఈ సినిమా వస్తుంది. ఈ టీజర్ చూసి సినిమా రేంజ్ ఏమిటనేది మీరే చెప్పాలి. అనిల్ చాలా మంచి సూచనలు, సలహాలు ఇచ్చారు' అని తెలిపారు.

స్కూల్స్‌లో ప్రత్యేకంగా ప్రదర్శించాలి

శర్మన్ జోషి, శ్రియా, షాన్, సుహాసిని మూలే, ప్రకాష్ రాజ్ తదితరులు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మ్యూజిక్ స్కూల్'. ఇళయరాజా సంగీత సారథ్యం వహిస్తోన్న ఈ మల్టీ లింగ్వువల్ మ్యూజికల్ మూవీ ఈనెల 12న రిలీజ్ అవుతుంది. శనివారం ఈ చిత్ర ప్రీరిలీజ్ ఈవెంట్ జరిగింది. 'మ్యూజిక్ స్కూల్' జ్యూక్ బాక్స్‌ను ఇళయరాజా, మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా రిలీజ్ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ,'పాటలు, ట్రైలర్‌ను చూస్తుంటే చక్కగా తెరకెక్కించారని తెలుస్తోంది. పాపారావు నాకు 16-17 ఏళ్లుగా తెలుసు. అస్సాంలో చీఫ్ ర్యాంక్ ఆఫీసర్‌గా రిటైర్ అయ్యారు. ఆయన నన్ను కలిసి సినిమా తీశానని చెప్పినప్పుడు చాలా ఆశ్చర్యపోయాను. నేటి సమాజంలో పిల్లల్లో ఉండే క్రియేటివిటీని ఎలా చంపేస్తున్నారనే అంశంపై ఈ సినిమా తీశారు. తెలంగాణలో ఇళయరాజా మంచి మ్యూజిక్ యూనివర్సిటీని లీడ్ చేయాలని రిక్వెస్ట్ చేస్తున్నాను' అని తెలిపారు.




శ్రియా

'మ్యూజిక్ నేర్చుకుంటే వయొలెన్స్ ఉండదు. మోసం ఉండదు. ప్రజల మధ్య స్నేహం పెరుగుతుంది. ఫ్యామిలీతో మంచి అనుబంధం ఏర్పడుతుంది. కేటీఆర్ చెప్పినట్లు ఇక్కడ మ్యూజిక్ యూనివర్సిటీ వస్తే .. ఒకటి రెండు కాదు.. 200 మంది ఇళయరాజాలను మీనుంచి తయారు చేస్తాను. మన దేశం నుంచి విదేశాలకు వెళ్లి గొప్పగా సంగీతాన్ని ప్రదర్శించాలి. మన దేశంలో ఎంతో శక్తివంతమైన ప్రజలున్నారు. నేను దాన్ని రుజువు చేస్తాను. కెటీఆర్ రిక్వెస్ట్‌ను నేను యాక్సెప్ట్ చేస్తున్నాను' అని ఇళయరాజా చెప్పారు. చిత్ర దర్శకుడు పాపారావు బియ్యాల మాట్లాడుతూ, 'నేషనల్ లెవల్లో పివిఆర్ రిలీజ్ చేస్తున్న ఈ సినిమాను తెలుగు రాష్ట్రాల్లో దిల్ రాజు విడుదల చేస్తున్నారు. వారికి స్పెషల్ థ్యాంక్స్' అని చెప్పారు. 'ఈ సినిమా ద్వారా మంచి మెసేజ్‌ను ఇస్తున్నారు. ఈ సినిమాను అన్నీ స్కూల్స్‌లో ప్రత్యేకంగా ప్రదర్శించాలి' అని నిర్మాత దిల్ రాజు అన్నారు.

ఆద్యంతం ఆసక్తికరం

నిజామాబాద్ గ్రామీణ నియోజకవర్గ పరిధిలోని కంజర గ్రామానికి చెందిన యువకుడు విరాజ్ రెడ్డి హీరోగా నటించిన చిత్రం 'గాడ్'. ప్రసాద్ ల్యాబ్‌లో నిర్వహించిన ప్రివ్యూ ఈవెంట్లో టిఎస్‌ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ గ్రామీణ నియోజకవర్గ శాసనసభ్యులు బాజిరెడ్డి గోవర్ధన్, నిజామాబాద్ జిల్లా పరిషత్ ఆర్థిక, సభ్యులు ధర్పల్లి జెడ్పిటిసి బాజిరెడ్డి జగన్మోహన్ కుటుంబ సమేతంగా వీక్షించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ఈ చిత్రాన్ని ప్రజలందరూ ఆదరించి, నూతన హీరో విరాజ్ రెడ్డిని ప్రోత్సహించాలి. అను ప్రొడక్షన్స్‌లో నిర్మించిన ఈ చిత్రాన్ని డైరెక్టర్ జాగా పెద్ది పాన్ ఇండియా సినిమాగా తెలుగు, హిందీ, తమిళ్, కన్నడ, మలయాళం, ఇంగ్లీష్, చైనీస్, భాషలలో తెరకెక్కించారు' అని తెలిపారు. "గాడ్' చిత్రంలో నటించిన కళాకారులు, పని చేసిన సాంకేతిక నిపుణులకు టిఎస్‌ఆర్టిసి చైర్మన్, శాసనసభ్యులు శ్రీ బాజిరెడ్డి గోవర్ధన్ శుభాకాంక్షలు తెలియజేశారు. సినిమాలపై మక్కువ ఉన్న విరాజ్ రెడ్డి హీరోగా నటించిన ఈ చిత్రాన్ని ప్రజలందరూ వీక్షించి, ఈ చిత్రంలో నటించిన కళాకారులందరినీ ఆదరించాలని కోరారు. ఈ సినిమా చూస్తున్నంత సేపు హర్రర్, కామెడీగా అనిపించిందని, మరోవైపు జరిగిన సంఘటన గురించి హీరో ఇన్వెస్టిగేషన్ చేసే విధానం ఎంతగానో నచ్చిందని ఆయన తెలిపారు. ఈ సినిమాకు ముందు విరాజ్ 'వన్ మాన్ ఆర్మీ' అనే సినిమా కూడా తీశారు. అది ఇంకా రిలీజ్ కాలేదు.



విరాజ్ రెడ్డి

కాంగ్రెస్, బీజేపీ దొందూ దొందే..

- బీసీ జనగణన ఎందుకు చేయటం లేదు
- తెలంగాణలో పాగా వేయాలి : 'తెలంగాణ భరోసా' సభలో బీఎస్‌పీ అధినేత్రి మాయావతి
- సీఎం అభ్యర్థిగా ప్రవీణ్‌కుమార్ ప్రకటన



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్, బీజేపీ దొందూ దొందేనని బీఎస్‌పీ అధినేత్రి మాయావతి విమర్శించారు.ఆ రెండు పార్టీలతో జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించిన 'తెలంగాణ భరోసా సభ'కు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాయావతి మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం బీసీ జనగణన ఎందుకు చేయటం లేదో చెప్పాలని ప్రశ్నించారు. కాన్షీరామ్ పోరాట మార్గంలో బీఎస్‌పీ ముందుకు సాగాల్సిన అవసరం ఉందని చెప్పారు. త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో పాగా వేయాలనీ, రాష్ట్రంలో అధికారం చేజిక్కించుకోవాలని ఆయా శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీల కోసం అంబేద్కర్ రిజర్వేషన్లు తెచ్చినా.. వాటి అభివృద్ధి ఫలాలు ఇంకా ఆయా వర్గాల చెంతకు చేరలేదన్నారు. వారి కోసం మరిన్ని చట్టాలు తేవాలంటూ నాడు న్యాయ శాఖ మంత్రిగా ఉన్న అంబేద్కర్ భావించారనీ, ఆయన సూచనలను అప్పటి ప్రధాని నెహ్రూ లక్ష్య పెట్టలేదని తెలిపారు. జ్యోతిబా పూలే, అంబేద్కర్, నారాయణగురు చూపిన బాటలో పయనిద్దామని పిలుపునిచ్చారు. వారందరూ బడుగు, బలహీన వర్గాల కోసం తన జీవితాన్ని అంకితం చేశానని మాయావతి చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సంబంధించి బీఎస్‌పీ సంపూర్ణ మద్దతినిచ్చిందని గుర్తు చేశారు. బీఎస్‌పీ ఎస్సీల కోసమే కాదనీ, సబ్బండ వర్గాల సంక్షేమం కోసం పనిచేస్తున్నదని తెలిపారు. దేశంలోనే అతిపెద్ద రాష్ట్రం ఉత్తరప్రదేశ్‌లో ఎస్సీ, ఎస్టీ, బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి వారి జీవితాల్లో వెలుగులు నింపామ న్నారు. రాష్ట్రంలో దళితులకు మూడెకరాల భూమి పంపిణీ చేస్తామని చెప్పి, సీఎం కేసీఆర్ మాట తప్పారని విమర్శించారు. తెలంగాణకు చెందిన జి.కష్ణయ్య అనే ఐఏఎస్ అధికారి హత్యకు కారణ మైన నిందితుడిని బీహార్ ప్రభుత్వం విడుదల చేస్తే కేసీఆర్ మౌనంగా ఉండటమేంటని ప్రశ్నిం చారు. ఈ సందర్భంగా తెలంగాణ సీఎం అభ్యర్థిగా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను ఆమె ప్రకటించారు.

రైతులను ఆదుకోవటంలో సీఎం విఫలం.. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

బీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. అకాల వర్షాల వల్ల రాష్ట్రంలో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. వారిని ఆదుకోవ టంలో సీఎం కేసీఆర్ విఫల మయ్యారని చెప్పారు. రాష్ట్రంలో బీసీ, ఎస్టీ, ఎస్సీలు, మైనార్టీలు ఏకం కావాలని పిలుపు నిచ్చారు. బీసీనని చెప్పుకొంటున్న ప్రధాని మోడీ.. ఆయా కులాలకు ఏం చేశారని ప్రశ్నించారు.

తెలంగాణలో బహుజన రాజ్యం ఏర్పడిన తర్వాత రైతు సంక్షేమ నిధి ఏర్పాటు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. సరూర్‌నగర్ సభకు రాష్ట్ర నలు మూలల నుంచి బీఎస్‌పీ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కార్య క్రమంలో రాజ్య సభ సభ్యులు రాంజీ గౌతమ్, రాష్ట్ర సమన్వయ కర్త మందా ప్రభాకర్, బీఎస్‌పీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు పరంజ్యోతి, అధికార ప్రతినిధి సాంబశివగౌడ్, జిల్లాల ఇన్‌ఛార్జిలు మాట్లాడారు.

వార్డు సభ్యుడి కుటుంబానికి జడ్పీ వైస్ చైర్మన్ పరామర్శ..

- మృతి చెందిన విష్ణువర్ధన్ రావుకు నివాళి

నవతెలంగాణ వెల్దండ: వెల్దండ మండల పరిధిలోని కొట్ర గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు పోనుగోటి విష్ణువర్ధన్ రావు ఇటీవల మతి చెందారు. మతి చెందిన విష్ణువర్ధన్ రావు కుటుంబ సభ్యులను ఆదివారం నాగర్ కర్నూల్ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అన్నివిధాల కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

యువ సంఘర్షణ సభ

నేడు సరూర్‌నగర్ స్టేడియంలో యూత్ డిక్లరేషన్‌పై ప్రియాంకగాంధీ ప్రకటన



(ఫైల్)

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ తలపెట్టిన యువ సంఘర్షణ సభను సోమవారం నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియం లో నిర్వహించనున్న ఈ సభకు ఏఐసీసీ అగ్రనేత ప్రియాంకగాంధీ హాజరుకానున్నా రు. ఈ సందర్భంగా యూత్ డిక్ల రేషన్ పేరుతో నిరుద్యోగులకు భరోసా పత్రాన్ని విడుదల చేయను న్నారు. ప్రియాంక తొలిసారి రాష్ట్రానికి రానుండటంతో పార్టీ ఆ సంఘర్షణ సభను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఆయా నియోజకవర్గాలకు ఇంచార్జిలను నియమించి భారీ జనసమీకరణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రియాంకగాంధీ తొలుత ఎల్బీనగర్ చౌరస్తాకు చేరుకుంటారు. అక్కడ తెలంగాణ అమరుడు శ్రీకాంతాచారి విగ్రహానికి నివాళులర్పిస్తారు. అక్కడి నుంచి నేరుగా సరూర్‌నగర్ స్టేడియానికి చేరుకుంటారు. అనంతరం యువ సంఘర్షణ సభలో ప్రసంగిస్తారు. వివిధ కారణాలతో మరణించిన పార్టీ కార్యకర్తలకు కాంగ్రెస్ కల్పించిన బీమా సౌకర్యాన్ని బాధితులకు అందించనున్నారు.

నది

నది
ఎప్పుడూ మౌనంగా వుండదు
గలగల మంటూ వుంటుంది

పగలు సూర్యుడూ
రాత్రి చుక్కలూ చంద్రుడూ
నది తో ముచ్చట్లు పెడుతూ వుంటాయి

నది
ఎప్పుడూ నిలకడగా వుండదు
నిరంతరం ప్రవహిస్తూ వుంటుంది

పల్లం జారుడు బండలా
తోసుకెళ్తూ వుంటుంది



చల్లగాలి నది వీపుమీద చరుస్తూ
ముందుకు తోస్తుంది

నిద్ర ఎరుగని నది
తీరాలను ఒరుసుకుంటూ
రాళ్లనీ రప్పల్నీ వంకల్నీ దొంకల్నీ
దాటుకుంటూ
అలసటనెప్పుడో మర్చిపోయింది

తీరికే లేని నది
తనలో తాను కలవరిస్తూ పలవరిస్తూ
ప్రేమించిన సముద్రుణ్ణి చేరేందుకు
పరుగులు తీస్తూవుంది
కాలం తో పోటీగా నది
కదం తొక్కుతూనే వుంది

- వారాల ఆనంద్,
9440501281

బూడిద పూలు.. కవిగుండెల్లో నిప్పుల సాగు..

కవిత్వంలో నిఖార్సైన అగ్గిసెగలు.. "నిజం" ఇవి నిప్పు కొమ్మలకు పూసిన, వాడని బూడిదపూలు... ఈ కవి ఓ అక్షారాల అగ్గికొమ్మల అడవి.. సామాజిక రుగ్మతలు అణచివేతలు, అసమానతలు తనలో రగిలిన రవ్వలు... భావ సంఘర్షణల రాపిడిలో రాజుకున్న నిప్పుకొమ్మల దహనమిది.. లావా ఎగసి శిలాజమైనట్టు ఈ కవి అంతరంగ అగ్నిఘోష ఇలా కవిత్వ శిల్పంగా మన కళ్లముందుంది.

భాషని ఇంత బలంగా వాడొచ్చా అని ఈ కవి కవిత్వం చదివాక అనిపించింది... వివరణంతా కుల, మత, ప్రాంత రాజకీయ విద్వేషాలతో పాటు సామాన్య జనం లోపల విచ్ఛిన్నమైన మానసిక బంధాలను విప్పి చెప్పడమే, కప్పి చెప్పేదే కవిత్వం అయినప్పుడు విప్పి ఎలా చెబుతారని అడక్కండి. శ్రీరామమూర్తి కవిత్వం చదివాక క్లుప్తత, సరళత, సాంద్రత మీకు బోధపడతాయి. ఒకవైపు సామాజిక స్పృహ మరోవైపు తీరని వ్యధ.

అధివాస్తవికత పాళ్లు ఎక్కువ ఉన్నప్పుడే శిల్పం కొత్త పుంతలు తొక్కుతుందన్నది ఒప్పుకోలేని నిజం... కల్పనను, కొన్ని అల్యూజన్స్ నీ సర్రియలిస్ట్ పంథాలో రాయడం "నిజం" కవి చేసిన మొదటి, చివరి ప్రయత్నం...



వలస పోవడం కొన్ని ప్రాణాలకు అతి మామూలు విషయం కానీ కోవిడ్ సమయంలో వలస కార్మికుల దీన గాథ ప్రపంచం మొత్తం చూసింది.. ఎవరు తీర్చలేని, ఎక్కడా పూడ్చలేని నరకయాతన.. ఇప్పటికిప్పుడు ఇంటికి పొమ్మంటే అప్పటికప్పుడు ఇల్లు ఖాళీ చేయడం అంటే బతుకు కిటికిలో నుంచి ఎగిరి ఏ చెట్టుకో పుట్టకో వలస వెళ్ళడమే కాదా... అలాంటి వలస కార్మికుల గాథల్ని అద్భుతంగా చిత్రించారు మూర్తి.. విషధాన్ని వివరణాత్మక ధోరణిలో సాగించడం కూడా ఒక కవిత్వ పటుత్వమే...

శ్రీరామమూర్తి నాకు ఫేస్‌బుక్‌లో పరిచయం, fb గోడల మీద రెండు మాటలు రాసేసి వెళ్ళిపోయి మనల్ని అబ్బుర పరుస్తుంటారు. అయితే ఆయన వయసురీత్యా తన కవిత్వ పలక దిద్దుతున్నప్పటికీ నేనింకా పుట్టానో లేదో తెలీదు కానీ, ఆయన కవిత్వాన్ని చదవడం మాత్రం నేను కవిగా పుట్టాకే జరిగింది...

సమాజపు లోటుపాట్లను, అవకతవకలను, వ్యంగ్యంగా, వాస్తవిక కాల్పనిక సమ్మేళనంతో కవిత్వం రాయడం ఈ నిజం కవి గొప్పతనం... కవిత్వ సిద్ధాంతాల గురించి నేను పెద్దగా చర్చించను గానీ ఈ బూడిద చెట్ల పూల దండలు గుచ్చి మన మెడలో వేసి వెళ్ళిపోతారు కవి..

వాటిని ఆస్వాదించాలంటే కచ్చితంగా మనలో నిజాన్ని ఒప్పుకునే నిజాయితీ, తర్కాన్ని విభేదించలేని మెచ్యూరిటీ, స్వయంకృతాపరాధానికి తల్లడిల్లిన మనసు వుండాలి...

కరోనా కల్లోలమే కాదు, పాలకుల వ్యవస్థల క్రూర రాజకీయ ఎత్తుగడలనీ ఆయన మాటల్లో చెబుతారు... ఇలా చెబుతూనే సుతిమెత్తని సీతాకోక నవ్వుల్ని.. పసిపాపల జోల పాటల్ని.... రంగురంగుల హరివిల్లుల అందాల్ని కూడా హాయిగా చెబుతారు..

మనసు మైల పడి/ అంతస్తుల అడుగు జారి / కింద పడతామని వీదులని మేల్కొలిపే చీపురును ద్వేషించడం మనకెంతో హాయి/ బిక్కు బిక్కు రైళ్లు/ రాజుని మోసి జనాన్ని ద్వేషించే/ వ్యాపారిని ప్రేమించి వ్యాక్సిన్ను చెట్టెక్కించే/ విషవానల ఆకాశం కింద/ అనాథ విత్తుల పైరులై విరగ పండుతారు/ బూడిద చెట్ల పూలు/ శవాలను మోస్తూ జీవచ్ఛవాలను చూసి/ ఒలుకుతున్న కన్నులతో/ ప్రాణాలరచేత పట్టుకొని/ పరుగులు తీస్తున్న నదులు/ కొంగ రంగస్థలం/ లోపల నుండి గడియలు బిగించుకున్న / లోగిళ్ళు బిగిపిడికిళ్లను కలగంటున్నాయి/ దుఃఖ నదిలో పుష్ప పడవ / సకాలంలో కాపాడలేకపోయిన చేతకానితనానికి/ సమాధి కట్టమని /మరణానికి గౌరవాగౌరవాలుండవని/ గంధపు చెక్కలతో కాల్చినా/ అయ్యేది బూడిద అదేనని/ నిండు నిజాల స్మశాన మీటుతున్నాయి/ కట్టె కాలడం లేదు/ మనుషులను మృత దేహాలు మోస్తున్నాయి/ మధ్య మధ్య దయ్యపు బువ్వ పెడుతున్నాయి/ వల్లకాటి వాగ్మూలం/ ఇలా /వీరదాసు/ నది వీడిన నేల/ అప్పుడే ఎక్కడికి

ఇలా ఎన్నో కవితలు కరోనా కల్లోల అక్షరీకరణే, అయితే కోవిడ్ వైపరీత్యాలను అక్షరం చేయని కవులు తక్కువే కానీ ఇలా పుస్తకం చేసిన చాలా కొంతమందిలో శ్రీరామమూర్తి ఒకరు..

నేను చూపిన ఈ కవిత్వ పాదాలే కాదు బూడిద చెట్ల పూల పుస్తకపు దారిలో చాలా అడుగులు కరోనా కాలంలో జరిగిన సంఘటలకు చలించిపోయి రాసినవే... సంకలనంలో ఎన్ని వాక్యాలను కోట్ చేసినా ఇంకొకటి మిగిలే ఉంటుంది... కిరసనాయిలు పోసి పుల్లగీసినా అంటుకోడం లేదని వేదన చెందడం.. అరచేత్తో పాచిని తొలగించి తాజా దనాన్ని అద్దే మనిషిని రానియ్యట్లేదని వాపోవడం, దారెప్పుడు ఒకే తను మనస్సుల సంచారి కాదని తత్వాన్ని అవలీలగా చెప్పడం అన్ని శ్రీరామమూర్తి కవిత్వ పరిమళాలే...

కుంచించుకుపోతున్న మానవత్వాన్ని, కురచైపోతున్న మనిషితనాన్ని, ఇమేజెస్‌తో, అల్యూజన్స్‌తో, మెటాఫర్లతో ఇంత సుమధుర కవిత్వం అందించడం నిజంగా కొత్త సృష్టే...

ఒకవైపు ప్రోస్ మరోవైపు పోయెట్రీ.. రెండు పడవల మీద కాళ్ళు పెట్టీ పయనం సాగించడం కష్టతరమైనా ఆయనకు చాలా ఇష్టతరమైంది...

మబ్బుల్ని మడత పెట్టి / మోసుకుపోతున్న వాణ్ణి ఆపండి / కిరాయికైనా నాలుగు మంచి చినుకులు / కురిపిస్తాడేమో అడుగుదాం / తరుణోపాయం / ఆటలో వైరానికి మాటలు మానేసిన బంధు స్నేహితుడు, /బడి పంతులు పంపగా / నాన్నతో అవసరం కోసం ఇంటికొచ్చినప్పుడు / ఆప్యాయంగా పలకరిస్తే / ముఖం తిప్పుకున్నప్పటి గాయం / నేటికీ తియ్యగా కబుర్లు చెబుతుంది / తిరిగి అక్కడికే / రేణువై ఎగరడం కంటే స్థానువై ఉండడమే మంచిది / కొమ్మలు విరిచి కట్టిన చెట్టులా, / రెమ్మలు తుంచేసిన పువ్వులా, / కదలిక ప్రాణాంతకం, / చైతన్యం మృత్యు సంతకం / చావు బాకీ

వలస పోవడం కొన్ని ప్రాణాలకు అతి మామూలు విషయం కానీ కోవిడ్ సమయంలో వలస కార్మికుల దీన గాథ ప్రపంచం మొత్తం చూసింది.. ఎవరు తీర్చలేని, ఎక్కడా పూడ్చలేని నరకయాతన.. ఇప్పటికిప్పుడు ఇంటికి పొమ్మంటే అప్పటికప్పుడు ఇల్లు ఖాళీ చేయడం అంటే బతుకు కిటికిలో నుంచి ఎగిరి ఏ చెట్టుకో పుట్టకో వలస వెళ్ళడమే కాదా... అలాంటి వలస కార్మికుల గాథల్ని అద్భుతంగా చిత్రించారు మూర్తి.. విషధాన్ని వివరణాత్మక ధోరణిలో సాగించడం కూడా ఒక కవిత్వ పటుత్వమే... అలాగే ప్రతి కవిత్వ శీర్షిక చాలా కొత్తగ ఎవరు కాపీ కొట్టలేనిదిగా ఊహించడానికి కూడా వీలు లేనిదిగా ఉంటుంటే ఒక కవి పరమార్థాన్ని చెబుతుంది...

రాత్రి ఆసుపత్రి, / వడిసెల / క్రూర రంగస్థలం / మాటలు దూకే బావి / అది తాకని చోటు రోబోటు

ఫుల్ పోయెట్రీ లా.. పూర్తి సిమిలిలతో అల్లుకున్న పద్యాలు ఇవి... ఒక్క పోలికను చూపడమే కష్టమైన ఈ రోజుల్లో ఇన్ని సిమిలారిటీస్‌తో పోయెట్రీ రాయడం చాలా కష్టతరం.. అస్థిత్వ రోదనని, ఆవాంచనీయ సంఘటనల రూపాన్ని ప్రతీకలుగా మలిచి చెప్పడం ఈ కవిత్వం ప్రత్యేకత...

అయితే కవిత్వం మీద అవగాహన, సాధికారత లేకుండా ఇంత కవిత్వాన్ని రాయడం సులువు కాదు... ఇప్పటి యువత పాటించాల్సిన ఎన్నో ధోరణులు ఈ కవిత్వంలో నేను గమనించాను...

పెనుగులాట జీవిత తర్కం అయితే ఆ పెనుగులాటను గుచ్ఛం చేసి బూడిద చెట్ల పూలని మనకు అందించడం... వాటిని చదువుతూ ఎంతో కొంత మనల్ని మనం ఊరట వైపు మళ్లించుకోడం తుదిమెరుగు...


పోరాటాన్ని వీడని ఏ వాక్యమైన కవిత్వమే అవుతుంది అంటాను నేను... అలాంటి పోరాట పటిమ ఉన్న శ్రీరామమూర్తి కవిత్వానికి నా సలాములూ...

- సుభాషిణి తోట, 9502818774

డార్విన్ గెలిచాడు

వాడంతే
అజ్ఞానధారి!

శాస్త్రీయంలో
మూసిన కళ్ళు మూసిన ముక్కు మూసిన చెవులు
ముంచి
అశాస్త్రీయ నోరు తెరుస్తాడు



జన్యుస్థిరత్వం ధిక్కరించి
శ్రమపాత్ర దొంగిలించి
మానవుడి నుండి
కోతైయ్యేందుకు
వెనక్కి నడుస్తుంటే
వాడి ప్రేమల 'దేవుడి సృష్టి'
దేశంమీద పడి ఏడుస్తోంది

జీవపరిణామక్రమం
సూర్యుని చుట్టూ తిరిగొస్తుంటే
చీకటి చుట్టూతిరుగుతున్న మతం!

లేలేత మెదడు కొమ్మల్లో
వెలుగు నింపడానికి
చంపడానికి
మధ్య
ఒక యుద్ధం జరుగుతోంది

కాషాయఫాసిస్టు ప్రణాళిక మనుస్మృతి!
మనమధ్య వేలాడ్తున్న మధ్యయుగమొకటి
మనతో దాగుడుమూతలాడ్తోంది

ఒక ఆటవిక పులిపంజా
మనల్ని గురిచూస్తోంది


మంత్రాలకు
చింతకాయలు రాల్తేకదా!

నేలమీద నిలబడ్డ
డార్విన్ను చూసి
దేవుడు భయపడ్తున్నాడు
నిలబడ్డానికి
కాళ్ళులేక

- వద్దెబోయిన శ్రీనివాస్

ముక్కుతో పెంకును పగులగొట్టుకుంటూ

యువర్ స్టోరేజ్ ఈజ్ ఫుల్
ఖాళీ చెయ్.. లేకుంటే
ఊడదు.. చిగురు మొలవదు
ఇనర్షియా.. జడత్వమేదో
ఒక మంచుసముద్రమై
లోపల ఘనీభవిస్తూ
ఘనీభవిస్తూ
కొంత అంతర్దనమేదో
జరిగి జరిగి, ఆత్మ కరిగి
కరిగి
దుఃఖంతో, విముక్త
కాంక్షతో
లోపలి నుండి ఒక
ఊదారంగు పావురం
రెక్కల చప్పుడు టపటపా టపటపా
మౌనరాత్రి.. జ్ఞాపకాలు పక్షుల గుంపులవలె
మేల్కొని
పదునైన ముక్కులతో హృదయాన్ని పొడుస్తూ
పొడుస్తూ
జీవితం.. నిజానికి అనుభవంగా మిగుల్తున్న
ఒకేఒక దీర్ఘానుభూతేనా-



అప్పుడప్పుడు అమ్మ కనబడ్తుంది చేతులు
దాచి
తర్వాత నగ్నంగా హత్తుకుని ఒడిలో
రాత్రంతా ఒదిగి
కన్నీటితో కరిగించిన 'ఆమె' కనిపిస్తుంది
మనుషుల్లోనుండి రోడ్లు, నదులు, మొలకెత్తే
ఆకాశాలు పొటమరిస్తూంటాయి
నన్ను నేను ఖాళీ
చేసుకోవాలనుకుంటున్నపుడు
ఏ పుస్తకాన్నని పారేయగలను..
ప్రతిపుటా జ్వలితామృత బిందువే
డై ఎమీ కాదు.. లివ్ ఎన్టీ'
ఖాళీ ఐ ఎప్పటికప్పుడు లోపలి చెత్తను
కాలబెట్టుకుంటూ
స్వయం శుద్ధున్నా తూ విస్తరించగలనా
ఏమీ తోచని అస్థిరత్వంలో నుండి
మొలకెత్తుతూండగా
'పర్చేజ్ న్యూ స్టోరేజ్' అని ఒక సూచన
కొత్త సూర్యుడు.. కొత్త మెలకువ.. కొత్త దృష్టి
కొత్త జీవితం
గుడ్డు లోపల శిశుపక్షి ముక్కుతో పైపెంకును
పగులగొడ్తూ
టక్ టక్ టక్.. కొత్త జన్మ కోసం నిశ్శబ్ద
శబ్దం-

- రామా చంద్రమౌళి,
9390109993



నారుమడి అద్దంలో

కర్షకున్ని,
పంటచేలో దిక్కులు చూపిస్తున్న
సీతకుండలా నిలబెట్టినది నేటి రాజకీయం
చీడపురుగులు ఆకురసాన్ని పీల్చినట్లు
దళారులు రైతురక్తాన్ని జుర్రుకుంటున్నారు
నారుమడి అద్దంలో
చంద్రుని రూపాన్ని చూసి,
చిరునవ్వుతో సాగిపోతూ
చేను మొక్కల మొదళ్ళ మొలిచిన
చుక్కల కండ్లతో
పంటకు కాపు కాస్తడు సేద్యపతి
బురదనే భస్మంలా
అలంకరించుకున్న నిష్కామయోగి
నల్లరేగడి మన్ను మంత్రించి
మల్లెల అన్నం పుట్టిస్తాడు
అప్పు చేసైనా సరే
పంటకన్యకు కనకపు గొలుసులు
మెడలువంగ అలంకరిస్తాడు
కల్తీవిత్తనం కాన్పుకాలేక
సుడులు దిరిగి ఉసురు దీసుకుంటుంటే
కర్షకుని పేగులచెమ్మ ఇంకిపోయి
రొట్టె విరిగిన చప్పుడు వినిపిస్తుంది
అతని చినిగిన చొక్క కిటికిలోంచి
ఎముకల ఊచలు కిలుము పట్టి
పెచ్చులూడుతున్నాయి
రైతుపాద చైతన్యయాత్రల
మేకులు నాటి అడ్డుకుంటున్నరు
నకిలీ మందులతో
సస్యరమ నుదుటి సింధూరం
కారిపోతుంది
పంటలమ్ముడువోక
కృషీవళుని నిండుప్రాణం
పంటకుప్పలపై
దిష్టిదీసిన నిమ్మపండులా చితికిపోయింది
రైతురాజ్యం మాత్రం
పేపర్లలో వెలిగిపోతూనే వుంది

- కోరెంకయాదయ్య
9492363404

ఐదు తరాలు ఆవిష్కరణ

ఈ నెల 14వ తేదీ ఉదయం 10:30గంటలకు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో షోయబ్ హాల్‌లో గులాబీల మల్లారెడ్డి కథల పుస్తకం 'ఐదు తరాలు' ఆవిష్కరణ సభ నిర్వహించనున్నారు. తెలంగాణ సాహితీ ప్రధాన కార్యదర్శి కె.ఆనందాచారి అధ్యక్షతన నిర్వహించే ఈ కార్యక్రమంలో ఏనుగు నరసింహారెడ్డి పుస్తకావిష్కరణ చేయనున్నారు. బొజ్జ బిక్షమయ్య, రాపోలు సుదర్శన్, ప్రమోద్, గుడిపాటి తదితరులు ఈ కార్యక్రమానికి హాజరు కానున్నారు.

శ్రీమతి గంటా కమలమ్మ స్మారక కథా పురస్కారం 2023

శ్రీమతి గంటా కమలమ్మ స్మారక కథా పురస్కారం 2023కు కథా రచయిత కే.వీ. మేఘనాథ్ రెడ్డి "కలుంకూరి గుట్ట" కథా సంపుటి ఎంపికైందని, పురస్కార వ్యవస్థాపకులు, అరసం చిత్తూరు జిల్లా అధ్యక్షులు గంటా మోహన్ తెలిపారు. ఈ నెల 30న చిత్తూరులో జరిగే కార్యక్రమంలో రచయితకు 10వేల రూపాయల నగదు, జ్ఞాపికతో సత్కారం జరుగుతుంది.

21న గ్రంథాలయ సందర్శన యాత్ర

'ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రంథాలయ సందర్శన యాత్రలో భాగంగా గుంటూరులోని 'అన్నమయ్య గ్రంథాలయ సందర్శన యాత్ర ఈ నెల 21వ తేది న నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా 'మన ఆంధ్రప్రదేశ్' కవితా సంకలనాన్ని ప్రఖ్యాత కవి, విమర్శకులు డా॥ పాపినేని శివశంకర్ ఆవిష్కరిస్తారు. డా. ఉప్పలధడియం వెంకటేశ్వర హైకూ సంపుటి 'విత్తనం'ను ప్రముఖ కవి అడిగోపుల వెంకటరత్నం ఆవిష్కరిస్తారు. ఈ యాత్రను సందర్శించడానికి పాల్గొనదలచినవారు 9247475975 నెంబర్ కు సంప్రదించగలరు.

- చలపాక ప్రకాష్, ప్రధాన కార్యదర్శి,
ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం

తిరగరాసిన ప్రసిద్ధ కవితలు


కొన్నిసార్లు ఒక చిన్న కవితకు లేదా దానిలోని చిన్న భాగానికి స్వల్పమైన మార్పులు చేర్పులు చేసి, ఉద్దేశ పూర్వకంగానో, అనాలోచితంగానో తిరిగి రాస్తారు ఇతర కవులు. ఇట్లాంటి సంఘటనలు సాహిత్య చరిత్రలో అరుదుగానే జరుగుతాయి. ప్రసిద్ధ కవి ఎజ్రా పౌండ్ పేరు మీద ఉన్న ఈ చిన్న కవితను చదవండి:

Hast thou 2 loaves of bread/ Sell one + with the dole
Buy straightaway some hyacinths/ To feed thy soul.
The Paris Review, Issue No. 222, (Fall 2017)
(నీ దగ్గర రెండు రొట్టెలు వుంటే/ ఒకదాన్ని అమ్మేసి
నీ ఆత్మ ఆకలిని తీర్చేందుకు/ వెంటనే కొన్ని గులాబీలను కొనుక్కో)

కానీ ఇదే కవిత కొంచెం భిన్నత్వంతో నూట పది సంవత్సరాల ముందే (ఆగస్టు 1907లో) The Century Magazine లో అచ్చైంది. రాసినతని పేరు జేమ్స్ టెరీ వైట్. అందులో ప్రారంభంలో, "నీ అదృష్టం బాగుండక నీ యింట్లో రెండు రొట్టెలు మాత్రమే మిగిలివుంటే..." అని రాసి వుంది. మిగిలిన పంక్తులలో ఎలాంటి మార్పు లేదు. పైగా కింద "హిపోక్రటిస్ వరవడిలో..." అని ఉంది. అంటే టెరీ వైట్ రాసిన ఈ చిన్న కవితకు హిపోక్రటిస్ స్ఫూర్తి అనుకోవాలి. హిపోక్రటిస్ ప్రాచీన కాలపు గ్రీకు వైద్యుడు. గులాబీలను దగ్గర ఉంచుకుంటే మానసిక స్వస్థత చేకూరుతుందని ఆయన అలా రాసి ఉండొచ్చునని భావించే అవకాశముంది ఇక్కడ. కానీ అదే సంవత్సరం చివరలో టెరీ వైట్ ప్రచురించిన "సాది గులాబీ తోటలో" అనే పుస్తకంలో మళ్లీ ఇవే పంక్తులు చోటు చేసుకున్నాయి. ఐతే ఈ సారి హిపోక్రటిస్ ప్రసక్తి లేదు. కాబట్టి, పదమూడవ శతాబ్దపు ఫార్సీ కవి ఐన సాది కవిత దీనికి స్ఫూర్తి కావచ్చు అనుకున్నారు కవిత్వాభిమానులు. ఇతర కవుల పంక్తులను తమ రచనలో చేర్చినప్పుడు కొటేషన్ మార్క్స్ పెట్టడాన్ని మరచిపోవడం కొన్నిసార్లు ఇటువంటి తప్పిదాలకు కారణ మౌతుంది. మరికొన్ని సార్లేమో పూర్తిగా ప్రమాదవశాత్తు (accidentally- యాదృచ్ఛికంగా) జరుగుతుంది ఈ పొరపాటు.

ఈ వాక్యాలనే మళ్లీ ఉటంకిస్తూ, వీటికి ఖురాన్‌తో సంబంధమున్నట్టు అస్పష్టంగా, అనిర్దిష్టంగా సూచించారు. ఇస్లాం ప్రవక్త ముహమ్మద్ లేదా ఎవరైనా అజ్ఞాత పర్షియన్ కవి ఈ పంక్తులకు మూలం అన్నారు. మరికొందరేమో వీటి కర్తృత్వాన్ని ఎల్బర్ట్ హబర్డ్ అనే తాత్వికునికి ఆపాదించారు. క్వేకర్, గ్రీన్ లీఫ్ విటియర్ లను కూడా వదలక ఈ పంక్తులకు వారితో సంబంధమున్నట్టు అభిప్రాయపడ్డారు కొందరు.

ఈ కథ ఇక్కడితో ఆగిపోలేదు. టెరీ వైట్ 1917 లో ఈ పంక్తులకు మళ్లీ స్వల్పమైన మార్పును చేసి, A Garden of Remembrance అనే తన కవితా సంపుటిలో చేర్చాడు. అట్లా ఆయన తన ఈ చిన్న కవితకు హిపోక్రటిస్ లేదా సాది స్ఫూర్తి అని చెప్పకనే చెప్పినట్లైంది. మొత్తానికి ఈ కవితా పంక్తులకు ప్రాచుర్యం కలిగింది. 1911లో అమెరికాలో మేయర్ పదవికి పోటీ చేసిన జెబ్ హెరిమన్ తన ఎన్నికల ఉపన్యాసంలో ఈ పంక్తులను వాడుకున్నాడు. కొందరు ఈ వాక్యాలనే మళ్లీ ఉటంకిస్తూ, వీటికి ఖురాన్‌తో సంబంధమున్నట్టు అస్పష్టంగా, అనిర్దిష్టంగా సూచించారు. ఇస్లాం ప్రవక్త ముహమ్మద్ లేదా ఎవరైనా అజ్ఞాత పర్షియన్ కవి ఈ పంక్తులకు మూలం అన్నారు. మరికొందరేమో వీటి కర్తృత్వాన్ని ఎల్బర్ట్ హబర్డ్ అనే తాత్వికునికి ఆపాదించారు. క్వేకర్, గ్రీన్ లీఫ్ విటియర్ లను కూడా వదలక ఈ పంక్తులకు వారితో సంబంధమున్నట్టు అభిప్రాయపడ్డారు కొందరు. ఎజ్రా పౌండ్ ప్రాంభంలో hast ను చేర్చడమే కాక, one ను one+ గా మార్చాడు. టి. ఎస్. ఎలియట్ రాసిన ద వేస్ట్ ల్యాండ్ లో కూడా hyacinth అన్న పదం ఒకటి రెండు చోట్ల వస్తుంది.



మొత్తానికి ఈ చిన్న కవిత వెనుక ఇంత పెద్ద తతంగముంది.

దాదాపు ఇటువంటిదే ఐన ఒక సంఘటన తెలుగు సాహిత్యంలో కూడా సంభవించింది. ఒకే ఒక్క సిరాచుక్క లక్ష మెదళ్ల కదలిక అనే వాక్యాన్ని కాళోజీ రాశాడని చాలా మంది అనుకుంటారు. కానీ అది వాస్తవం కాదు. నా గొడవ అన్న తన కవితా సంపుటిలోని ఒక కవితలో, "ఒకే ఒక్క సిరాచుక్క లక్ష మెదళ్ల కదలిక అన్నాడు లార్డ్ బైరన్" అని రాశాడు కాళోజీ. ఐతే, అన్నాడు లార్డ్ బైరన్ అనే మాటలను పట్టించుకోకుండా, కాళోజీయే దీనికి కర్త అని తప్పుగా వ్యాఖ్యానించారు చాలా మంది. నిజానికి, One drop of ink makes a million think అని రాసినవాడు జార్జ్ గోర్డన్ బైరన్ అనే ఆంగ్లేయ కాల్పనిక కవి. ఈయననే లార్డ్ బైరన్ అని కూడా అంటారు. తెలుగు సాహిత్య చరిత్రలో ఇటువంటి వృత్తాంతాలు ఇంకా ఏవైనా ఉన్నాయా?

కొన్నిసార్లు ఇతరుల ప్రసిద్ధ కవితలోని కేవలం ఒక పంక్తి ఒకటి రెండు పదాల మార్పుతో వేరొకరి కవితలో చొరబడవచ్చు. దానికి కారణం ఆ కవితా పంక్తిని రెండవ కవి ఎప్పుడో చదివి దానిచేత బాగా ప్రభావితుడై ఉండటం, తత్ఫలితంగా అది అతని మెదడు అడుగున నిద్రాణంగా పడివుండి చాలా యేళ్ల తర్వాత తన కొత్త కవితలో చొరబడటం జరగవచ్చు. అంటే, inadvertently/unwittingly (తెలియకుండా) అలా జరుగుతుందన్న మాట. కానీ పంక్తులకు పంక్తులు లేదా మొత్తం కవిత మక్కీకి మక్కీగా పునశ్చరణ (రిపీట్) ఐనప్పుడు, దాన్ని ఉద్దేశపూర్వకమైన గ్రంథచౌర్యంగానే భావించాల్సి ఉంటుంది.

- ఎలనాగ

అక్షరం ఆరోగ్యం వెరసి ఆలూరి

కథానికలతో పాటు ఆరోగ్యకరమైన సమాజం కోసం ఆరోగ్యకరమైన విషయాల పట్ల అవగాహన కలిగించడంలో నిష్ణాతులు వీరు. వైద్య వృత్తిని అభ్యసించి స్త్రీల శారీరక రుగ్మతలకు కారణాలు వెదికారు. మహిళలకు తమ ఆరోగ్యం పట్ల అవగాహన లేకపోవడం సమస్యకు కారణమని గుర్తించారు. తన రచనల ద్వారా బాలికలు, మహిళలు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పిస్తున్నారు. నిరుపేద మహిళలకు తన చేతనైన రీతిగా వైద్యం చేస్తూ సామాజిక ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నారు. 78 ఏండ్ల వయసులోనూ ఇంకా చేయవలసినది ఇంకా ఎంతో ఉంటుందన్నారు. ఆమే డాక్టర్ ఆలూరి విజయలక్ష్మి. వారి జీవన ప్రస్థానం వారి మాటల్లోనే...



మీ బాల్యం గురించి చెప్పండి?

కృష్ణాజిల్లా ఆత్కూరులో పుట్టాను. గూడపాటి వరలక్ష్మి, రామకోటయ్య మా తల్లిదండ్రులు. మేము ఐదుగురు అమ్మాయిలు, ఇద్దరు అబ్బాయిలం. పెద్దమ్మకు పిల్లలు లేక నన్ను పెంచుకొన్నారు. ఏడాది వయసు నుండి పెంచి పెద్దచేసి, విద్యాబుద్ధులు నేర్పించిన పెద్దమ్మ పెదనాన్నలు అట్లూరి వెంకటలక్ష్మి విలాసం, అచ్యుతరామయ్యలు జీవితాంతం తోడుగా నిలిచారు. కృష్ణాజిల్లా ఉంగుటూరులో ప్రాథమిక విద్య నుండి హైస్కూల్ చదువు వరకు చదివాను. పి.యు.సి.సెయింట్ థెరిసా మహిళా కళాశాల, ఏలూరులోనూ, ఎం.బి.బి.ఎస్. ఆంధ్రామెడికల్ కాలేజీ, విశాఖపట్నంలోనూ చదివాను. హౌస్ సర్జెన్సీ హైదరాబాద్ ఉస్మానియా వైద్య కళాశాలలో చేశాను. ఎమ్మెస్. (గైనిక్) ప్రిన్స్ వేల్స్ వైద్య కళాశాల పాట్నాలో చేరి, 1970లో యూనివర్సిటీ ఫస్ట్ గా నిలిచాను.1971 నుండి ప్రాక్టీస్ మొదలుపెట్టాను. నా మేనమామ మురళీకృష్ణమూర్తితో నా పెండ్లి జరిపించారు. వారు ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలోఫార్మసీ హెడ్‌గా పని చేశారు. తర్వాత ఇండస్ట్రీ పెట్టి నడిపారు. మాకు ఇద్దరు అమ్మాయిలు. డాక్టర్ సమీర గైనకాలజిస్ట్, ఆమె భర్త డాక్టర్ సి.ఎల్.వెంకటరావు సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్. రెండో కూతురు డాక్టర్ తుషార ఆప్తల్మాలజిస్ట్, ఆమె భర్త డా.వి.ఎస్.రామచంద్ర కార్డియాలజిస్ట్.

సాహిత్యం పట్ల ఆసక్తి ఎలా కలిగింది..?

ఆరు, ఏడు తరగతుల నుండి పుస్తకాలు చదివేదాన్ని. మా బాబాయి గ్రామ సర్పంచుగా ఉండేవారు. కనుక పంచాయతీ లైబ్రరీ పుస్తకాలు అందుబాటులో ఉండేవి. స్కూల్ లైబ్రరీలో కూడా మంచి పుస్తకాలు ఉండేవి. కనుక చిన్నతనం నుండి చదవడం ఒక వ్యసనం లాగా అయింది. 8వ తరగతిలో ఉండగా మహీధర రామ్మోహనరావుగారి కుమార్తె సర్వలక్ష్మి మాకు తెలుగు టీచర్‌గా వచ్చారు. స్కూల్ గ్రంథాలయ విభాగం వారు విద్యార్థులకు వారానికొక పుస్తకం ఇచ్చేవారు. సర్వలక్ష్మిగారు నా సాహిత్య ఆకలిని గమనించి నాకు గ్రంథాలయ పుస్తకాలను ఎక్కువగా అందజేసేవారు. అదేవిధంగా ఊర్లో ఎవరింట్లో పుస్తకాలు ఉన్నా వెళ్లి తెచ్చుకొని చదివేసి మళ్ళీ ఇచ్చేసేదానిని. పుస్తకాలు చదవడం వలన వ్యక్తిగత అభిరుచులు, ఆలోచనలూ, ప్రవర్తనలు తప్పనిసరిగా సానుకూలమైన దిశకు మరలుతాయి. నాకు కూడా అలాగే జరిగింది. తెలుగు సాహిత్యంతో పాటు హిందీ పరీక్షలు ప్రాథమిక నుండి, విశారద వరకు చదివాను. అందువల్ల హిందీ మాస్టారు, శ్రీ దత్తత్రేయ వర ప్రసాద్ సార్ చిన్న తరగతుల వారికి క్లాసులు తీసుకోమనేవారు. అంతేకాక ఆయన హిందీ సాహిత్యాన్ని నాకు చక్కగా విపులీకరించేవారు. హరివంశరాయబచ్చన్, మైథిలీ శరణగుప్త మొదలగు మంచికవుల కవిత్వాన్ని, సాహిత్యాన్ని చదవడం వలన తెలుగు సాహిత్యం మీద పట్టు ఏర్పడి, సానుకూల ప్రభావం పడింది.

మీరు ఆటల్లో కూడా ముందుండేవారని విన్నాము..?

అవును, హైస్కూల్‌లో ఉన్నప్పుడు సాయంత్రం చీకటి పడే వరకూ ఆటలు ఆడేదాన్ని. హైస్కూల్ నుండి టెన్నికాయిట్ ఛాంపియన్ని. జిల్లా గ్రిగ్ స్పోర్ట్స్ అండ్ గేంస్ మీట్‌లో కృష్ణా జిల్లా చాంపియన్. ఏలూరులో చదివేటప్పుడు కూడా పశ్చిమగోదావరిజిల్లా గ్రిగ్ స్పోర్ట్స్‌లో ఛాంపియన్. అదేవిధంగా వైజాగ్‌లో మెడికల్ కాలేజీలో చదివేటప్పుడు విశాఖ జిల్లా టెన్నికాయిట్ ఛాంపియన్ని. వరసగా మూడేండ్లు మూడు జిల్లాల్లో టెన్నికాయిట్ ఛాంపియన్‌గా నిలిచాను. స్పోర్ట్స్‌లో రన్నింగ్ విజేతను. ఆంధ్రా మెడికల్ కాలేజి స్పోర్ట్స్ చాంపియన్ని. ఇంటర్ మెడికల్, ఇంటర్కొలిజియేట్ గేంస్ అండ్ స్పోర్ట్స్ మీట్స్‌లో ఎన్నో కప్పుల్ని, పతకాల్ని గెలుచుకున్నాను



మీ సాహిత్య ప్రయాణం ఎలా కొనసాగింది?

పి.యు.సి. పరీక్షలు వ్రాసి రిజల్ట్ కోసం వేచి చూస్తున్న సమయంలో డా.పి. శ్రీదేవి రాసిన 'కాలాతీత వ్యక్తులు' చదివాను. ఆమె రచయిత్రి, డాక్టర్ కనుక ఆమెలాగా కావాలి అనేది లక్ష్యంగా పెట్టుకున్నాను. అంతవరకూ చదవడమే తప్ప రాయలేదు. అప్పుడే మొదటి కథ 'మలుపు'ను ఓ వీక్లీ పత్రిక నిర్వహించిన దీపావళి కథల పోటీకి పంపిస్తే తిరిగి వచ్చింది. వెంటనే దాన్ని మరో పత్రిక నిర్వహించిన దీపావళి కథల పోటీకి పంపగా కథకు స్పెషల్ బహుమతి వచ్చినట్టు టెలిగ్రామ్ వచ్చింది. స్నేహితులతో కలిసి హాస్టల్ కారిడార్‌లో చదువుతూ ఉండగా ఈ విషయం తెలిసి అందరిలో ఎంతో ఆనందం నిండింది. ఇంటర్ ఫస్టియర్‌లో ఉండగానే విశాఖ రచయితల సంఘం కార్యక్రమాలలో పాల్గొనగలిగాను. అప్పుడు రాచకొండ విశ్వనాథశాస్త్రి, ముప్పాళ రంగనాయకమ్మ, కారా మాస్టారు, బలివాడ కాంతారావు, అంగర వెంకటకృష్ణారావు వంటి మొదలగు మహా రచయితలు అందులో ఉండేవారు. సమావేశాలు చాలా రెగ్యులర్‌గా జరిగేవి. విశాఖ రచయితల సంఘం కార్యక్రమాలకు హాజరవడం కార్యక్రమాలకు హాజరవడం పెద్ద, పెద్ద రచయితల ప్రసంగాల్ని వినడం ఒక గొప్ప అవకాశంగా నేను భావిస్తాను. వారు వెలువరించిన 'విశాఖ' సాహితీ పత్రిక సంపాదకవర్గంలో నన్ను చేర్చారు. అది నాకు గర్వకారణమైంది. ఆ సమయంలో ఆరుద్ర, రామలక్ష్మి, ముళ్ళపూడి వెంకటరమణగార్ల తోటి పరిచయాలు చాలా గొప్పగా అనిపించేవి. భీమిలి మొదలగు వేరే ప్రాంతాలు కూడా తీసుకువెళ్ళేవారు. 2-3 సంవత్సరాలు చాలా రెగ్యులర్‌గా వెళ్ళేవాళ్ళం. నేనెందుకు రాశాను? వంటి అంశాలపై రాయించేవారు. క్లినికల్ వైపు రాగానే మేనమామతో వివాహం, ఏడాదిలో పాపాయి పుట్టడం జరిగింది.

వైద్య వృత్తి చేస్తూ రచనలు చేశారు. ఎలా సాధ్యం..?

ఆంధ్రజ్యోతి వీక్లీ సంపాదకులు పురాణం సుబ్రహ్మణ్యంశర్మగారు ఆయనే 'పేషంట్ చెప్పే కథలు' అనే శీర్షిక పెట్టి దాదాపుగా ఒక 25/30 కథలు రాయించారు. 1983లో సోవియట్ రష్యా పర్యటనకు వెళ్ళినప్పుడు ఆ కథలు రాయడానికి అంతరాయం కలిగింది. కాకినాడ వెళ్ళిన కొత్తలో 'వనిత'లో కథ అచ్చు అయ్యాక సాహితీరంగంలో తిరిగి చూసుకొనవలసిన అవసరం లేకపోయింది. ఆంధ్రజ్యోతి, వనిత సంపాదకులు అడిగి మరీ నా చేత కథలు ప్రత్యేక సంచికలకు రాయించే వారు. వారి ప్రోత్సాహం లేకుంటే ఏనాడో రచయిత్రిగా కనుమరుగయ్యేదాన్ని అనుకుంటాను.

మీరు తీసుకొచ్చిన పుస్తకాల గురించి చెబుతారా..?

'రీడర్స్ డైజెస్ట్' అనే ఆంగ్ల పత్రికలో మన శరీరంలోని సుమారు 15 వ్యవస్థల గురించిన పరిచయం ఇంగ్లీషులో ప్రచురించారు. "వనిత' పత్రికలో అదే నమూనాలో తెలుగులో రాసి ఇమ్మని అడిగారు. వాటినే 'మన దేహం కథ' పేరుతో విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ పుస్తకంగా పబ్లిష్ చేసింది. చాలా ఏండ్లు మరల మరల ప్రచురించి పుస్తకానికి రాయల్టీ కూడా ఇచ్చేవారు. గర్భిణీ స్త్రీలకు సలహాలు, తీసుకోవలసిన జాగ్రత్తలు చెప్పడానికి సమయం లేక వారు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి 'మాతృత్వం' అను పేరుతో ఒక పుస్తకంగా రాశాను. మొదటిసారి నేనే ముద్రించుకున్నాను. తర్వాత విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ వారే ముద్రించేవారు. వృత్తిపరంగా చాలా బిజీగా ఉండేదాన్ని. ఓ.పీ పేషెంట్లను చూడడం, చిన్న చిన్న ప్రొసీజర్లు, మేజర్ సర్జరీలు అన్నిటితో ఊపిరి సలపని పని చేస్తున్నప్పుడే ఎక్కువ రచనలు చేసాను.



మహిళల కోసం మీరు చేసిన కార్యక్రమాలు..?

నాకు 50 ఏండ్లు వచ్చిన దగ్గర నుండీ నా సమయాన్నీ, ధనాన్నీ కూడా సమాజం కోసం ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నాను. అలాంటి ఉద్దేశాలు గల సంస్థల్లో పనిచేసేదాన్ని. స్లమ్ ఏరియాలలో ఉచితంగా హెల్త్ కాంపులు నిర్వహించి, ఉచితంగా మందులు ఇవ్వడం చేసేదాన్ని. 1982లో మా ప్రాంతంలోని మహిళలంతా కలసి 'చైతన్య వనితా మండలి'ని ఏర్పాటు చేసి దానికి నన్ను అధ్యక్షురాలిగా ఉండమని కోరారు. అప్పటి నుండి నేటిదాకా ఆ మండలి అధ్యక్షురాలిగా కొనసాగుతున్నాను. మహిళల కోసం మహిళలే కాకుండా మహిళల అభివృద్ధి సాధికారత కోరుకునే పురుషులను కూడా చేర్చుకుని 'సెంటర్ ఫర్ ఉమెన్ ఎంపవర్‌మెంట్ అండ్ డెవెలప్‌మెంట్ ఆఫ్ ఉమెన్' అనే సంస్థను ప్రారంభించాం. మహిళల ఉన్నతి కోసం మహిళల సాధికారత పట్ల అందరం కలిసి అనేక కార్యక్రమాలు ఉద్యమరూపంలో చేసాం.



మీరు మహిళల కోసం ఓల్డ్ ఏజ్ హోమ్ నిర్వహిస్తున్నారు అని తెలిసింది. వివరాలు చెప్పండి..?

వైద్యం కోసం నా దగ్గరకు వచ్చే వయసు పైబడిన మహిళలను గమనించాను. కుటుంబంలో తాము ఎదుర్కొనే నిరాదరణను, పడే అవమానాల్ని, బాధలను ఎవరికీ చెప్పుకోలేరు, కుటుంబం లోపల ఉండలేరు, బయటకు రాలేరు. అలాంటి మానసిక వ్యథలతో కుంగిపోయే మహిళలకు ఉపశమనం, ఆశ్రయం కలిగిచడం కోసం రోటరీ క్లబ్ అధ్యక్షురాలిగా ఉన్న సమయంలో వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేయాలని పట్టుదలగా ప్రయత్నించాం. ముందుగా 'రోటరీ ఆశ్రయ' పేరుతో ఎనిమిది మంది వృద్ధ మహిళలతో మా ఆస్పత్రిలో వృద్ధాశ్రమాన్ని ప్రారంభించాం. తర్వాత కాలంలో వృద్ధాశ్రమం కోసం ప్రభుత్వ 1100 చదరపు గజాల స్థలం కేటాయించింది. అమెరికాలో ఉండే ముత్యాల సీత వారి తల్లి చంద్రు సుబ్బాయమ్మ పేరిట 5 లక్షలు విరాళంగా ఇచ్చారు. దాంతో పాటు మరెంతోమంది సహృదయంతో ఇచ్చిన విరాళాలతో 'చంద్రు సుబ్బాయమ్మ రోటరీ ఆశ్రయ' ఏర్పడింది. 40 మంది ఉండేందుకు సౌకర్యవంతంగా, చక్కటి వాతావరణంలో ఏర్పాటు చేసిన ఆశ్రయ 22 ఏండ్లుగా నిరాటంకంగా నడుస్తుంది.

మీ భవిష్యత్ ప్రణాళిక..?

'సర్వైకల్ క్యాన్సర్ ముక్తభారత్' నినాదంతో జాతీయస్థాయి గైనిక్ అసోసియేషన్ వారి పిలుపు మేరకు పేద మహిళలకు సర్వికల్ కేన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్ గురించి అవగాహన కలిగించి ఆవ్యాధుల నివారణకు కృషి చెయ్యాలని అనుకుంటున్నాను. కౌమార బాల్యం, ముఖ్యంగా బాలికలకు న్యూట్రిషన్, హైజీన్, లైంగిక హింస, పునరుత్పత్తి, లైంగిక ఆరోగ్యం మొదలైన అంశాలపై అవగాహన కలిగించేందుకు పుస్తకాల్ని రాయాలని అనుకుంటున్నాను.

పుట్ట పాడులో ఎన్‌కౌంటర్

నవతెలంగాణ-చర్ల

తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దుల్లో పోలీసులు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతిచెందారు. ఈ సంఘటన చత్తీస్‌గఢ్‌లోని ఎర్రంపాడు పరిధి పుట్టపాడు అడవుల్లో ఆదివారం జరిగింది. నిషేధిత సీపీఐ(మావోయిస్టు) చెందిన ఒక యాక్షన్ టీం పోలీసులపై దాడి చేయాలనే లక్ష్యంతో సంచరిస్తున్నారనే విశ్వసనీయ సమాచారంతో పోలీసులు కూంబింగ్ ఆపరేషన్ చేపట్టారు. పోలీసులపై ఆదివారం ఉదయం కిష్టారం పోలీస్ స్టేషన్ పరిధిలో పుట్టపాడు అటవీ ప్రాంతంలో సుమారుగా 6.10 గంటలకు అకస్మాత్తుగా ఒక ఎత్తైన ప్రదేశం నుంచి మావోయిస్టులు కాల్పులు జరిపారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు తిరిగి ఎదురు కాల్పులు జరిపారు. కొన్ని నిమిషాల పాటు మావోయిస్టులు, పోలీసులకు మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. అనంతరం ఆ ప్రదేశంలో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా రెండు మృతదేహాలు, ఒక ఎస్ఎల్ఆర్ ఆయుధం, ఒక సింగల్ బోర్ తుపాకీ ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. మృతిచెందిన వారిలో.. ఒకరు చర్ల ఎల్ఓఎస్ కమాండర్ మడకం ఎర్రయ్య రాజేష్‌గా గుర్తించారు. మరొకరి వివరాలు తెలియాల్సి ఉంది. ప్రస్తుతం ఇంకా కూంబింగ్ ఆపరేషన్ కొనసాగుతుందని ఎస్పీ తెలిపారు.

పుట్టపాడు ఎన్‌కౌంటర్ బూటకం : మావోయిస్టు నేత ఆజాద్

నిరాధాయుడైన రాజేష్‌ను బూటకపు ఎన్‌కౌంటర్ చేశారని అల్లూరి సీతారామరాజు, భద్రాద్రి కొత్తగూడెం డివిజన్ మావోయిస్టు పార్టీ కార్యదర్శి ఆజాద్ తెలిపారు. ఆ మేరకు ఆదివారం ఆయన ఓ లేఖ విడుదల చేశారు. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు పుట్టపాడు అటవీ ప్రాంతంలో ఎన్‌కౌంటర్ జరిగిందని ఇందులో కమాండర్ రాజేష్, మరో దళ సభ్యుడు చనిపోయారని, ఒక ఎస్ఎల్ఆర్ తుపాకి దొరికిందని పోలీసులు చెబుతున్న విషయాలు బూటకమని పేర్కొన్నారు. ప్రజలు, ప్రజాస్వామికవాదులు.. ఈ ఎన్‌కౌంటర్‌ను ఖండించాలని సూచించారు. కామ్రేడ్ రాజేష్ పార్టీ పనుల రీత్యా నిరాయుధంగా ఒకరే పుట్టపాడు గ్రామానికి వెళ్ళారు. ఒక ద్రోహి ఇచ్చిన సమాచారంతో పట్టుకొని, చిత్రహింసలు పెట్టి కాల్చిచంపి, ఇది నిజమైన ఎన్‌కౌంటర్ అని నమ్మించడానికి తమతో పాటు తెచ్చుకున్న ఎస్ఎల్ఆర్ తుపాకీని పెట్టారని తెలిపారు. అదేవిధంగా పుట్టపాడు గ్రామానికి చెందిన నందాల్ అనే అమాయక ఆదివాసీని కూడా కాల్చి హత్య చేసారని తెలిపారు. ఇది పోలీసులు పిరికిపంథా చర్య అని విమర్శించారు. కాగా, ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లా కంగాల్ గ్రామంలోని ఆదివాసీ మడకం కటుంబంలో రాజేశ్(26) జన్మించినట్టు తెలిపారు. అతని 19వ యేటా విప్లవోద్యమంలో చేరి 2016 నుంచి 2022 అక్టోబర్ వరకు చర్ల ఎల్ఓఎస్ సభ్యునిగా, 2022 అక్టోబర్లో చర్ల ఎల్ఓఎస్ కమాండర్‌గా ప్రమోట్ అయి సేవలందిస్తున్నాడు. వీరి హత్యకు బీఆర్ఎస్ పార్టీ లీడర్లు, ఎస్పీ వినిత్, డీఎస్పీ సత్యనారయణ, సీఐ అశోక్ ఈ హత్యకు పూర్తి బాధ్యత వహించాలని తెలిపారు.

బ్రిజ్ భూషణ్ ను జైలుకు పంపండి

(మొదటిపేజీ తరువాయి)

పంజాబ్ నుంచి వచ్చిన రైతులను ఢిల్లీ సరిహద్దుల వద్ద పోలీసులు అడ్డుకున్నారు. రైతులు ఢిల్లీలోకి ప్రవేశించకుండా టిక్రీ సరిహద్దు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులను నెట్టుకుంటూ రైతులు, మహిళ రైతులు ఢిల్లీలోకి ప్రవేశించారు. ఢిల్లీ పోలీసులు కొంతమంది ఖాప్ నాయకులను వారి ప్రయివేట్ వాహనాల్లో ఢిల్లీ

సరిహద్దుల నుంచి జంతర్ మంతర్ వరకు ప్రయాణించడానికి అనుమతించారు. అయితే, ఖాప్ నేతలను ట్రాక్టర్లపై దేశ రాజధానిలోకి అనుమతించలేదు. ఖాప్ పంచాయతీ అధ్యక్షుడు పాలం చౌదరి సురేందర్ సోలంకి మాట్లాడుతూ మహిళా రెజ్లర్లకు న్యాయం జరిగే వరకు నిరసన కొనసాగుతుందన్నారు. ఈ నిరసన కార్యక్రమాలను ఏ విధంగా మరింత ముందుకు తీసుకెళ్లాలో త్వరలోనే నిర్ణయిస్తామని చెప్పారు. ఖాప్ అధ్యక్షుడు బల్వంత్ ఫోగట్ మాట్లాడుతూ న్యాయం కోసం పోరాటంలో మల్లయోధులకు మద్దతు ఇవ్వడానికి వివిధ ఖాప్‌ల నాయకులు నిరసన ప్రదేశంలో సమావేశమయ్యామని అన్నారు. "ఈ ముఖ్యమైన విషయంలో మా తదుపరి చర్యల గురించి చర్చించడానికి మేం సమావేశాన్ని నిర్వహిస్తున్నాం" అని ఆయన చెప్పారు.

ఢిల్లీ పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. అన్ని ఎంట్రీ పాయింట్ల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. దాదాపు 300 మంది పోలీసులను, పారామిలటరీ సిబ్బందిని సింఘూ సరిహద్దులో మోహరించారు. ఔటర్ ఢిల్లీలో 200 మంది పోలీసులను మోహరించారు. బహదూర్‌ఘర్ (హర్యానా)కి అనుసంధానించే టిక్రీ సరిహద్దు వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. అన్ని వాహనాలను ఫరీదాబాద్-ఢిల్లీ సరిహద్దు, ఘజియాబాద్-ఢిల్లీ సరిహద్దు వద్ద కూడా నిలిపివేశారు. ఢిల్లీ పోలీసులు ట్రాక్టర్, ట్రాలీలు సరిహద్దు నుంచి దేశ రాజధానిలోకి ప్రవేశించడానికి అనుమతించలేదు. పోలీసులు అనేక వరుసల బారికేడ్లను ఏర్పాటు చేశారు.

రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఎఫ్ఐ)కి అనుబంధంగా ఉన్న హర్యానా అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ (హెచ్ఏడబ్ల్యూఏ) ముగ్గురు సభ్యులను సస్పెండ్ చేసింది. డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్‌కు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలో పాల్గొన్నందుకు ఝజ్జర్, హిసార్, మేవాత్ జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున సస్పెండ్ చేసింది. ఝజ్జర్‌లో వీరేందర్ సింగ్ దలాల్, హిసార్‌లో సంజయ్ సింగ్ మాలిక్ , మేవాత్‌లో జై భగవాన్ అనే ముగ్గురు సభ్యులను సస్పెండ్ చేస్తూ హెచ్ఏడబ్ల్యూఏ రాష్ట్ర అధ్యక్షుడు రోహతాస్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు.

బ్రిజ్ భూషణ్‌పై వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు చేసేందుకు ఏర్పాటైన కమిటీ నివేదికను బయటపెట్టడంలో ప్రభుత్వం ఆలస్యం చేస్తోందని రెజ్లర్లు ఆరోపిస్తున్నారు. ఆయన తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. దర్యాప్తు జరుగుతున్నప్పటికీ డబ్ల్యూఎఫ్ఐ తన కార్యకలాపాలను పున్హప్రారంభించడం పట్ల విచారం వ్యక్తం చేస్తున్నారు.

సుప్రీం మాజీ న్యాయమూర్తితో ఉన్నత స్థాయి విచారణ జరపాలి : ఏఐకేఎస్ ఉపాధ్యక్షుడు హన్నన్ మొల్లా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

బీజేపీ ఎంపీ, డబ్ల్యూఎఫ్ఐ చీఫ్ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను వెంటనే అరెస్టు చేసి, జైలుకు పంపాలని ఏఐకేఎస్ ఉపాధ్యక్షుడు హన్నన్ మొల్లా డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ నాయకులతో పాటు పెద్ద సంఖ్యలో రైతులు జంతర్ మంతర్ వద్ద మల్లయోధుల ఉద్యమానికి మద్దతు తెలిపారని ఎస్కేఎం తెలిపింది. ఎస్కేఎం నాయకులు దర్శన్‌పాల్, హన్నన్ మొల్లా, యుధ్‌బీర్ సింగ్, రాకేశ్ తికాయిత్, ఉగ్రహాన్, ఆశిస్ మిట్టల్, ప్రేమ్‌సింగ్, ఇంద్రజీత్ సింగ్, కృష్ణప్రసాద్ పాల్గొన్నారని పేర్కొంది. ఈ మేరకు ఎస్కేఎం ప్రకటన విడుదల చేసింది. రెజ్లర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చైర్మెన్, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌పై లైంగిక నేరాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న మా సోదరీమణులు, సోదరులకు తమ పూర్తి మద్దతును ప్రకటించారని తెలిపింది. ఖాప్ పంచాయతీలు కూడా పెద్ద సంఖ్యలో రెజ్లర్లకు మద్దతుగా నిలిచాయని పేర్కొంది. ఈ సందర్భంగా ఎస్కేఎం తరపున హన్నన్ మొల్లా మల్లయోధులకు మద్దతు ప్రకటించారు. నేరస్థుడైన ఎంపీని వెంటనే అరెస్ట్ చేసి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు.

డబ్ల్యూఎఫ్ఐ చైర్మెన్ పదవి నుంచి ఆయనను తొలగించాలని అన్నారు.. సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జితో ఉన్నత స్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. బ్రిజ్ భూషణ్ నేరగాళ్ల వల్ల రెజ్లర్‌ల ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉన్నందున వారికి ప్రభుత్వం పూర్తి భద్రత కల్పించాలని కోరారు. బ్రిజ్ భూషణ్, కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మలను దహనం చేసేందుకు పిలుపు ఇచ్చామని అన్నారు. నేరస్తులకు శిక్ష పడే వరకు తాము రెజ్లర్లకు అండగా ఉంటామని ప్రకటించారు.

గుజరాత్‌లో 41 వేల మంది మహిళల అదృశ్యం

అహ్మదాబాద్ : ఐదేండ్ల కాలంలో గుజరాత్‌లో 41 వేల మందికి పైగా మహిళలు అదృశ్యమయ్యారు. జాతీయ నేర రికార్డుల బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) అందించిన వివరాల ప్రకారం 2016లో 7,105, 2017లో 7,712, 2018లో 9,246, 2019లో 9,268, 2020లో 8.290 మంది మహిళల ఆచూకీ తెలీకుండా పోయింది. దీంతో ఐదేండ్లలో అదృశ్యమైన మహిళల సంఖ్య 41,621కి చేరింది. రాష్ట్ర ప్రభుత్వం 2021లో అసెంబ్లీలో చేసిన ప్రకటన ప్రకారం 2019-2020లో అహ్మదాబాద్, వడోదరలోనే 4,722 మంది మహిళలు కన్పించకుండా పోయారు. రాష్ట్రానికి చెందిన బాలికలు, మహిళలను తరచుగా ఇతర రాష్ట్రాలకు పంపి వ్యభిచారంలోకి దింపుతున్నారని గుజరాత్ మానవ హక్కుల కమిషన్ సభ్యుడు సుధీర్ సిన్హా చెప్పారు. మిస్సింగ్ కేసులు హత్య కేసుల కంటే తీవ్రమైనవని ఆయన తెలిపారు. పోలీసులు ఈ కేసుల విచారణను నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. బాలికలు అదృశ్యం కావడానికి మానవ అక్రమ రవాణాయే కారణమని రాష్ట్ర మాజీ అదనపు డీజీపీ డాక్టర్ రాజన్ ప్రియదర్శి తెలిపారు. మహిళల అదృశ్యంపై గుజరాత్ కాంగ్రెస్ ప్రతినిధి హిరేన్ బంకర్ మాట్లాడుతూ 'కేరళ మహిళల గురించి బీజేపీ నేతలు మాట్లాడుతుంటారు. కానీ గుజరాత్‌లో 40 వేల మందికి పైగా కన్పించకుండా పోతే పెదవి విప్పరు. పైగా ఇది దేశ ప్రధాని, హోం మంత్రి సొంత రాష్ట్రం' అని ఎద్దేవా చేశారు.

ఓటమి భయంతో బీజేపీ నాయకుల బెదిరింపులు

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

కర్నాటకలో ఓటమి భయంతో కాంగ్రెస్ నాయకులను చంపుతామని బెదిరిస్తున్న బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి మణికంఠ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి కోరారు. ఆదివారం కాంగ్రెస్ నాయకులు సంపత్ కుమార్, అంజన్ కుమార్ యాదవ్ ఇతర నాయకులతో కలిసి ఆయన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి మణికంఠ్‌పై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అందుకు సంబంధించిన ఆడియో టేప్‌ను ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డికి అందజేశారు. అనంతరం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కర్నాటకలో ఓటమి భయంతో చిత్తాపూర్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి మణికంఠ బహిరంగంగా చిత్తాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి ప్రియాంక ఖర్గేను, వారి తండ్రి మల్లికార్జున ఖర్గేను, వారి కుటుంబ సభ్యులను చంపుతానని బెదిరించారని తెలిపారు. దాంతో అతనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ గెలుస్తుందని, అందుకు ఉదాహరణ ఇటీవల హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ విజయం అన్నారు. ఇప్పుడు కర్నాటకలో కూడా కాంగ్రెస్ గెలుస్తుందని, అలాగే తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

అప్పుల ఊబిలో కర్నాటక

ప్రతి ఓటరు పైనా రూ. 1.2 కోట్ల రుణ భారం

- సంక్షేమానికి అరకొర కేటాయింపులే
- 10న తేలనున్న బీజేపీ ప్రభుత్వ భవితవ్యం

బెంగళూరు : కర్నాటకలో ఇప్పటి వరకూ అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టేసింది. ఈ నెల 10న జరగబోయే అసెంబ్లీ ఎన్నికలలో ఆ పార్టీకి ఓటమి తప్పదని పలు ఒపీనియన్ పోల్స్ అంచనా వేయడానికి బహుశా ఇది కూడా ఒక కారణం కావచ్చు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు సైతం ఈ వాదనకు బలం చేకూరుస్తున్నాయి. కర్నాటకలో బీజేపి తిరిగి అధికారంలోకి రావడం కష్టమేనని మెజారిటీ సర్వేలు తేల్చేశాయి. దేశంలో ఆర్థికంగా పటిష్టంగా ఉన్న రాష్ట్రాలలో కర్నాటకది నాలుగో స్థానం. ఆధునిక పరిశ్రమలకు కూడా అది కేంద్ర స్థానంగా కొనసాగుతోంది. అయినప్పటికీ గత నాలుగేండ్లలో బీజేపీ ప్రభుత్వం ఇబ్బడిముబ్బడిగా అప్పులు చేసింది.

ఆర్‌బీఐ క్రోడీకరించిన రాష్ట్రాల బడ్జెట్ల సమాచారం ప్రకారం ఈ సంవత్సరం మార్చి నాటికి కర్నాటక అప్పుల భారం రూ. 5.35 లక్షల కోట్లకు చేరింది. 2018లో ఈ అప్పులు కేవలం రూ. 2.46 కోట్లు మాత్రమే. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రతి ఓటరు తల పైనా 1,02,107 రూపాయల రుణ భారం పడుతోంది. గత ఐదేండ్లలో తలసరి అప్పు 106 శాతం పెరగడం (2018లో ఇది రూ. 49,505 మాత్రమే) ఆందోళన కలిగిస్తోంది. నూతన రంగాలలో పెట్టుబడుల కోసం అప్పులు చేయక తప్పదని పాలక పక్షాలు వాదిస్తుంటాయి. 2017లో కేంద్రం జీఎస్టీ విధించిన తర్వాత రాష్ట్రాలకు కేంద్ర సాయం తగ్గిపోయింది. రుణాలు సైతం అందడం లేదు. ఇలాంటి పరిస్థితులలో అప్పులు అనివార్యమని రాష్ట్రాలు చెబుతున్నాయి. ఇందులో కొంత వాస్తవం లేకపోలేదు. పైగా కోవిడ్ అనంతర పరిస్థితులను ఎదుర్కోవడానికి పెడుతున్న ఖర్చులో రాష్ట్రాలే ఎక్కువగా భరించాల్సి వస్తోంది. అయినప్పటికీ సామాజిక రంగాలపై



ప్రభుత్వాలు తగినంత మొత్తాన్ని ఖర్చు చేయాల్సిన అవసరం ఉంది. అయితే కర్నాటకలో ఇందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. 2022-23 బడ్జెట్‌లో కర్నాటకలోని డబుల్ ఇంజన్ ప్రభుత్వం మొత్తం వ్యయంలో విద్యపై కేవలం 12 శాతం మాత్రమే ఖర్చు చేస్తానని ప్రతిపాదించింది. దేశంలోని ఇతర రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు సగటున విద్యకు కేటాయించిన 13.6 శాతంతో పోలిస్తే ఇది తక్కువే. అదే విధంగా వైద్యం, ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమం పద్దుకు కేటాయించింది 5.4 శాతమే. ఇతర రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో ఈ రంగానికి సగటున కేటాయించిన 5.7 శాతం నిధులతో పోల్చినా కూడా ఇది తక్కువే. వాస్తవానికి విద్యా రంగంపై 2019-20లో కర్నాటక ప్రభుత్వం 12.4 శాతం ఖర్చు చేయగా 2022-23 నాటికి అది 12 శాతానికి తగ్గిపోయింది. వైద్యం, ప్రజారోగ్యంపై 2019-20లో 4.1 శాతం ఖర్చు చేయగా కోవిడ్ అనంతరం ప్రజల డిమాండ్‌కు అనుగుణంగా 2021-22 (సవరించిన అంచనాలు)లో 5.8 శాతం ఖర్చు చేశారు. అయితే ఆ తర్వాత ఈ రంగంపై వ్యయం తగ్గుతూ వచ్చింది. 2022-23లో 5.4 శాతం మాత్రమే ఖర్చు చేశారు. బీజేపీ ప్రభుత్వం రుణాల ద్వారా సమీకరించిన వనరులను ప్రజా సంక్షేమానికి వెచ్చించడంలో విఫలమైంది. 2020-21లో రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో (జీఎస్‌డీపీ) అభివృద్ధి వ్యయం 9.4 శాతం ఉండగా 2021-22 నాటికి 8 శాతానికి, 2022-23 బడ్జెట్ అంచనాలలో 7.6 శాతానికి తగ్గింది. అదేవిధంగా 2020-21లో సామాజిక రంగంపై జీఎస్‌డీపీలో ఐదు శాతం ఖర్చు చేయగా అది 2021-22లో 4.9 శాతానికి, 2022-23లో 4.5 శాతానికి తగ్గింది. దీనిని బట్టి అర్థమవుతోంది ఏమంటే బీజేపీ పాలిత రాష్ట్రాల ప్రభుత్వాలు అప్పుల ద్వారా వనరులు సమీకరిస్తాయి. ముఖ్యంగా వాణిజ్య లేదా మార్కెట్ నుంచి రుణాలు పొందుతాయి. కానీ విద్య, ఆరోగ్యం, సామాజిక సంక్షేమం వంటి ప్రజా సంక్షేమ చర్యల కోసం మాత్రం నిధులు విదల్చవు. బహుశా ఈ రుణాలను మూలధనపు వ్యయం కోసం ఉపయోగిస్తూ ఉండవచ్చు. అంటే మౌలిక సదుపాయాల కల్పన వంటి పద్దుల కోసం వ్యయం చేయవచ్చు. అయితే అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం ఈ వ్యయం కూడా సరిగా ఉండడం లేదు. 2020-21లో జీఎస్‌డీపీలో మూలధనపు వ్యయం కోసం 2.6 శాతం కేటాయించగా 2021-22లో 1.9 శాతానికి తగ్గిపోయింది. 2022-23లో కూడా బడ్జెట్ అంచనాలు అదే విధంగా ఉన్నాయి. ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుంటే ఈ కేటాయింపు చాలా తక్కువ. ఒక్క మాటలో చెప్పాలంటే ఇతర రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతో పోలిస్తే కర్నాటకలో వివిధ రంగాలకు బీజేపీ ప్రభుత్వం చేస్తున్న కేటాయింపులు చాలా తక్కువగా ఉంటున్నాయి. అభివృద్ధి వ్యయం కోసం ఇతర ప్రాంతాలు 12.5 శాతం కేటాయిస్తే కర్నాటక కేవలం 7.6 శాతం, సామాజిక రంగానికి ఇతర ప్రాంతాలు 8.4 శాతం కేటాయిస్తే కర్నాటక 4.5 శాతం, మూలధనపు వ్యయానికి ఇతర రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు 2.9 శాతం కేటాయిస్తే కర్నాటక 1.9 శాతం మాత్రమే కేటాయించింది.

కర్నాటకలో సంక్షేమ రంగాలకు బీజేపీ ప్రభుత్వం చేస్తున్న అరకొర కేటాయింపుల కారణంగా సామాన్య ప్రజానీకానికి పెద్దగా ఒరిగిందేమీ లేదు. దీనితో పాటు ప్రభుత్వంలో అవినీతి పెచ్చరిల్లిపోయిందన్న విమర్శల జడివానలో బసవరాజ్ బొమ్మై ప్రభుత్వం తడిసి ముద్దవుతోంది. వీటన్నింటి నడుమ కర్నాటక ప్రజలు ఇచ్చే తీర్పు కోసం దేశమంతా ఆసక్తిగా ఎదురు చూస్తోంది.

నేడు యువ సంఘర్షణ సభకు తరలాలి

- కాంగ్రెస్ ఎల్‌బీ నగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి మల్ రెడ్డి రాంరెడ్డి



నవతెలంగాణ-ఎల్‌బీ నగర్

సరూర్ నగర్ స్టేడియంలో సోమవారం నిర్వహించే నిరుద్యోగ యువ సంఘర్షణ సభకు విద్యార్థులు, నిరుద్యోగులు వేలాదిగా తరలి రావాలని కాంగ్రెస్ ఎల్‌బీ నగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సభకు కాంగ్రెస్ అగ్రనేత ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ రానున్నట్టు తెలిపారు. టీపీసీసీ అధ్యక్షులు ఎనుముల రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యువ సంఘర్షణ సభకు విద్యార్థులు, నిరుద్యోగులు అధిక సంఖ్యలో హాజరై, విజయవంతం చేయాలని కోరారు. రఘువీర్ రెడ్డి టీపీసీసీ సెక్రటరీ, కిషోర్ గౌడ్ కొత్తపేట డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

సీఐటీయూ మండల కమిటీ అధ్యక్షురాలిగా సుజాత, ప్రధాన కార్యదర్శిగా భాగ్యలక్ష్మి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

సీఐటీయూ బడంగ్‌పేట్ మండల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికయింది. ఈ కమిటీలో అధ్యక్షురాలిగా సుజాత, ప్రధాన కార్యదర్శిగా భాగ్యలక్ష్మి, కోశాధికారి సుజాత, సహాయ కార్యదర్శిగా అనిత, కమిటీ సభ్యులు సుమలత, లీలావతి, వరలక్ష్మి, హేమలత, రజినిలను ఎన్నికయ్యారు. అనంతరం మేడే ఉత్సవాల్లో పాల్గొని సీఐటీయు జెండా ఆవిష్కరించారు. బాలాపూర్ మండల ఆశా వర్కర్స్ సీఐటీయూ కార్మిక సంఘంలో చేరినట్టు ఆ సంఘం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ఎం. యాదయ్య, దాసరి బాబు, యాదగిరి చారి, బాలాపూర్ మండల కన్వీనర్ జె.పెంటయ్య, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

జేపీఎస్, వోపీఎస్‌లను వెంటనే రెగ్యులర్ చేయాలి

సీపీఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ డిమాండ్

నవతెలంగాణ-అడిక్‌మెట్

జూనియర్ పంచాయతీ సెక్రటరీలు, ఔట్ సోర్సింగ్ పంచాయతీ సెక్రటరీలు రెగ్యులరైజ్ చేసి, వారి సమస్యలు పరిష్కరించాలని సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 12,700 గ్రామపంచాయతీల్లో దాదాపు 9వేల మంది జేపీఎస్, 3 వందల మంది ఓపీఎస్‌లు ఉన్నారని తెలిపారు. ఈ నియామకాల నోటిఫికేషన్‌లో మూడేండ్లకు రెగ్యులర్ చేస్తామని ఉందన్నారు. కానీ జీవో 26 ద్వారా మరో ఏడాది పొడిగించిందనీ తెలిపారు. ఏప్రిల్ 11, 2023 కు ప్రభుత్వం ప్రకటించిన నాలుగేండ్ల సమయం కూడా పూర్తైనా వారిని యథావిధిగా కొనసాగిస్తున్నారని చెప్పారు. నోటిఫికేషన్ ప్రకారం రెగ్యులరైజ్ చేస్తామని మోసగించిన ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా 10 రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ, ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. వీరికి కారుణ్య నియామకాలు లేవునీ, ఇన్సూరెన్స్, ఏదైనా ఆపద వస్తే సెలవులు పెట్టుకునే అవకాశమే లేకపోగా, పని భారం మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అంతేకాకుండా ఉద్యోగి రిటైర్‌మెంట్ అయిన తర్వాత పొందాల్సిన బెనిఫిట్స్ వీరికి వర్తించడం లేదన్నారు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి, జేపీఎస్, వోపీఎస్‌లను వెంటనే రెగ్యులర్ చేసి, వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

పద్మారావును మర్యాదపూర్వకంగా కలిసిన రవి



నవతెలంగాణ-ఓయూ

తెలంగాణా స్టేట్ టాడి ట్యాపర్స్ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేటర్ చైర్మెన్‌గా నియమితులైన సందర్భంగా పల్లె రవి కుమార్ గౌడ్ ఆదివారం డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావుగౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనను డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ అభినందించి, రాష్ట్రంలో గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. గౌడ్ కులానికి చెందిన గీత కార్మికుల సాధక బాధకాలను పరిగణంలోకి తీసుకుని వారి సంక్షేమానికి కృషి చేస్తానని పల్లె రవి కుమార్ గౌడ్ ఈ సందర్భంగా తెలిపారు.

నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలం

- డీసీసీ అధ్యక్షుడు సి. రోహిన్‌రెడ్డి



నవతెలంగాణ-బంజారా హిల్స్

యువతకు ఉద్యోగ భరోసా కల్పించడంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని డీసీసీ అధ్యక్షులు సి. రోహిన్‌రెడ్డి అన్నారు.ఆదివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూత్ డిక్లరేషన్ సభకు కాంగ్రెస్ అఖిల భారత ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ మొట్ట మొదటి సారిగా తెలంగాణ రాష్ట్రానికి రానున్నట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో యువత అధిక సంఖ్యలో పాల్గొని, తమ హక్కులు, భవిష్యత్ కార్యాచరణను తెలుసుకోవాలని సూచించారు. సీఎం కేసీఆర్ తన కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు కల్పించి, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో నిర్లక్ష్యమెందుకని నిలదీశారు. రాష్ట్రంలో టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకైనా, తప్పిదాలు సర్వసాధారణం అన్నట్టు మంత్రులు మాట్లాడితే సీఎం కేసీఆర్ స్పందించకపోవడం విచారకరమన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, వెంకట్ రామ్‌రెడ్డి, సరిత, రాజు తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రి ఆలయానికి వీల్ చైర్‌లు అందజేత




నవతెలంగాణ-ధూల్ పేట్

హైదరాబాద్‌కు చెందిన స్వచ్ఛంద సంస్థ(ఎన్జీఓ) హెల్ప్ స్టెప్స్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రముఖ పుణ్యక్షేత్రం తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన యాదాద్రి ఆలయానికి వీల్ చైర్స్ అందజేసింది. ఈ ఆలయ ప్రజా సంబంధాల అధికారికి ఫౌండేషన్ అధ్యక్షులు నాగవెల్లి శ్రీనివాస్, సభ్యులు చంద్రగిరి కార్తీక్, గుమ్మడవెల్లి కిరణ్, కుర్రె శ్రీనివాస్, ఎల్లావుల భూమేష్, జిలకర శ్రీకాంత్, బడేటి విష్ణు, నిరుడు బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

'యువ సంఘర్షణ సభ' కు తరలాలి

- కాంగ్రెస్ నేత వెంకటేష్



నవతెలంగాణ-ధూల్‌పేట్

ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ముఖ్య అతిథిగా సరూర్ నగర్ స్టేడియంలో నిర్వహించే యువ సంఘర్షణ సభకు నిరుద్యోగ యువకులు, కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కాంగ్రెస్ చార్మినార్ నియోజక వర్గం ఇన్‌చార్జి కె.వెంకటేష్ పిలుపు నిచ్చారు. టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం నిర్వహించే నిరుద్యోగ నిరసన సభకు పాతబస్తీలోని అన్ని నియోజక వర్గాల నుంచి నిరుద్యోగులు, యువతీ యువకులు తరలిరావాలని కోరారు. ఈ సభలో ప్రియాంక గాంధీ నిరుద్యోగ డిక్లరేషన్ ప్రకటించనున్నట్టు తెలిపారు.

యువత విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి





హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ

నవతెలంగాణ-అడిక్‌మెట్

యువత విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించి దేశానికి, రాష్ట్రానికి గుర్తింపు తీసుకురావాలని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ సూచించారు. ఎన్టీఆర్ స్టేడియంలో రెండో రోజు నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ నాయకులు ఎమ్ఎన్ శ్రీనివాసరావు హాజరై, క్రికెట్ పోటీలకు టాస్ వేసి ప్రారంభించారు. ఈ సంద ర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ నాయిని నర్సింహారెడ్డి స్మారకార్థం క్రికెట్ పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. యువత క్రీడలు, విద్యపై దృష్టి సారించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసు కోవాలన్నారు. నాయిని తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాల్లో చురుకుగా పాల్గొని రాష్ట్ర సాధనలో కీలక భూమిక పోషించారని గుర్తు చేశారు. నేటి యువత నాయిని పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం ఎస్ఎస్ఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి వి. శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షులు నాయిని దేవేం దర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్టీఆర్ స్టేడియంలో ఎస్ఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలకు యువత నుంచి మంచి స్పందన లభిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో నగర నాయకులు కల్వ గోపి, బల్లెకారి రమేష్, శ్రీనివాస్, సిరిగిగిరి శ్యామ్, నేత శ్రీను, టక్కర్ శ్రీను తదితర నాయకులు క్రీడాభిమానులు పాల్గొన్నారు.

ఇందిరా పార్క్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతాం

ఎమ్మెల్యే ముఠా గోపాల్



నవతెలంగాణ-అడిక్‌మెట్

ముషీరాబాద్ నియోజకవర్గం లోని కవాడిగూడ డివిజన్‌లోని ఇందిరా పార్క్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. ఆదివారం ఇంద్రా పార్క్‌లోని స్విమ్మింగ్ పూల్ స్థలాన్ని పర్యవేక్షించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంద్రా పార్క్‌లో అత్యాధునిక హంగులతో స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. అదే విధంగా పార్కులో పర్యావరణం లో సహజంగా లభించే ఔషధ మొక్కలు నాటించామని తెలిపారు. ప్రతినిత్యం వందలాది మంది సందర్శించే ఈ ఇందిరా పార్కులో సకల వసతులు కల్పిస్తూ, ప్రజలకు ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకుంటు న్నట్టు తెలిపారు. ఈ కార్యక్ర మంలో యువ నాయకులు ముఠా జై సింహ, స్థానిక డివిజన్ ప్రెసిడెంట్ వల్లాల శ్యామ్ యాదవ్, లక్ష్మిగణపతి దేవస్థానం చైర్మెన్ ముచ్చకుర్తి ప్రభా కర్, కార్యదర్శి సాయికృష్ణ, సీనియర్ నాయకులు రామచందర్, వల్లాల శ్రీని వాస్, మాజీ కార్పొరేటర్ రవీందర్, ఇంద్రా పార్క్ ప్రెసిడెంట్ సుధాకర్, రాజేష్, కరక కిరణ్, హను మాన్ టెంపుల్ చైర్మెన్ రాజ శేఖర్‌గౌడ్, ముఠా శివ, సాయి, సందీప్, శివాలయం చైర్మెన్ శ్రీధ చారి, శంకర్ ముదిరాజ్, మధు పాల్గొ న్నారు.



కాంటాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులకు జీవో 14,16 ప్రకారం వేతనాలు చెల్లించాలి

కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్,ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు పి. నారాయణ



నవతెలంగాణ-ముషీరాబాద్

వాటర్ బోర్డులో ఔట్ సోర్సింగ్ కాంటాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న కార్మికులకు వెంటనే జీవో 14, 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్, ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు పి. నారాయణ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం బాగ్ లింగంపల్లిలోని బీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర కార్యాలయంలో సంబంధిత వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పరిధిలో పనిచేసే కాంటాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులు, జీహెచ్ఎంసీ కార్మికులు జీవో 14, జీవో 60 ద్వారా వేతనాలు పొందుతున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు రెండుసార్లు వేతనాలు పెంచింది కానీ, అదే శాఖ పరిధిలో పనిచేసే హెచ్ఎం డబ్ల్యూఎస్ఎస్‌బీలో పనిచేసే కాంటాక్ట్ అవుట్‌సోర్సింగ్ కార్మికులకు మాత్రం ప్రయివేట్ పరిశ్రమల్లో అమలు ద్వారా తక్కువ వేతనాలు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తొమ్మిది నుంచి 11 వేల వరకు చెల్లించి వేతనాలతో హైదరాబాద్ నగరంలో బతకడం చాలా కష్టంగా ఉందన్నారు. ఈ విషయం కాంట్రాక్టర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ మంత్రి కేటీఆర్‌తో పలుమార్లు విన్నవించుకోగా, సానుకూలంగా స్పందించి, జలమండలి ఎండీ దాన కిషోర్‌తో మాట్లాడి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్టు వెల్లడించారు. జీవో 14 ప్రకారం వేతనాలు అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్టు చెప్పారు. లక్షలాది మంది కార్మిక ఉద్యోగులకు న్యాయం చేస్తున్న సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లపై నమ్మకంతో ఉండాలని కార్మికులకు తెలిపారు.

విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటం ఆడొద్దు

- పరోక్షంగా కార్పొరేట్ విద్యా సంస్థలకు అప్పగింత
- ప్రయివేట్ పాఠశాలలకు వలసపోయే దుస్థితి
- తెలంగాణ నిరుద్యోగ జేఏసీ చైర్మెన్ నీల వెంకటేష్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

విద్యా ర్థుల భవిష్యత్‌తో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చెలగాట మాడుతోందని తెలంగాణ నిరుద్యోగ జేఏసీ చైర్మెన్ నీల వెంకటేష్ అన్నారు. ఆది వారం రాష్ట్రంలో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు, పలు శాఖలలో ఉన్న వేలాది ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లా డుతూ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చి ఎనిమిదేండ్లు గడిచినా డీఎస్సీ టీచర్ పోస్టులు భర్తీ చేయకపోవడం సిగ్గుచేటన్నారు.ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతామని చెబుతున్న సీఎం కేసీఆర్, అధికారులు హామీలు అమలుకు నోచుకోవడం లేదన్నారు. టీచర్లు లేక ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు దిక్కుతోచని స్థితిలో, ప్రయివేట్ పాఠశాలలకు వలస పోయే దుస్థితి రాష్ట్రంలో నెలకొందన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో 26 వేల టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ నోటిఫికేషన్ లేక లక్షలాది నిరుద్యోగులు బీఈడీ డబుల్ పీజీలు చేసి ఉద్యోగాలు లేక ఆం దోళనకు గురవు తున్నట్టు వెల్ల డించారు. ప్రభుత్వ విద్యా సంస్థలను మూసివేసి పరోక్షంగా రాబో యే రోజుల్లో కార్పొరేట్ విద్యా సంస్థలకు అప్పగించాలని చూస్తోందని ఆరోపించారు. ఎయిడెడ్ పాఠశాలల్లో 2,500 పోస్టులు, కస్తూర్బా గాంధీ పాఠశాలల్లో 1,200 పోస్టులు, ఆశ్రమ పాఠశాలల్లో 1,700 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటిని వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నిరుద్యోగ జేఏసీ నేతలు అనంతయ్య, రాజ్‌కుమార్, భాస్కర్ పాల్గొన్నారు.

ఉన్నత విద్యకు పేదలు దూరం

- మోడీ పాలనలో 58 శాతం ఫెలోషిప్ లేకుండా కుట్ర
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్. మూర్తి



నవతెలంగాణ-ఓయూ

యూనివర్సిటీ విద్యను పేద వర్గాలకు దూరం చేసేలా మోడీ ప్రభుత్వ వైఖరి ఉందనీ, ప్రధానంగా పరిశోధక విద్యార్థులను ఫెలోషిప్ లేకుండా రీసెర్చ్ దూరం చేసే కుట్ర చేస్తున్నట్టు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్.మూర్తి అన్నారు. ఇఫ్లూ యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ కన్వెన్షన్ ఉస్మానియా యూనివర్సిటీ డిస్కోర్స్ సెంటర్‌లో ఆదివారం నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని, మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులకు ఫెలోషిప్ లేకుండా రీసెర్చ్ దూరం చేసే కుట్ర జరుగుతోందన్నారు. గత మూడేండ్లుగా బీసీ విద్యార్థులకు ఫెలోషిప్‌లకు, నోటిఫికేషన్ లేదని ఎస్సీ, మైనార్టీ, బీసీ విద్యార్థులకు నెట్ నిబంధనలు పెట్టి మెరిట్ పేరుతో దూరం చేస్తున్నట్టు చెప్పారు. మోడీ ప్రభుత్వం పాలనలో 58 శాతం పెలోషిప్‌లకు కోత పెట్టినట్లు తెలిపారు. సెంట్రల్ యూనివర్సిటీలకు వీసీలు కేవలం తమ అనుకూలమైన వారికే కట్ట బెడుతున్నట్టు వెల్లడించారు. నూతన జాతీయ విద్యా విధానం ముసుగులో విద్యను కాషాయపు రంగు పులు ముతున్నరని ఆగ్రహం వ్యక్తం చేశారు. చరిత్రలోని వాస్తవాలను వక్రీకరించి, డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని తొలగించడం సరైంది కాదని హెచ్చరించారు. ఇఫ్లూ విశ్వవిద్యాలయంలో వీసీ విద్యార్థుల హక్కులు కాలరాసేలా అమలు చేస్తే, సహించబోమని హెచ్చరించారు.

కన్వెన్షన్‌లో 12 మందితో ఎస్ఎఫ్ఐ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నికయింది. ఈ కమిటీలో అధ్యక్షులుగా ఆనంద్, కార్యదర్శి అభయ్ క్రిష్ణ, ఉపాధ్యక్షులు అలెక్స్ అబ్రహం, సహాయ కార్యదర్శి శ్రేష్ఠ బట్టచార్యలను ఎన్నుకున్నారు.





క్రీడాకారుల ప్రతిభ వెలికితీసేందుకే క్రీడలు



- బేగంబజార్ కార్పొరేటర్ శంకర్‌యాదవ్, బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు భీష్వ ఓంప్రకాష్
- 9న 'ఖేలో భారత్-జీ తో భాగ్యనగర్' క్రీడలు ప్రారంభం

నవతెలంగాణ-సుల్తాన్ బజార్

భాగ్యనగర్‌లోని క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకు హైదరాబాద్ పార్లమెంట్‌లో బీజేపీ ఆధ్వర్యంలో 'ఖేలో భారత్ జీ తో భాగ్యనగర్' క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్టు క్రీడల కన్వీనర్ బేగంబజార్ కార్పొరేటర్ శంకర్‌యాదవ్, బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు భీష్వ ఓంప్రకాష్ అన్నారు. చాదర్ ఘాట్ విక్టోరియా ప్లే గ్రౌండ్‌లోని ఇన్ డోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఉన్న క్రీడాకారుల ప్రతిభ వెలికి తీసేందుకు ప్రధాన మంత్రి క్రీడా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని అన్నారు. దీనిలో భాగంగా 9నుంచి 12వ తేదీ వరకూ (కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్, అథ్లెటిక్) 15 ఏండ్లు పై బడిన వారికి నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ క్రీడలు 9న విక్టోరియా ప్లే గ్రౌండ్‌లో ప్రారంభించనున్నట్టు వెల్లడించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర పర్యాటక శాఖామంత్రి జి.కిషన్ రెడ్డి,ఎంపీ కె. లక్ష్మణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పలువురు జాతీయ, అంతర్జాతీయ క్రీడా కారులు, పలువురు క్రీడల ఇన్‌చార్జిలుగా కొనసాగుతునట్టు చెప్పారు. కబడ్డీ పోటీలకు అమర్సింగ్, వాలీబాల్‌కు రవిందర్, ఖోఖోకు సురేందర్, క్రికెటుకు నితిన్ నందేకర్, అథ్లెట్సుకు ఉమామహేశ్వర్ బాధ్యత వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపి గోషామహల్ కన్వీనర్ కృష్ణ, హైదరాబాద్ పార్లమెంట్ కన్వీనర్ ఇంద్రసేనారెడ్డి, సికింద్రాబాద్ ప్రభా వరి రవీందర్‌రెడ్డి, మంగళహాట్ కార్పొరేటర్ శశికళ, గోల్కొండ జిల్లా బీజేవైఎం నాయకులు నితిన్ నందేకర్, మైనార్టీ నాయకులు అబుసలాం, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'గొల్ల కలాపం' శిక్షణా శిబిరం



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

'గొల్ల కలాపం' కూచిపూడి నృత్యానికి తల మాణికమైందని ప్రముఖ నత్య గురువు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వాచార్యులు డాక్టర్ భాగవతుల సేతు రామ్ అన్నారు. ఆదివారం కోఠి శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాష నిలయంలో నవ్య నాటక సమితి 65వ వార్షికోత్సవం సందర్భంగా మూడు రోజులపాటు నిర్వ హిస్తున్న 'గొల్ల కలాపం' శిక్షణ శిబిరంలో సుమారు 40 మంది నిత్య గురువులు పాల్గొంటున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గొల్ల కలాపం నాటకంలో ముఖ్యపాత్ర దారులైన గొల్లభామ, సర్వ శాస్త్రాలు తెలిసిన విప్రుడు పాత్రల ద్వారా బ్రహ్మజ్ఞానం, ఆత్మజ్ఞానంతో పాటు జీవిత సత్యాలను వివరించడమే ముఖ్య ఉద్దేశమని తెలిపారు. నవ్య నాటక సమితి 65వ వార్షికోత్సవంలో అనేకమైన వైవిధ్య భరిత సంగీత నృత్య కార్యక్రమాలు సెమినార్లు నిర్వహించి, యువ కళాకారులు అనేకమంది పాల్గొనడం అభినందనలు తెలిపారు. ఈ శిబిరంలో ముఖ్యమైన నృత్య గురువులు పాల్గొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు వేమరాజు విజయకుమార్, ఆయనను ఘనంగా సన్మానించారు.

మహిళలు స్వయం శక్తితో ఆర్థికాభివృద్ధి సాధించాలి

కౌన్సిలర్ పుష్పమ్మ కొండల్ యాదవ్



నవతెలంగాణ-బడంగ్ పేట్

మహిళలు స్వయం శక్తితో ఆర్థికాభివృద్ధి సాధించాలని 13వ వార్డు కౌన్సిలర్ పుష్పమ్మ కొండల్ యాదవ్ అన్నారు. ఆదివారం మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న పహడి షరీఫ్ గ్రామంలో మహ్మద్దియ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు అబ్దుల్ హమీద్ ఖాన్‌తో కలిసి మహిళలకు కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో పేద ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాసర్ అవల్గి, సయ్యద్ ఖద్దిర్, మేరాజ్‌ఖాన్, గౌస్ ఖాన్, అమిత్ భాయ్, అమానుల్లా ఖాన్, శిరాజ్ పాష, రాహఫ్ భాయ్ పాల్గొన్నారు. ఉన్నారు.

నవతెలంగాణ
మల్కాజిగిరి
సోమవారం 08 మే 2023

అన్నా నగర్ రోడ్లను పరిశీలించిన ట్రాఫిక్ డీసీపీ

నవతెలంగాణ కంటోన్మెంట్

అన్నా నగర్ ఆటో ట్రాలీ వారికి అక్రమంగా చలాన్లు విధిస్తున్నారని రాష్ట్ర ఖనిజ సంపద చైర్మన్ మన్నె క్రిశాంక్ సీపీ సీవీ ఆనంద్‌కు మెమోరాండం సమర్పించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు 24 గంటల్లోపు హైదరాబాద్ డీసీపీ (ట్రాఫిక్) రాహుల్ హెగ్డే పార్కింగ్ సమస్యను పరిష్కరించేందుకు అన్నానగర్ రోడ్డును సందర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మాజీ బోర్డు సభ్యుడు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమస్యలు ఉన్న ప్రాంతాన్ని క్రిశాంక్ డీసీపీకి చూపించారు.



ఆలయ శంకుస్థాపన కార్యక్రమంలో బీఎల్ఆర్

నవతెలంగాణ-కాప్రా

శ్రీవిరాట్ నగర్ కాలనీలో శ్రీ అభయాంజనేయ స్వామి , శ్రీ పోచమ్మ తల్లి ఆలయ శంకుస్థాపన పూజా కార్యక్రమంలో బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నేమెలి మహేష్, వెంకటేశ్, కర్నాకర్, శివ, శేఖర్, బాల రాజు, కాంతారావు, చంద్రమౌళి, సత్యనారాయణ, నవీన్, టైలర్ శ్రీను, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.



8 గంటల పని విధానాన్ని కార్మికులు కాపాడుకోవాలి

- సీఐటీయూ నాయకులు
- మేడే వారోత్సవాల ముగింపు సభ

నవతెలంగాణ-కాప్రా

కార్మికులు ఐక్యంగా ఉండి ఎనిమిది గంటల పని దినాన్ని కాపాడుకోవాలని పలువురు సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు మేడే వారోత్సవాల ముగింపు సందర్భంగా సీఐటీయూ మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా ఆఫీసు నుంచి ఈసీఐఎల్ చౌరస్తా వరకు ర్యాలీగా చేరుకొని అనంతరం సభ నిర్వహించారు. ఈ సభకు మేడ్చల్ జిల్లా కార్యదర్శి జే చంద్రశేఖర్ అధ్యక్షత వహించగా సీఐటీయూ సీనియర్ నాయకులు కోమటి రవి పీఎస్ఎన్ మూర్తి, జిల్లా సహాయ కార్యదర్శి జీ శ్రీనివాసులు



ప్రసంగించారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న ఎనిమిది గంటల పని దినాన్ని నేడు మోడీ ప్రభుత్వం రద్దు చేసేందుకు ప్రయత్నాలు చేస్తోందన్నారు. కార్మికులు ఐక్యంగా ఎనిమిది గంటల పని దినాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. మతం పేరుతో ప్రాంతం పేరుతో కార్మికుల మధ్య ప్రజల మధ్య ఘర్షణలను పెట్టి తన రాజకీయ లబ్ధి పొందడానికి ప్రయత్నం చేస్తున్నదన్నారు. రాబోయే కాలంలో కార్మికులు ఎనిమిది గంటల పని దినంతో పాటు ఇతర హక్కుల కోసం నిరంతరం ఐక్య ఉద్యమాలు చేయవలసిన అవసరం ఉందని తెలియజేశారు. అనంతరం జిల్లా ఉపాధ్యక్షులు బీవీ సత్యనారాయణ వందన సమర్పణలతో సమావేశం ముగిసింది. ఈ సభలో జిల్లా ఉపాధ్యక్షులు ఎన్ శ్రీనివాస్, కోశాధికారి ఉన్నికృష్ణ, నాయకులు జి యాదగిరి రావు, బీ నరసింగరావు, జే. వెంకటేష్, రసూల్, ఆదామ్, బాబురావు, నాగభూషణరావు, సంతోశ్, సురేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు

లోహియా నగర్‌లో క్రిశాంక్ బస్తీ నిద్ర



- సొంత నిధులతో బోర్వెల్ ఏర్పాటు

నవతెలంగాణ కంటోన్మెంట్

ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు గాను తెలంగాణ ఖనిజ సంపద కార్పొరేషన్ చైర్మెన్ మన్నె క్రిశాంక్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గంలోని లోహియాలో ఏడో బస్తీ నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు 400 మంది స్థానికులు పాల్గొని సమస్యలను చెప్పారు ప్రధానంగా నీటి సమస్య, అంగన్వాడీ కేంద్రం, కమ్యూనిటీ హాల్, వద్ధ మహిళలు, పెన్షన్ వంటి సమస్యలు స్థానికులు క్రిశాంక్ దష్టికి తీసుకువచ్చారు. అందుకు స్పందించిన క్రిశాంక్ మాట్లాడుతూ బస్తీలో నీటి సమస్య పరిష్కారానికి తన సొంత నిధులతో బోర్‌వెల్, పంపుసెట్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు ఆదివారం ఉదయం క్రిశాంక్ బోర్‌వెల్ పంపుసెట్ పనిని కూడా ప్రారంభించారు. గంటల వ్యవధిలో బోర్‌వెల్, పంపుసెట్ పనులు ప్రారంభిం చినందుకు క్రిశాంక్‌కు స్థానికులు కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ద్యాన్ని , శ్యామ్, మోని, రఘు, సాయి, రాజు తదితరులు పాల్గొన్నారు.



అన్నానగర్‌లో ముగిసిన మేడే వారోత్సవాలు



నవతెలంగాణ-కంటోన్మెంట్

మేడే ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సీఐటీయూ నాయకులు అన్నానగర్ అమరవీరుల స్తూపం వద్ద అంబేద్కర్ సంఘం సెంట్రింగ్ యూనియన్ జెండా ఏర్పాటు చేశారు. అనంతరం మేడే వారోత్సవాల కార్యక్రమాలు నిర్వహించారు. కార్మికులకు. పిల్లలకు, మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. అనంతరం మే డే శిబిరం ముగింపు ర్యాలీ కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నగర అధ్యక్షులు కామ్రేడ్ జయ కుమార్ పాల్గొన్నారు. అన్నానగర్ చౌరస్తా అర్జున్ నగర్, సీబీఆర్ నగర్, మార్కండేయ గుడి, స్కూలు నుంచి సీఐటీయూ ఆఫీస్ వరకు ర్యాలీ కొనసాగింది. మేడే వర్ధిల్లాలని, అమరవీరులకు జోహార్లు అంటూ నినాదాలు ఇస్తూ ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ నగర నాయకులు కేఎన్ రాజన్న, జోన్ కన్వీనర్ ఎం సత్యనారాయణ, బీ నారాయణ రాజు, కే.యాదగిరి, భీమ్రావు, బిక్షపతి, జి సత్యనారాయణ, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రీ ప్రైమరీ స్కూళ్లతో పిల్లల జ్ఞాపక శక్తి పెరుగుతుంది

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్
- మారేడ్‌పల్లిలో ప్రీ ప్రైమరీ స్కూల్‌ను ప్రారంభించిన మంత్రి



నవతెలంగాణ-కంటోన్మెంట్

ప్రీ ప్రైమరీ స్కూళ్లతో పిల్లల జ్ఞాపక శక్తి పెరుగుతుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మారేడ్‌పల్లిలో సుబ్రహ్మణ్య స్వామి టెంపుల్ మాజీ చైర్మన్ సంతోష్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటైన పీపల్ ట్రీ ప్రీ ప్రైమరీ స్కూల్ ను ఆదివారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు ఆటపాటలతో జ్ఞాపక శక్తిని పెంపొందించుకునేందుకు ప్రీ ప్రైమరీ స్కూళ్లు దోహదపడతాయని అన్నారు. సంతోష్ యాదవ్ మాట్లాడుతూ.. పీపల్ ట్రీ పాఠశాల ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. తొడదలెర్, నర్సరీ, జూనియర్ కే.జీ., సీనియర్ కే.జీ., డేక్ కేర్, ఆఫ్టర్ స్కూల్, సమ్మర్ క్లబ్ వంటి కార్యక్రమాలతో స్కూల్ ప్రారంభించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ యజమాన్యంతో పాటు పలువులు పాల్గొన్నారు. మల్లేష్ యాదవ్, సి. సంతోష్ యాదవ్, సి. శ్రావణ్ యాదవ్, టి ఎస్ శ్రీనివాస్, నారాయణ, రాము, పాల్గొన్నారు.



గణపతి ఆలయ నూతన చైర్మెన్ ప్రమాణ స్వీకారం

- హాజరైన మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ నియోజకవర్గంలోని సికింద్రాబాద్ గణపతి దేవాలయ నూతన పాలక మండలి ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఆలయ నూతన చైర్మెన్ సత్యనారాయణతో పాటు మరో 12 మంది ధర్మకర్తలతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా చూడాల్సిన బాధ్యత కమిటీ సభ్యులపై ఉందని గుర్తు చేశారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆలయాలు గమణనీయంగ అబివృద్ధి చెందుతున్నాయని కార్యక్రమంలో ఎండోమెంట్స్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కనీస సదుపాయాల కల్పనకు చర్యలు



- కార్పొరేటర్ రాజ్ జితేందర్ నాథ్

నవతెలంగాణ -నేరేడ్ మెట్

అన్ని కాలనీలలో కనీస సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటానని మచ్చబొల్లారం డివిజన్ కార్పొరేటర్ రాజ్ జితేందర్ నాథ్ అన్నారు. ఆదివారం ఆయన పలు కాలనీలలో పర్యటించారు. ఈ సందర్భంగా తిరుమల ఎన్‌క్లేవ్, భగీరథ కాలనీ, బుడగ జంగాల బస్తీలో పర్యటించారు. సంఘం నూతన భవన ప్రారంభోత్సవానికి హాజరు కావాలని మాల జంగాల కమిటీ వారు, కార్పొరేటర్‌ను ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీలు, బస్తీ లలో రోడ్లు, డ్రయినేజీ లైన్, నాలాల పూడిక తీత, వీధి దీపాలకు మరమ్మతులు, విద్యుత్ మీటర్లు కావాలని తదితర సమస్యలను పరిష్కారించాలని స్థానికులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సమస్యలన్నీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు దష్టికి తీసుకెళ్లి, ఆయన సహకారంతో పరిష్కారిస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు షేక్ రెహమాన్, మహేష్, హరి, హర్ష, సిద్ధరామేశ్వర్, రామ్ ప్రసాద్, తిరుమలకాలనీ అధ్యక్షుడు జి. రవి కుమార్, ప్రభాకర్ రెడ్డి, గిరి, విజయ్, చిన్నా రాకేష్, అభిజిత్, శివ, బీజే బస్తీకి చెందిన ఎక్ట్ పవన్ కుమార్, రవి, రామ్, ఓంకార్, కిరణ్, ప్రశాంత్ పాల్గొన్నారు

జమ్మిగడ్డలో 49 వ వారం జ్ఞానమాల కార్యక్రమం



నవతెలంగాణ-కాప్రా

అంబేద్కర్ ఆశయ సాధనలో భాగంగా ప్రతీ వారం నిర్వహిస్తున్న జ్ఞానమాల కార్యక్రమంలో భాగంగా బి.జె.ఆర్ కాలనీ వాస్తవ్యులు జాషువా రాములు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు, అంబేద్కర్ యువజన సంఘం ప్రతినిధి తాడూరి గగన్ కుమార్, బి.జె.ఆర్ కాలనీ అధ్యక్షులు రహీంలు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని కొంతమంది పాలకులు తూట్లు పొడిచే విధంగా వివరిస్తున్న తీరును ఎప్పటికప్పుడు ఎండగడుతూ దాన్ని కాపాడుకుందాం అని తెలియజేస్తూ జ్ఞానమాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సభ్యులకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘ సభ్యులు దయానంద్ గిరి, నరేందర్ రావు, నాగేష్, కాలనీ వాసులు నరసింహ చారి, దయాకర్, ఇస్తారి తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో
అల్లూరి సీతారామరాజు వర్ధంతి, రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి

నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రజా సాంస్కతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో ఈసీఐఎల్ కమలానగర్ ఆఫీసులో భారత స్వాతంత్రోద్యమ యోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి, నోబుల్ బహుమతి గ్రహీత, మన జాతీయ గీతం రచయిత రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి నిర్వహించారు. ముందుగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి ప్రజాతంత్ర ఉద్యమ నాయకులు పి.ఎస్.ఎన్ మూర్తి పూలమాల వేసి నివాళి అర్పించారు. స్ఫూర్తి గ్రూపు సీనియర్ నాయకులు శ్రీమన్నారాయణ రవీంద్రనాథ్ ఠాగూర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు. ప్రజాతంత్ర ఉద్యమ నాయకులు కోమటి రవి మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు స్వాతంత్ర పోరాటంలో సాయుధ పోరాటం తప్పనిసరని నిర్ణయించుకొని మన్యం ప్రజల సమస్యలను తీసుకొని బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాటం చేశారని అన్నారు. ఆనాడే అల్లూరి సీతారామరాజును పట్టిస్తే పదివేల రూపాయలు బహుమతిని ప్రకటించారని..



అయినా గిరిజనులు ఆయనను గుండెల్లో దాచుకున్నారని చెప్పారు. ఆయన చేసిన త్యాగాలు దేశ ప్రజలకు ఎంతో స్ఫూర్తినిచ్చాయని తెలిపారు. శ్రీమన్నారాయణ మాట్లాడుతూ.. ఠాగూర్ గురించి స్వాతంత్ర పోరాటంలో ఆయన నిర్వహించిన పాత్ర గురించి చెప్పారు. అనంతరం సభ్యులు చిత్రపటాలకు పూలను అర్పించి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో బంగారు నరసింగరావు, శ్రీనివాసులు, శ్రీనివాసరావు, ఉన్నికిష్టన్, ఎన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు



- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నందికంటి శ్రీధర్

నవ తెలంగాణ-నేరేడ్ మెట్

సమస్యలు పరిష్కరించకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సర్కిల్ కార్యాలయం ఎదుట ఆందోళనలు చేస్తామని కాంగ్రెస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు నందికంటి శ్రీధర్ హెచ్చరించారు. ఆదివారం వాజ్ పేయినగర్, హిల్ కాలనీ తదితర ప్రాంతాల్లో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ పాదయాత్ర లో ప్రజలు తమకు చెప్పిన సమస్యలను అధికారులకు తెలిపి, వారికి కొంత గడువు ఇస్తామని చెప్పారు. సమస్యలు పరిష్క రించక పోతే సర్కిల్ కార్యాల యం ఎదుట పెద్ద ఎత్తున ధర్నాలు చేస్తామన్నారు. వినాయకనగర్ డివిజన్‌లో నిర్వహించిన హాత్ సే హాత్ జోడో యాత్రకు మంచి స్పందన వచ్చిందన్నారు. నేటితో ఈ డివిజన్ లో పాదయాత్ర ముగిసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీ బ్లాక్ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు సంతోష్ ముదిరాజ్, మీడియా కన్వీనర్ గుత్తి రామచందర్, ఎంఆర్ శ్రీనివాస్ యాదవ్, గిరి యాదవ్, ఆశ, జీకే సాయి, ఎస్ ఎస్ యుబ సాయి, సత్య నారాయణ, బాలకష్ణ, యు. సాయికుమా ర్, సుబ్బారెడ్డి, మెమిన్ భాష, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక స్పృహ అంశంతో పర్యావరణ పరి రక్షణ నృత్య రూపకం



నవతెలంగాణ-కల్చరల్

నేడు ప్రపంచమంతా వాతావరణ కలుష్యమయమై పలు సమస్యలకు కారణం అవుతోంది. ఈ సమస్యలను అధిగమించేందుకు వృక్ష పరిరక్షణ, భూగర్భ జలాలు కాపాడటం, అడవులు యధాస్థితికి సాగించటం వంటి అంశాలతో పర్యావరణ పరి రక్షణ నృత్య రూపకం సంప్రదాయ కూచిపూడి నాట్య శైలిలో కళాకారులు నర్తించి జాగృతం చేశారు. రవీంద్రభారతి ప్రధాన వేదికపై కురుగంటి కళాక్షేత 26 వ వార్షికోత్సవం జరిగింది. నత్య గురువు రాధిక శిష్య బృందం కుందానిక, శ్రీయ, చిన్మయి,శు చిత్ర, సాహితి, శ్వేత తదితరులు 30 మంది కళాకారిణులు నృత్య రూపకాన్ని రక్తి కట్టించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సాంస్కతిక శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికష్ణ పాల్గొని మాట్లాడుతూ సంప్రదయ నాట్య శైలిలో ఆధునిక పరిస్థితులకు అణు గుణంగా సందేశాత్మక నృత్య రూపకాల అవసరం ఉందని గురువు రాధికను అభినందించారు. గురువు రాధిక మాట్లాడుతూ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యం అందించారని తెలిపారు. వివిధ రంగ ప్రముఖులను సత్కరించారు. నాట్య గురువు డాక్టర్ సుధాకర్, టీ.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ వల్ల రాజ్యాంగానికి ప్రమాదం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్.బాల మల్లేష్



నవతెలంగాణ-నేరేడ్ మెట్ :

బీజేపీ పాలనలో లౌకిక ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, రాష్ట్రాల హక్కులు హరించబడుతున్నాయని, దీంతో రాజ్యాంగ మూలాలకు తీవ్ర ప్రమాదం ముంచు కొచ్చిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్. బాల మల్లేష్ అన్నారు. ఆదివారం యాప్రాల్ చౌరస్తా లో ఇంటింటికి సీపీఐ యాత్ర ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన సీపీఐ బహిరంగ సభలో ఎన్. బాలమల్లేష్ మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వానికి రాజ్యాంగం పట్ల గౌరవం లేదన్నారు. ఈ దేశానికీ మనుధర్మమే గొప్పదంటూ ఆర్ఎస్ఎస్ నాయకులు చెబుతున్నారన్నారు. అలాగే సోషలిస్ట్, సెక్యులర్ పదాలను రాజ్యాంగం నుంచి తొలగించాలని కేంద్ర మంత్రులు సైతం చెబుతూ రాజ్యాంగాన్ని మార్చాలని చెప్పడాన్ని తీవ్రంగా ఖండించారు. దేశంలో ముస్లీంలు, క్రిస్టియన్లు, దళితులు, గిరిజన్లు, మహిళలపై దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్య, వైద్యంతో పాటు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటు పరం చేస్తున్నారని, అలాగే రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. బీజేపీని వ్యతిరేకిస్తే వారి పాలనలో ఉన్న లోపాలను ఎత్తి చూపితే ఈడి, సీబీఐ, కాగ్‌లను కూడా అధికార పార్టీకి అనుబంధ సంస్థలుగా వాడుకుంటుందని విమర్శించారు.

తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు పర్చడంలో కె. సి.ఆర్ ప్రభుత్వం ఘోరంగా విఫలమయిందని బాల మల్లేష్ అన్నారు. దళితులకు 3 ఎకరాల భూమి చొప్పున ఇస్తామని చెప్పి దళితున్ని ముఖ్య మంత్రిని చేస్తామని, పేదలకు ఇండ్లస్థలాలు, డబుల్ బెడ్ రూమ్స్ అందిస్తామని, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రజల కిచ్చిన హామీలు నెరవేర్చలేదని విమర్శించారు. తక్షణమే ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలనీ, పేదోళ్లకు ఇండ్ల స్థలాలు, ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి డిజి. సాయిలు గౌడ్ మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు కొనసాగిస్తామని తెలిపారు. అర్హులైన పేదలందరికి ఇండ్లు, ఇండ్లస్థలాలు, డబుల్ బెడ్ రూమ్స్ ఇచ్చేవరకు పోరాటాలు ఉదతం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా కళాకారులు విప్లవ గేయాలతో ప్రజలను ఆకట్టుకున్నారు. ఈ బహిరంగ సభలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సి.ఎచ్. దశరథ్, రొయ్యల కష్ణమూర్తి, తోటపల్లి శంకర్, జె.లక్ష్మి, ఆల్వాల్ మండల కార్యదర్శి కె సహదేవ్,సహాయ కార్యదర్శి సల్మాన్ బేగ్, మల్కాజిగిరి మండల కార్యదర్శి టి. యాదయ్య గౌడ్, సహాయ కార్యదర్శులు కాసార్ల నాగరాజు, కె. అశోక్, కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి, నాయకులు కష్ణ యాదవ్, రవి నాయక్ , స్వామి, మహిళా నాయకురాళ్లు కె. ప్రమీల, మాధవి, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విలక్షణమైన పాడ్ కాస్ట్ విడుదల చేసిన డెట్టాల్ బనేగా స్వస్త్ ఇండియా

నవతెలంగాణ-హైదరాబాద్

ప్రపంచ చేయి పరిశుభ్రతా దినం సంబరం చేయడానికి, రెకిట్, ప్రపంచ ప్రముఖ వినియోగదారు హెల్త్ అండ్ హైజీన్ కంపెనీ, తమ ఫ్లాగ్ షిప్ కాంపైన్ డెట్టాల్ బనేగా స్వస్త్ ఇండియా ద్వారా భారతదేశపు మొదటి ప్రజా ఆరోగ్యం, పరిశుభ్రతలకు ప్రాధాన్యతమిచ్చిన పాడ్ కాస్ట్ బనేగా స్వస్త్ ఇండియా-స్వస్థ్య మంత్రాను ఆరంభించింది. ఈసందర్భంగా రెకిట్ దక్షిణాసియా ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ గౌరవ్ జైన్ మాట్లాడుతూ... సామాజిక ధోరణి, ప్రవర్తనలో సుస్థిరమైన మార్పు తీసుకురావడం, శుభ్రమైన, ఆరోగ్యవంతమైన భారతదేశం కోసం తప్పనిసరిగా మిగులుతుందన్నారు. రెకిట్లో తాము ప్లాట్ ఫాంలలో వినియోగదారులతో కనక్ట్ అవడాన్ని నిర్ధారించడానికి విలక్షణమైన, నిమగ్నమయ్యే సాధనాలు పరిచయం చేయడాన్ని, మంచి పరిశుభ్రతా అలవాట్లు నిర్వహించడం ప్రాధాన్యత గురించి వారికి అవగాహన కల్పించడాన్ని కొనసాగిస్తున్నామన్నారు. రెకిట్ దక్షిణాసియా డైరక్టర్ ఎక్స్ టర్నల్ అఫైర్స్ అండ్ పార్ట్ నర్ షిప్స్ రవి భట్నాగర్ మాట్లాడుతూ... మంచి పరిశుభ్రతా పద్ధతులను ప్రోత్సహించడంలో డెట్టాల్ ఎల్లప్పుడు ముందు స్థానంలో ఉంటుందన్నారు. తమ జోక్యాలు ద్వారా తాము ఎవరూ మిగిలిపోకుండా ఉండటానికి, ఆరోగ్యవంతమైన భవిష్యత్తును తయారు చేయడానికి అంకితమయ్యామన్నారు.

ఇనేరా నుంచి ఏబుల్డ్ వ్యవసాయ ఇన్‌పుట్‌ల శ్రేణి విడుదల

నవతెలంగాణ - హైదరాబాద్

ఇనేరా క్రాప్ సైన్స్ అనే బయోసైన్స్ కంపెనీ తన బయోలాజికల్ అగ్రి-ఇన్‌పుట్ వ్యాపారాన్ని ప్రారంభించింది. ఇనెరాకు అబ్సల్యూట్ వారి పరిశోధన మరియు అభివృద్ధి విభాగం అయిన జెనిసిస్ మద్దతు కలిగి ఉంది. కంపెనీ తన క్రాప్ - అగ్నోస్టిక్ శ్రేణి జీవ ఎరువులు, జీవ ప్రేరకాలు, జీవనియంత్రకాలు మరియు విత్తన కోటింగ్ ఉత్పత్తులను భారతదేశంలో ప్రారంభించింది. ప్రధానంగా, ఇనెరా యొక్క బయోలాజికల్ ఇన్‌పుట్‌లు వివిధ రకాల వ్యవసాయ వాతావరణ పరిస్థితులలో దిగుబడి మరియు నాణ్యతను పెంచడానికి నేల నాణ్యత, మొక్కల వ్యాధి నిరోధక శక్తి, వ్యాధి నిరోధకత, తెగులు రక్షణ మరియు పంట మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి అనుకూలమైన పరిష్కారాలను అందిస్తాయి. భారతదేశంతో ప్రారంభించడం ద్వారా, ఇనెరా ప్రపంచ జనాభాలో 20% మరియు ప్రపంచంలోని అత్యధిక వ్యవసాయ యోగ్యమైన భూమి గల ఒక దేశం అయిన బారతదేశ అవసరాలను తీర్చాలని లక్ష్యంగా పెట్టుకుంది.

హిందీ, తెలుగు పాటల స్వరామృతం



నవతెలంగాణ-కల్చరల్

మధురమైన హిందీ తెలుగు పాటలను ప్రతిభావంతులైన గాయని గాయకులు ఆలపించి శ్రోతలను రంజింపజేశారు. ప్రముఖ సంగీత సంస్థ సుబ్బు మ్యూజిక్ అకాడమీ నిర్వహణ లో శ్రీధరం రాఘవయ్య, హైమవతి సంస్మరణ గా త్యాగరాయ గాన సభ ప్రధాన వేదిక పై శ్రీధర రామ సుబ్రహ్మణ్యం వాగ్దేవు సత్య దీప్తి తో కలసి తమిళ్, తెలుగు, హిందీ పాటలు గానం చేశారు. అపర్ణ, రాజు, ఉదయ్ భాస్కర్, లలిత, తది తరులు పాలు పంచుకున్నారు. ఏఎస్.ఎన్. రావు, కె.శ్రీనివాస్ రావు వంశీ రామ రాజు తదితరులు అతిథులుగా పాల్గొన్న సభలో సుబ్బు మ్యూజిక్ అకాడమీ స్థాపకుడు రామ సుబ్రహ్మణ్యం దంపతులు సత్య దీప్తిని సత్కరించి సుస్వర గాన మాధురి బిరుదు ప్రదానం చేశారు.

ఘనంగా బుద్ధుడి జయంతి వేడుకలు



నవ తెలంగాణ - చైతన్యపురి

చైతన్యపురి డివిజన్ ఫస్ట్ బస్టాప్ దగ్గర బీజేపీ రంగారెడ్డి జిల్లా దళిత మోర్చా ఉపాధ్యక్షుడు నల్లాల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం బుద్ధ భగవానుడి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ రంగా నర్సింహా గుప్తా హాజరై పూల మాలలు వేసి, నివాళులర్పించారు. బుద్ధుని ధర్మ సూత్రాలు ఆచరణీయమని కార్పొరేటర్ అన్నారు. ఈ కార్యక్రమంలో బౌద్ధ మత ప్రచారకురాలు శారదా మాత,రంగారెడ్డి జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు రుద్రారపు శంకర్ , రాష్ట్ర దళిత మోర్చా నాయకులు హరిబాబు, ఉదయ్, జి. రామ్మోహన్, నరసింహ, శేషు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మహేశ్వరం అభివృద్ధి ప్రదాత మంత్రి సబితా ఇంద్రారెడ్డి : ఊర్మిళా రెడ్డి



నవ తెలంగాణ - చైతన్యపురి

మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అని ఆర్కే పురం డివిజన్ బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు లిక్కి ఊర్మిళారెడ్డి అన్నారు. ఫార్మాసిటీ రాకతో నియోజకవర్గ రూపురేఖలే మారిపోయాయని తెలిపారు. మంత్రి సబిత ఇంద్రారెడ్డి చొరవ తోనే ఆ కషి జరిగిందన్నారు. ఎవరు ఎన్ని మాట్లాడినా నియోజకవర్గంలో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం సబిత ఇంద్రారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కిల్ల మైసమ్మ దేవాలయ అభివద్ధికి రూ.కోటి మంజూరు చేయించినందుకు కతజ్ఞతలు తెలిపారు.

త్యాగాలు విద్యార్థులవి..

నియామకాలేమో కేసీఆర్ కుటుంబానికా?

- నిరుద్యోగులకు అండగా కాంగ్రెస్
- టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్



నవతెలంగాణ - బోడుప్పల్

త్యాగాలేమో విద్యార్థులవి..నియామకాలేమో కేసీఆర్ కుటుంబానికా అని రాష్ట్ర కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ ప్రశ్నించారు. బోడుప్పల్ లోని తన కార్యాలయంలో ఆదివారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ నిరుద్యోగుల ఆశలను బీఆర్ఎస్ సర్కారు నెరవేర్చలేదని విమర్శించారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో విద్యార్థులు కేవలం త్యాగాలకే పరిమితమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో రానున్న కాంగ్రెస్ సర్కారు.. నిరుద్యోగులకు ఏం చేయబోతుందో చెప్పేందుకే 'నిరుద్యోగ డిక్లరేషన్' పేరుతో భరోసా పత్రాన్ని విడుదల చేస్తున్నట్టు తెలిపారు. ఉపాధి కరువై నిరుద్యోగులు నిరుత్సాహంతో ఉన్నారని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే యూత్ డిక్లరేషన్ అమలు చేస్తుందని తెలిపారు. తెలంగాణ యువత ఆకాంక్షలను నెరవేర్చేందుకే కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తొమ్మిదేండ్లలో ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదన్నారు. నిరుద్యోగ సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలం అయ్యాయని విమర్శించారు. రాష్ట్రం వచ్చిన తర్వాత నిరుద్యోగ సమస్య మరింత పెరిగిందన్నారు. గతంలో 25 లక్షల నిరుద్యోగులు ఉంటే..ఇప్పుడు 40 లక్షల మందికి చేరారని తెలిపారు. ఇంటికో ఉద్యోగం ఇస్తామన్న కేసీఆర్ ఊరుకో ఉద్యోగం కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. సీఎం కేసీఆర్ అసమర్థత, అవినీతి పాలన వలన పరీక్ష పేపర్లు లీకు అయినట్టు ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రియాంక గాంధీ సభకు నిరుద్యోగులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయ వంతం చేయాలని కోరారు.

'ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయం'



నవతెలంగాణ - వనస్థలిపురం

ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయం అని బీఎన్ రెడ్డి నగర్ డివిజన్ జీహెచ్ఎంసీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి అన్నారు. బీఎన్ రెడ్డి నగర డివిజన్ పరిధిలోని చైతన్య నగర్ లో డాక్టర్ కుమార్ భాను, ఆర్థోపెటిక్, పిన్ క్లినిక్ వారు విజయ సాయి క్లినిక్ లో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఈ శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కుమార్ భాను, డాక్టర్.కష్ణ తులసి, డాక్టర్ .వెంకటేశ్, డాక్టర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గౌరిశెట్టి అరుణ్‌ను సన్మానించిన ఆలయ కమిటీ సభ్యులు



నవ తెలంగాణ - చైతన్యపురి

బ్రహ్మోత్సవాల కన్వీనర్ గౌరిశెట్టి అరుణ్ ను అష్టలక్ష్మీ దేవాలయ కమిటీ సభ్యులు దేవాలయ ప్రాంగణంలోని సమావేశ మందిరంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ సోమ సురేష్ మాట్లాడుతూ ఆర్ కేపురం డివిజన్ లోని వాసవీ కాలనీలో అష్టలక్ష్మీ దేవాలయ 27వ బ్రహ్మోత్సవాలు విజయవంతం కావడానికి బ్రహ్మోత్సవాల కన్వీనర్ గౌరిశెట్టి అరుణ్ ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఈ బ్రహ్మోత్సవాలకు హైదరాబాద్ నగరం నుండే కాకుండా తెలుగు రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారని తెలిపారు. ఆ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులందరూ కృషి చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి గంప జగన్, కోశాధికారి అంజయ్య, ధర్మాధికారి జై శంకర్ బాలగోపాల్, దామోదర్ గుప్త, సుధాకర్ గుప్త, మురుగేషన్, శ్రావణ్, ఆలయ కమిటీ సభ్యులు చిలుక ఉపేందర్ రెడ్డి, రవీందర్, దాచేపల్లి శ్రీనివాస్, శ్రీకాంత్, శ్రీనివాస్, ఉమాపతి, రామ కిషన్, రమేష్, గౌరి శంకర్, శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

మే డే స్ఫూర్తితో కార్మికులు పోరాటాలు చేయాలి

- సీఐటీయూ మండల కన్వీనర్ పెంటయ్య



నవతెలంగాణ - మీర్ పేట్

మే డే స్ఫూర్తితో కార్మికులు తమ హక్కుల కోసం పోరాటాలు చేసేందుకు సిద్ధం కావాలని సీఐటీయూ బాలాపూర్ మండల కన్వీనర్ జే పెంటయ్య పిలుపునిచ్చారు. మే డే వారోత్సవాల సందర్భంగా బాలాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం ఆశా వర్కర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హక్కుల పోరాటంలో పాల్గొన్నప్పుడు తమ రక్తంతో ఎగిరేసిన జెండా ఎర్రజెండాగా మారిందని, అదే మే డేగా ఏర్పడిందని వివరించారు.ఎంతో మంది అమరవీరుల త్యాగఫలం ఈరోజు మనం అనుభవిస్తున్నామని గుర్తుచేశారు. మే డే స్ఫూర్తిని కొనసాగిస్తూ తమ హక్కుల కోసం పోరాటాల్లో పాల్గొనాలని ఆశా వర్కర్లకు విజ్ఞప్తి చేశారు. అనంతరం బాలాపూర్ మండల ఆశా వర్కర్లతో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ అధ్యక్షురాలుగా ఎం. సుజాత, ప్రధాన కార్యదర్శిగా టి. భాగ్యలక్ష్మి సహాయ కార్యదర్శి అనిత, కోశాధికారి సుజాత, కమిటీ సభ్యులుగా బాలమణి, సుమలత, లీలావతి, వరలక్ష్మి, హేమలత, రజిని తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు యాదయ్య దాసరి బాబు, యాదగిరి చారి తదితరులు పాల్గొన్నారు.

'మహేశ్వరంలో కమలం జెండా ఎగరేద్దాం'



నవతెలంగాణ- బడంగ్ పేట్

మహేశ్వరం నియోజకవర్గంలో కమలం జెండా ఎగురేసి, ఈ నియోజకవర్గ బీజేపీ ఇంచార్జి అందెల శ్రీరాములు యాదవ్ ను అసెంబ్లీకి పంపించాలని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఎస్సీ మోర్చా అధ్యక్షులు గుండె నాగార్జున అన్నారు. నియోజకవర్గంలో బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్ గుల్ గ్రామంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో శ్రీరాములు యాదవ్ ను కలిశారు. అతన్ని పూల మాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. నాయకులు నిమ్మల రవికాంత్ గౌడ్, మంత్రి మహేష్ ముదిరాజ్, బాలాపూర్ కు చెందిన సీనియర్ నాయకులు దొడ్డి శ్రీశైలం, గడ్డం మధు తేజ, మర్రి సాయికుమార్, మూల ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా భాను ప్రకాశ్ రెడ్డి, వనజల వివాహ వార్షికోత్సవం



నవ తెలంగాణ- సంతోష్ నగర్

తెలంగాణ ఉద్యమకారుడు, చంపాపేట్ డివిజన్ బీఆర్ఎస్ అధికార ప్రతినిధి గవిని భాను ప్రకాష్ రెడ్డి, వనజ దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు వారికి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపాల్ ముదిరాజ్, అనుగొంది జంగయ్య, కొత్తపేట ప్రభాకర్, అనసూయ గౌడ్, గోగు శేఖర్ రెడ్డి, జగదీష్ గౌడ్, కొండ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

మినీ శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు



నవ తెలంగాణ -ఉప్పల్

ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం కర్ణాటక గాత్ర కచేరి, కూచిపూడి నత్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. కీర్తన సంగీత అకాడమీ గురువర్యులు సుష్మ నందూరి శిష్య బృందం శ్రీ తాళ్లపాక అన్నయ్య సంకీర్తనలు ఆలపించారు. శరణు శరణు, మాధవ కేశవ, చక్కని తల్లికి వంటి సంకీర్తనలను శ్రీ సాంవై, భగవతి, హేమాశ్రీ రష్మీ మొదలైన వారు ఆలపించారు. అరుణ స్వరూప్ శిష్యబృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలో శ్రీ గణపతి, రుక్మిణి ప్రవేశ దరువు, పలుకే బంగారమయేహ్నా, పరులన్నమాట, అన్ని మంత్రాలూ మొదలైన అంశాలను సంజన, అక్షర, దేదీప్య, సుప్రియ, కార్తీక, అక్షర మొదలైన వారు ప్రదర్శించారు.

మోడీ విధానాలు దేశానికి గొడ్డలి పెట్టు

- ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు



నవతెలంగాణ - తుర్కయాంజల్

ప్రధాని మోడీ విధానాలు దేశానికి గొడ్డలి పెట్టు వంటివి అని ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు అన్నారు. సీపీఐ తుర్కయాంజల్ మున్సిపాలిటీ సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీపీఐ పార్టీ ప్రజా పోరుబాట పాద యాత్ర (ఇంటింటికీ సీపీఐ కార్యక్రమం- మోడీ కో హటావ్- దేశ్ కో బచావ్)లో భాగంగా ఆ రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య అధ్యక్షతన కమ్మగూడలోని సుందరయ్య నగర్ కాలనీలో ఆదివారం బహిరంగ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే రాములు మాట్లాడుతూ పేదోళ్ల కడుపులు కొట్టి పెద్దోళ్లకు కట్టబెట్టే మోడీ (బీజేపీ) విధానాలను దేశ ప్రజలు ప్రతిఘటించకపోతే దేశ ఆర్థిక అభివద్ధి కుంటుపడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసర సరుకుల ధరలు 100% పైగా పెరిగాయని విమర్శించారు. మోడీ పరిపాలన అంతా కార్పొరేట్ పాలననే అని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కి అప్రజాస్వామిక విధానాలను అవలంబిస్తున్నారని తెలిపారు. రెజ్లర్లు (క్రీడాకారులు) కొన్నిరోజులుగా బీజేపీ నాయకుడు మహిళా క్రీడాకారులను లైంగిక వేధింపులకు గురిచేస్తున్నారని, దానికి నిరసనగా ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద క్రీడాకారులు ఆందోళన చేస్తుంటే... మోడీ నీరో చక్రవర్తి లాగా వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. దేశాన్ని కార్పొరేట్ శక్తులకు, విదేశీ పెట్టుబడుదారులకు అమ్మకానికి పెడుతూ.. దేశభక్తి గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని అన్నారు. రైతు నల్ల చట్టాలను రద్దుచేసి దేశ ప్రజలను క్షమాపణ కోరిన మోడీ.. అవే విధానాలను దొడ్డి దారిన, దొంగ చాటుగా అమలు చేయడం వారి దివాళ కోరితనాన్ని చూయిస్తుందని మండిపడ్డారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందని అన్నారు. ఇప్పటికైనా పేదలందరికీ ఇండ్లు, ఇళ్ల స్థలాలు, ఉచిత విద్య, దళిత, గిరిజనులకు మూడెకరాల భూమిని అందించాలని డిమాండ్ చేశారు. తుర్కయాంజల్ మున్సిపాలిటీ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన బహిరంగ సభలో సీపీఐ పార్టీ జిల్లా సీనియర్ నాయకుడు అల్లిముద్దీన్, సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు డి.కిషన్, సీపీఐ ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి పూల యాదయ్య, మంచాల మండల కార్యదర్శి రాజు నాయక్, ఏఐఎస్ఎఫ్ నాయకులు శ్రీను నాయక్, మున్సిపాలిటీ నాయకులు కాటంరాజు, భాస్కర్, శేఖర్ రెడ్డి, సుందరమ్మ, పిల్లి కష్ణ విజయ, దుబ్బ యాదయ్య, చెక్క యాదగిరి, నారాయణ, ఈశ్వర్ శ్రీనివాస్, వెంకటయ్య, జనార్ధన్, శ్రీకాంత్, గోవర్ధన్, కష్ణ, శంకర్ జే. యాదమ్మ, లింగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణపై

మాయావతి స్పష్టమైన వైఖరి తెలియజేయాలి'

నవతెలంగాణ - ఎల్బీనగర్

బీఎస్పీ అధినేత్రి మాయావతి ఎస్సీ వర్గీకరణపై తన వైఖరి తెలియజేయాలని మహాజన సోషలిస్టు పార్టీ ఎల్బీనగర్ నియోజకవర్గం ఇంచార్జి సుధాకర్ మాదిగ డిమాండ్ చేశారు. ఎల్బీనగర్ లో మహాజన సోషలిస్ట్ పార్టీ నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ 7న హైదరాబాద్ పర్యటన సందర్భంగా విచ్చేస్తున్న మాయావతి వర్గీకరణ పై మాట్లాడాలి అని కోరారు. గత 29 ఏండ్లుగా ఎస్సీ వర్గీకరణ కోసం మందకష్ణ మాదిగ నాయకత్వంలో పోరాటం జరుగుతున్న విషయం యావత్ భారత దేశ సమాజానికి తెలుసు అని చెప్పారు. కాన్సిరాం వారసత్వాన్ని పునికి పుచ్చుకున్న మాయావతి... సామాజిక న్యాయ సూత్రం అనుగుణంగా ఎస్సీ వర్గీకరణ పై మాట్లాడాలని డిమాండ్ చేశారు. బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ లు వారి పార్టీ వైఖరిని స్పష్టంగా తెలియజేయాలన్నారు. లేనిపక్షంలో తెలంగాణ రాష్ట్రంలో 18% ఉన్న మాదిగ, మాదిగ ఉపకులాలు వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహాజన సోషలిస్ట్ పార్టీ నాయకులు రాజు శేఖర్, బుజ్జన్న ప్రమోద్, ప్రకాష్, మౌలాలి పాల్గొన్నారు.

ఆస్మాన్‌గట్టు కమిటీ ఆధ్వర్యంలో కామ్రేడ్ కిరణ్ వర్ధంతి



నవతెలంగాణ - సంతోష్ నగర్

మే డే వారోత్సవాల సందర్భంగా ఆస్మాన్ గట్టు డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో కామ్రేడ్ కిరణ్ నాలుగో వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర నాయకులు ఎండీ అబ్బాస్, సౌత్ సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. శ్రావణ్ కుమార్ లు మే డే అమరవీరుల చిత్రపటాలకు పూల మాలల వేసి, నివాళులర్పించారు. ఆ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పని చేసిన కిరణ్ కార్మికులకు ఎనలేని సేవ చేశారని గుర్తుచేశారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలకు వ్యతిరేకంగా పని చేస్తుందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం ఐక్య పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు.

నమో హైదరాబాద్ లోగో వెబ్ సైట్ లాంచ్



నవతెలంగాన-హైదరాబాద్

తాజ్ డెక్కన్ లో నమో హైదరాబాద్ లోగో, వెబ్ సైట్ ను (www.namo hyderabad.com) ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన బీజేపీ జాతీయ మహిళా మోర్చా సభ్యురాలు డాక్టర్ పద్మా వీరప్పనేని, నమో హైదరాబాద్ ఫౌండర్, ప్రెసిడెంట్ ఆజాద్ బాబు, నమో హైదరాబాద్ కన్వీనర్ అశోక్ పట్నాయక్, సభ్యులు కలిసి లోగో, వెబ్ సైట్ ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా ఆజాద్ బాబు భవిష్యత్ కార్యచరణను ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నరేంద్రమోడీ పథకాలు, ఉద్దేశాలతో స్ఫూర్తి పొందిన హైదరాబాదీ యువత కలిసి గ్రూప్ గా ఏర్పాటై నమో హైదరాబాద్ ను స్థాపించారని తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న యువత దగ్గరికి మోడీ భావజాలాన్ని తీసుకెళ్లడానికే నమో హైదరాబాద్ వేదికను ఏర్పాటు చేసినట్లు వివరించారు. కన్వీనర్ అశోక్ పట్నాయక్ మాట్లాడుతూ సమాజంలో యువత పాత్ర ఎక్కువ ఉందని చెప్పారు. దేశాభివద్ధి కోసం పాలుపంచుకునేలా ప్రభుత్వ విధానాలపై అవగాహన కల్పిస్తామని అన్నారు.

సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ - హయత్ నగర్

సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జలగం సందీప్, ప్రధాన కార్యదర్శిగా చెరుకూరి మధు, సంయుక్త కార్యదర్శిగా బి.సురేష్, కోశాధికారిగా టి.అనిల్, చైర్మన్ గా ఏ.రఘు, శాశ్వత సలహాదారులుగా డా.ఎస్.సుబ్రహ్మణ్యం, ప్రత్యేక సలహాదారులుగా డా.చింతల రాకేశ్ భవానీలు ఎన్నికయ్యారు. అనంతరం పూర్వ విద్యార్థుల సంఘం తొలి ఎన్నికలు జరిగాయి. అధ్యక్షులు జలగం సందీప్, ఉపాధ్యక్షులు సంధ్య, ప్రధాన కార్యదర్శి చెరుకూరి మధు, సంయుక్త కార్యదర్శి బి.సురేష్, కోశాధికారి అనిల్, కార్యవర్గ సభ్యులు కె. మౌనిక, ఎస్. స్వప్న, సిహెచ్ వంశీ, ఎ.చిట్టిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తర్వాత శాశ్వత చైర్మన్ గా ఏ.రఘు, శాశ్వత సలహాదారులుగా డా.శివపురం సుబ్రహ్మణ్యం, కార్యవర్గ సమావేశ ప్రత్యేక ఆహ్వానితులుగా వేంకటేశ్వర్ రావు, డా. చింతల రాకేశ్ భవానీ, డా.జహేదలు నియమించబడ్డారు.

తప్పిపోయిన వృద్ధుడిని కుటుంబ సభ్యులకు అప్పగింత



నవతెలంగాణ -బడంగ్ పేట్

మాతృదేవోభవ ఆశ్రమ ఫౌండర్ గట్టు గిరి తప్పిపోయిన హనుమంతరావును అతని కుటుంబ సభ్యులకు ఆదివారం అప్పగించారు. వివరాల్లోకి వెళ్లితే..మూడు రోజుల కిందట బడంగ్ పేట్ మున్సిపల్ పరిధిలోని ఎంసీఆర్ కాలనీలో మతిస్థిమితం లేని గుర్తుతెలియని ఓ వృద్ధుడిని మాతృదేవోభవ ఆశ్రమ బృందం తీసుకెళ్లిన విషయం తెలిసిందే. సోషల్ మీడియాలో పోస్ట్ చూసి వృద్ధుడి అన్న కొడుకు అంబాల. శ్రీనివాస్ ఆశ్రమానికి వచ్చి అతన్ని గుర్తుపట్టాడు. తర్వాత మీర్ పేట్ పోలీస్ స్టేషన్ ఇన్ స్పెక్టర్ మహేందర్ రెడ్డి సమక్షంలో గట్టు గిరి బృందంతో కలిసి వృద్ధుడిని అతని కుటుంబ సభ్యులకు అప్పగించారు. అనంతరం ఆశ్రమ ఫౌండర్ గట్టు గిరికి ప్రత్యేకంగా కతజ్ఞతలు తెలిపారు.

మహేశ్వరం నుంచి

సంఘర్షణ సభకు 25వేల మంది యువతీ యువకులు

- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి



నవతెలంగాణ -ఎల్బీనగర్

హైదరాబాద్ యువ సంఘర్షణ సభకు మహేశ్వరం నియోజకవర్గం నుండి 25 వేల మంది యువతీ యువకులు తరలి రానున్నట్లు ఆ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నీళ్లు, నిధులు, నియామకాలు కోసం తెలంగాణ రాష్ట్రం ఇచ్చిందని గుర్తు చేశారు. కానీ నేడు తెలంగాణలో నిరుద్యోగులు పెరిగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎనమిదేండ్ల నుంచి ఉద్యోగ భర్తీలు లేవని అన్నారు. అందుకే కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్ యువ డిక్లరేషన్ ప్రకటించిందని అని తెలిపారు. వరంగల్ లో రైతుల కోసం రాహుల్ గాంధీ రైతు డిక్లరేషన్ ప్రకటించినట్లు గుర్తుచేశారు. నిరుద్యో గుల కోసం సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించే యువ సంఘర్షణ సభలో ప్రియాంక గాంధీ యూ వ డిక్లరేషన్ ను ప్రకటించనున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో అవినీతి పెరిగిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం పరీక్షలను కూడా సక్రమంగా నిర్వహించడం లేదని విమర్శించారు. పేపర్ లీకేజ్ ద్వారా నిరుద్యోగులను మరోమారు ప్రభుత్వం మోసం చేసింది ఆరోపించారు. ఉద్యోగ భర్తీలకు నోటిఫికేషన్ ఇవ్వడం ఉద్యోగాలను భర్తీ చేయకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. ప్రియాంక గాంధీ రాక కోసం రాష్ట్ర యువత ఎదురు చూస్తోందని చెప్పారు. హైదరాబాద్ సంఘర్షణ సభ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారానికి బాటలు వేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అధికారంలోకి రాగానే ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. సరూర్ నగర్, ఆర్ కే పురం డివిజన్ల నుండి, ఇంకా బడంగ్ పేట్, మీర్ పేట్ నుండి యువతీ యువకులు సభకు తరలి వస్తారని చెప్పారు. విద్యార్థులు, నిరుద్యోగులు స్వచ్ఛందంగా యువ సంఘర్షణ సభకు వేలాది మంది తరలిరావాలని దేప భాస్కర్ రెడ్డి కోరారు.

ఆదివాసీ, గిరిజనుల సంక్షేమాన్ని విస్మరిస్తున్న బీజేపీ



నవతెలంగాణ - చైతన్యపురి

ఆదివాసీ, గిరిజనుల సంక్షేమాన్ని బీజేపీ ప్రభుత్వం విస్మరిస్తుందని తెలంగాణ గిరిజన సంఘం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి రామావత్ పాండునాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు మూడవత్ గోపినాయక్ లు అన్నారు. అల్లూరి సీతారామరాజు 99వ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆర్కే పురంలోని కోర్టు వద్ద ఉన్న అల్లూరి విగ్రహానికి వారు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనులకు అందాల్సిన సంక్షేమ పథకాలు, జనాభా ప్రకారం రిజర్వేషన్ పెంపుదలను బీజేపీ ప్రభుత్వమే అడ్డుకుంటున్నదని ఆరోపించారు. అటవీ ప్రాంతాల్లో యూరేనియం వెలికితీత పేరుతో అక్కడ నివసించే ఆదివాసీ,గిరిజనులను అడవి నుండి వెళ్లగొట్టే కుట్రలు చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సంవత్సరానికి కోటి ఉద్యోగాలు, అందరికీ సొంత ఇండ్లు, జన్ ధన్ ఖాతాలో రూ. 15 లక్షలు లాంటి హామీలన్నీ భూటకమే అని విమర్శించారు. మరో పక్క కులం, మతాల పేరుతో ప్రజలను రెచ్చగొట్టి రాజకీయంగా లబ్ది పొందుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రజలు అలోచించి రాబోయేరోజుల్లో ప్రజల తరఫున పనిచేసే వాళ్ళనే ఎన్నుకోవాలని కోరారు. హైదరాబాద్ నగరంలో ఉన్న అర్హులైన గిరిజనులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. ఇంకా గిరిజన బంధు పథకాన్ని వెంటనే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎల్లయ్య, వీరయ్య, ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు కాళ్ళ జంగయ్య, పద్మ, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైప్ లైన్ పనులకు శంకుస్థాపన

- తాగునీటి కష్టాలను శాశ్వతంగా పరిష్కరిస్తాం
- మలక్ పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ బలాల



నవ తెలంగాణ - సంతోష్ నగర్

డివిజన్ పరిధిలోని ఎస్సీహెచ్ బీ కాలనీలో తాగునీటి కొత్త పైప్ లైన్ నిర్మాణ పనులకు ఆదివారం మలక్ పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ బలాల శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు డివిజన్ కార్పొరేటర్ కొత్త కాపు అరుణ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీలో గత కొంత కాలంగా కాలనీవాసులు తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని గుర్తుచేశారు. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు రూ.11.40లక్షల వ్యయంతో కాలనీలో తాగునీటి పైపు లైన్ పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలో రోడ్లు, ఫుట్ పాత్ ల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జలమండలి అస్మాన్ గర్ డీజీఎం షీలారాణి, సైదాబాద్ మేనేజర్ శ్రావణ్ కుమార్, వర్క్ ఇన్ స్పెక్టర్ మనోహర్, జీహెచ్ఎంసీ డీఈ బన్సీలాల్, ఏఈ వెంకన్న, వర్క్ ఇన్ స్పెక్టర్ రాజకుమార్, విద్యుత్ శాఖ అధికారులు రాజేందర్ రెడ్డి, భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్, ఎస్సీహెచ్ పండి కాలనీల సమన్వయకర్త శ్రీనివాస్ గుర్త ఆమ్రేశ్,రాఘుమారెడ్డి,కష్ణ మురళీ, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు పరమేశ్ ముదిరాజ్, సుమంత్ గౌడ్, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో క్లాసులు నిర్వహిస్తున్న కాలేజీలపై చర్యలు తీసుకోవాలి



నవ తెలంగాణ- సంతోష్ నగర్

వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. అఖిల భారత విద్యార్థి సమైక్య ఏఐఎస్ఎఫ్, అఖిల భారత యువజన సమైక్య ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితిలో ఆధ్వర్యంలో నారాయణగూడ సత్యనారాయణ రెడ్డి భవన్ లో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి చైతన్య యాదవ్, గ్యార నరేష్, ఏఐ వైఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి ఆర్. బాలకష్ణ,నేర్ల కంటి శ్రీకాంత్‌లు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ కళాశాలలకు వేసవి సెలవులు ప్రకటించినప్పటికీ.. కార్పొరేటు కళాశాలలలో ప్రత్యేక తరగతుల పేరుతో విద్యార్థులను మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నాయని ఆరోపించారు. ఇంటర్ బోర్డు నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం చూసి చూడనట్టు వ్యవహరించడం విడ్డూరంగా ఉందన్నారు. ర్యాంకుల కోసం విద్యార్థులను మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తూ.. ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న కార్పొరేట్ కళాశాలలపై చర్యలు, వాటి గుర్తింపును రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2023-24 అకాడమిక్ ఇయర్ కు సంబంధించిన అడ్మిషన్ల ప్రక్రియను ఇంటర్ బోర్డు ప్రారంభించక ముందే..కార్పొరేట్ కాలేజీలు టెన్త్ క్లాస్ విద్యార్థుల డాటా తీసుకొని అడ్మిషన్ల కోసం విద్యార్థుల తల్లిదండ్రులను వేధిస్తూ ముందస్తుగా అడ్మిషన్లు తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు చైతన్య యాదవ్, ఏఐవైఎఫ్ అధ్యక్షులు బాలకష్ణ, ఏఐఎస్ఎఫ్ సహాయ కార్యదర్శి కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

మన్నెం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని ఉష ముళ్ళపూడి కమాన్ వద్ద విప్లవ వీరుడు, మన్నెం వీరుడు అల్లూరి సీతారామరాజు 99 వ వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు , హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాస్ రావులు హాజరై రామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. ఈ కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు అభిమానులు , నాయకులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



పలు శుభకార్యాల్లో పాల్గొన్న నాయకులు

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు శుభకార్యాలలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేఎం ప్రతాప్, కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, కొలుకుల జగన్, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, మహమ్మద్ రఫీ, యువ నేస్తం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కే పి విశాల్ గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధుల మంజూరు



- కార్పొరేటర్‌కు పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ - కూకట్‌పల్లి

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని జన్మభూమి కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం పది లక్షల రూపాయల అంచనా వ్యయంతో, ఎమ్మెల్యే నిధులతో నిర్మించడానికి గాను నిధుల మంజూరుకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు పంపిన పత్రాలను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్‌కు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరికె పూడి గాంధీ అంద జేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆల్విన్ కాలనీ డివిజన్ సమగ్ర, సంతులిత అభివృద్ధిలో భాగంగా జన్మభూమి కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎమ్మెల్యే సీడీపీ ఫండ్స్ ద్వారా మొత్తం రూ. 10 లక్షలు మంజూరు చేయవలసిందిగా రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపినట్టు తెలిపారు. నిధులు మంజూరు కాగానే కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు త్వరితగతిన చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. చిన్న చిన్న సమావేశాలు, సభలు, ఫంక్షన్ లు నిర్వహించుకునేందుకు వీలుగా కమ్యూనిటీ హాల్ ను నిర్మించబోతున్నందుకు సంతోషంగా ఉంద న్నారు. కాలనీల అభివద్ధికి విశేషంగా కృషి చేస్తానని,మరిన్ని నిధులు కేటాయించడానికి సిద్ధం అని ,ఏ చిన్న సమస్య వచ్చినా తన దష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని తెలిపారు. అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివద్ధికి శాయ శక్తుల కషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ అడిగిన వెంటనే కమ్యూనిటీ హాల్‌ల నిర్మాణానికి సహకరించిన ప్రభుత్వ విప్ గాంధీకి ప్రత్యేక కతజ్ఞతలు తెలియచేస్తున్నామన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే గాంధీ శేరిలింగంపల్లి నియోజకవర్గంను అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు .

ఎల్‌ఓసీ అందజేసిన జీవీఆర్...



నవతెలంగాణ - కూకట్ పల్లి

కూకట్ పల్లి నియోజకవర్గం కేపీహెచ్ ఫోర్త్ ఫేజ్‌లో నివాసం ఉంటున్న అంగోత్ జయ గత కొంతకాలంగా కాలి నరాలకు సంబంధించిన వ్యాధితో బాధపడుతోంది. చికిత్స నిమిత్తం పంజాగుట్ట నిమ్స్‌లో చేరారు. ఈ మేరకు హాస్పిటల్ వారు కాలికి ఆపరేషన్ చేయాలని సూచించడంతో వారు కూకట్‌పల్లిలోని బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వర రావును సంప్రదించారు. ఈ మేరకు వారికి ప్రభుత్వ సహకారంతో, ఎల్‌ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) ద్వారా రూ. ఒక లక్ష మంజూరు చేయించారు. దానికి సంబంధిత లెటర్‌ను పార్టీ కార్యాలయంలో బాధితురాలికి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, జీవీఆర్‌కు ధన్యవాదాలు తెలియజేశారు.

మేడిపల్లిలో జీవో 58 ఇండ్ల పట్టాలకు అవరోధాలు



- సర్వే నంబర్ 48లో పట్టాల పంపిణీపై అభ్యంతరాలు వ్యక్తం
- అధికారులకు,లబ్దిదారులకు కోర్టు నోటీసులు
- న్యాయస్థానాన్ని ఆశ్రయించిన మేడిపల్లి గీత కార్మిక సంఘం

నవతెలంగాణ-బోడుప్పల్

మేడిపల్లి పరిధిలోని సర్వేనంబర్ 48 గౌడ కులస్థుల భూమిలో జీవో 58 కింద పంపిణీ చేసిన పట్టాలకు రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం బ్రేక్ వేసిందని మేడిపల్లి గీత కార్మిక సంఘం అధ్యక్షుడు చెరకు మహేష్ గౌడ్ తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం సభ్యులతో కలసి ఆయన మాట్లాడుతూ.. మేడిపల్లి మండల కేంద్రంలోని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేడిపల్లి సర్వే నెం. 48లో గుడిసెలు వేసుకోని నివాసముంటున్న పేదలకు ఇటీవల రెవెన్యూ అధికారులు ఇండ్ల పట్టాలు పంపిణీ చేశారని ,అయితే అదే భూమిలో గత 50 ఏండ్ల క్రితం నుంచి మేడిపల్లి గౌడ కులస్థులకు చెందిన పూర్వికులు అక్కడ (ఈత చెట్ల పెంపకం) వ్యవసాయం చేసుకుంటున్నారని.. సదరు 5 ఎకరాల భూమిపై తమకే హక్కులు ఉన్నాయని చెరుకు మహేష్ స్పష్టం చేశారు. గతంలో ఈ స్థలాన్ని ప్రభుత్వ స్థలాల కార్యాలయాలకు కేటాయించడానికి సిద్ధం చేస్తుండగా 2004 సంవత్సరంలో కోర్టును ఆశ్రయించి యథాస్థితిని కోనసాగించేలా ఉత్తర్వులు వచ్చాయని పేర్కొ న్నారు. నాటినుండి కొన్ని సంవత్సరాల వరకు ఆ భూమిలో ఏలాంటి నిర్మాణాలను గాని ఆక్రమణలు కాని జరగలేదన్నారు. కానీ కొందరి ప్రోద్భలంతో గుడిసెలు రాత్రికిరాత్రే వెలిశాయన్నారు. ఆ నాటి నుంచి న్యాయస్థానంలో పోరాటం కొనసాగిస్తున్నట్టు తెలిపారు. విషయం కోర్టు పరిధిలో ఉన్నా తాజాగా ఇటీవల అక్కడ జిల్లా కలెక్టర్ 58, 59 జీవో కింద పట్టాలను పంపిణీ చేయడం శోచనీయంగా ఉందన్నారు. అధికారులకు అవగాహన లేకపోవడం మూలంగానే సమస్యగా మారిందన్నారు. తాము పూర్తి హక్కులు కలిగి ఉన్న ఈ స్థలాన్ని సాధించుకునేంత వరకు న్యాయపోరాటం చేస్తామన్ని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మెట్టు నాగయ్య గౌడ్. కుమార్ గౌడ్, పల్లె శరత్ గౌడ్, చెరకు శివానంది. సందీప్ గౌడ్. ప్రశాంత్. దంతూరి వెంకటేష్ గౌడ్ తదితరులు ఉన్నారు.

ప్రియాంక గాంధీ సభను జయప్రదం చేయాలి

- యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బంటు నరేష్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

దేశంలో, రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు నిరుద్యోగ యువతీ యువకుల పట్ల అవలంభిస్తున్న నిరుద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏఐసీసీ నాయకు రాలు ప్రియాంక గాంధీ నేతృత్వంలో సోమవారం హైదరాబాద్‌లోని సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో తలపెట్టిన "యువ సంఘర్షణ" సభను జయప్రదం చేయాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బంటు నరేష్ పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం చింతల్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్, నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయని విమర్శించారు, గడిచిన 9 ఏండ్ల లో దేశాన్ని, రాష్ట్రాన్ని అన్ని విధాలుగా బీజేపీ, బీఆర్‌ఎస్‌లు దోచుకు న్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమంతో పాటు నిరుద్యోగ యువతీ యువకులకు అన్ని విధాలుగా అండగా నిలిచిందన్నారు 2024లో దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభంజనం సృష్టించనుందని చెప్పారు.

ఏజే గ్రాండ్ బిర్యాని హెూటల్ ప్రారంభం



నవతెలంగాణ-బోడుప్పల్

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లిలో ఏజే గ్రాండ్ బిర్యాని హెూటల్‌ను ఆదివారం. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి స్థానిక మేయర్ జక్క వెంకట్ రెడ్డితో కలసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినియోగదారులకు రుచి శుచి కలిగిన తాజా ఆహార పదార్థాలను అందించి వారి మన్ననలను పొందితేనే వ్యాపారం సజావుగా కొనసాగుతుందన్నారు. ఉదాహరణలు తననే ఆదర్శంగా తీసుకోవాలని, గత 40 ఏండ్లుగా పాలు, పూలు వ్యాపారాలతో మొదలుకొని బోరు వేల్బు, స్కూళ్లు, కాలేజీలు స్థాపించి సక్సెస్ సాధించినట్టు తెలిపారు. దాంతో పాటుగా డాక్టర్లు, ఇంజనీర్లను తీర్చిదిద్దిన ఘనత సీఎం కేసీఆర్‌కు సాధ్యమైందన్నారు. కష్టపడి పనిచేస్తే ఏ వృత్తిలోనైనా రాణించగలుగుతామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు. ఏజే గ్రాండ్ అధినేత ఎంఎ. మూజిబ్, అజ్జూ, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

'నిరుద్యోగులకు అండగా యువ సంఘర్షణ సభ'



నవతెలంగాణ-కూకట్ పల్లి

యువత ఆకాంక్షలు, అమరుల ఆశయాలు నెరవేర్చడమే కాంగ్రెస్ లక్ష్యం అని కాంగ్రెస్ కూకట్ పల్లి సీనియర్ నాయకులు, పీసీసీ మెంబర్ గొట్టిముక్కల వెంగల్ రావు అన్నారు. సోమవారం జాతీయ కాంగ్రెస్ నాయకు రాలు ప్రియాంక గాంధీ హాజరయ్యే యువ సంఘర్షణ మహా సభను పురస్కరించుకుని ఆయన మాట్లాడారు. కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాల పాలనలో ప్రజల సంక్షేమాన్ని విస్మరించారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం పెరుగుతున్న ధరలను నియంత్రించడంలో చేతులెత్తేస్తే, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందన్నారు. ఇంటికో ఉద్యోగం ఇస్తామని ఒక్క ఇంటికీ ఒక్క ఉద్యోగం ఇవ్వలేదని ,నిరుద్యోగ భతి ఇస్తామని హామీ ఇచ్చి మరిచిందని, ఇలా ఎన్నికలకు ముందు ఎన్నో వాగ్దానాలు ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం వాటిని నెరవేర్చలే కపోయిందని తెలిపారు. కాబట్టి నిరుద్యోగులకు అండగా కాంగ్రెస్ నిర్వహించే యువ సంఘర్షణ సభకు ప్రియాంక గాంధీ హాజరవుతున్న సందర్భంగా ,కూకట్ పల్లి నియోజకవర్గం నుంచి సుమారు 10 వేల మంది వరకు సభకు హాజరు కానున్నారని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తన సత్తా చాటనుందని దృఢ విశ్వాసంతో చెప్పారు.

భూమిని ఆక్రమించుకుంటున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి

- తాళ్ల దర్శన్ రెడ్డి



నవతెలంగాణ-మేడ్చల్

తమ భూమిని అక్రమంగా ఆక్రమించుకుంటున్నా వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని బాధితుడు తాళ్ల దర్శన్ రెడ్డి కోరారు. ఆదివారం ఆయన ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లా డుతూ మండల పరిధిలోని పూడూరు గ్రామ సర్వే నంబర్ 6లో మూడు ఎకరాల తమ వ్యవసాయ భూమిని కొందరు ప్రయివేటు వ్యక్తులు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ మూడు ఎకరాల భూమిని గ్రామానికి చెందిన సార వెంకయ్య వద్ద తమ తండ్రి తాళ్ళ నర్సింహ రెడ్డి 1993లో కొనుగోలు చేసినట్టు తెలిపారు.అప్పటినుండి తామే ఆ భూమిని సాగు చేసుకుం టూ కాపాడుకుంటున్నామని చెప్పారు. రెవెన్యూ రికార్డులు, పహానీలో 2017వరకు తమ పేరే ఉందని తెలియజేశారు. కాగా ఆదివారం ఉదయం నాలుగు గంటల ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులు 80 మంది మహిళలు, 150మంది పురుషులు, చిన్నబోయిన యాదవ్ అనే వ్యక్తి తమ భూమి వద్దకు చేరుకొని కంటైనర్ బాక్స్, చిన్నబోయిన రమేష్ యాదవ్ పేరుతో బోర్డు ఏర్పాటు చేశారని తెలిపారు. మార్నింగ్ వాకింగ్ వెళ్లడానికి బయలుదేరుతున్న తాము అది గమనించి స్థానిక పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలానికి చేరుకోగా అట్టి వ్యక్తులు పారిపోయారని చెప్పారు. అయితే వారి నుంచి తమకు ప్రాణాపాయం ఉందని పోలీసులు రక్షణ కల్పించి న్యాయం చేయాలని కోరారు.



పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

- కార్పొరేటర్ బన్నాల

నవతెలంగాణ-ఉప్పల్

చిల్కానగర్ డివిజన్‌లోని ఆనంద్‌నగర్ కాలనీలో రోడ్ నెంబర్ 3/3లో నూతన సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ బన్నాల గీత అధికారులతో కలిసి ఆదివారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సీసీ రోడ్డు పనులు జరిగే సమయంలో జీహెచ్‌ఎంసీ ఏఈ లేదా వర్క్ ఇన్‌స్పెక్టర్ కచ్చితంగా పనులను పర్యవేక్షించాలని, కాంట్రాక్టర్ పనులలో నాణ్యత పాటించాలని లేనియెడల అధికారులు వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఎదుల కొండల్ రెడ్డి, శ్యామ్ ఫోటో బాలు, బీరప్ప గడ్డ బాలు, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు నాగయ్య, శ్రీనివాస్ రెడ్డి, రేష్మ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

రాష్ట్రంలో మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపల్‌లో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారానికి సీఐటియు కార్మిక సంఘం నిరంతరం ఎంతో కృషి చేస్తుందని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కిషన్ అన్నారు. ఆదివారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న 13వ డివిజన్ మల్లాపూర్ గ్రామంలో మున్సిపల్ కార్మికులకు గత నాలుగు రోజులుగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఆదివారం ముఖ్య అతిథిగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కిషన్ హాజరయ్యారు. ముగ్గుల పోటీలో బహుమతులు గెలిచిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. మే డే ఉత్సవాల్లో భాగంగా ఈ నెల ఒకటి నుంచి ఏడు వరకు ఈ పోటీసులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండియన్ జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కార్మికులకు రూ. 21వేల వేతనమిస్తున్నారని తెలిపారు. మన తెలంగాణ రాష్ట్రంలో మాత్రం రూ.1000 మాత్రమే పెంచిందని, రూ. 21వేల రూపాయలు పెంచే వరకు కార్మికులు ఉద్యమం చేయవలసి ఉంటుందన్నారు. కార్మికుల హక్కుల కోసం ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు యాదగిరి, సత్యనారాయణ, యాదగిరి చారి,బాలాపూర్ మండల కన్వనర్ పెంటయ్య, మున్సిపల్ సూపర్ వైజర్లు శ్రీనివాస్, లక్ష్మయ్య, వెంకటయ్య, లలిత, అండాలు, పొన్నమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు గురు పురస్కారాలు అందజేత



నవతెలంగాణ-మేడ్చల్

అఖిల భారతీయ అయ్యప్ప ధర్మప్రచార సభ రాష్ట్ర అధ్యక్షుడు మేది తిరుమలరావు అధ్యక్షతన మండల పరిధిలోని పూడూరు గ్రామంలోని శ్రీహరి హర నందన అయ్యప్ప స్వామి దేవాలయంలో ఆదివారం రాష్ట్ర స్థాయి జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని ప్రముఖ గురు స్వాములకు గురు పురస్కారాలు బహూకరించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా ఏపీ ట్రస్ట్ కార్యదర్శి ఆర్ వెంకటేశం హాజరై మాట్లాడారు. అనేక కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. అయ్యప్ప దీక్ష చేసే స్వాములకు ప్రభుత్వం ట్రావెలింగ్ అలేవెన్స్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రొండా మల్లారెడ్డి, ఉభయ తెలుగు రాష్ట్రాల కన్వీనర్ రాచర్ల రమేష్, రాష్ట్ర కార్యదర్శి టీవీ పుల్లంరాజు, ఉపాధ్యక్షులు భాస్కరాచారి, కోశాధికారి గంగాధర్, స్టేట్ వాలంటరీ కమాండెంట్ సిరిసెట్టి రాజేష్, పీఆర్ఓ కరక సిద్ధు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బీఎస్పీ తెలంగాణ భరోసా సభ





నవతెలంగాణ-సరూర్‌నగర్

యువతకు క్రీడా సామాగ్రి పంపిణీ చేసిన డిప్యూటీ మేయర్



నవతెలంగాణ-ఓయూ

తార్నాక డివిజన్‌లోని యువ, క్రీడాకారులకు గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ శ్రీమతి మోతె శ్రీలత శోభన్ రెడ్డి క్రీడా సామాగ్రిని ఆదివారం పంపిణీ చేశారు. తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంప్ కార్యాలయం లో జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్మిక విభాగ అధ్యక్షుడు శ్రీ మోతే శోభన్ రెడ్డితో కలిసి యువతకు క్రికెట్ కిట్లు, బ్యాడ్మింటన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ క్రీడలతో శారీరకోల్లాసంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ రోజూ క్రీడలకు సమయం కేటాయించాలని సూచించారు. ప్రస్తుత దైనందిన జీవితంలో ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిడిని కూడా దీని ద్వారా అధిగమించవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఐవీఎఫ్ బలోపేతానికి వైశ్యులు సన్నద్ధం కావాలి



- ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి ఉప్పల శ్రీనివాసగుప్త

నవతెలంగాణ-నాగోల్

తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాలలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ బలోపేతం చేసేందుకు వైశ్య నాయకులు, యువత సన్నద్ధంకావాలని ఉప్పల ఫౌండేషన్ చైర్మెన్ , ఇంటర్నేషనల్ వైశ్యఫెడరేషన్ జాతీయ కార్యదర్శి ఉప్పల శ్రీనివాసగుప్త పిలుపునిచ్చారు. ఆదివారం ముషీరాబాద్ ఆర్యవైశ్య హాస్టల్‌లో ఐవీఎఫ్ మేడ్చల్ జిల్లా నూతన కమిటీ ప్రమాణ స్వీకార మహెూత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ బుగ్గారపు దయానంద్ గుప్తా , ఐవీఎఫ్ కేంద్ర కమిటీ సీనియర్ కార్యనిర్వాహ అధ్యక్షులు గంజి రాజమౌళి గుప్తా, ఐవీఎఫ్ జాతీయ కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్తలు పాల్గొని జ్యోతి ప్రజ్వలనచేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఐవీఎఫ్ ఆధ్వర్యంలో 25 మంది పేద మహిళలకు కుట్టు మిషన్లు, ఉప్పల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇద్దరు పేదింటి ఆడబిడ్డల పెండ్లీలకు మంగళసూత్రం ,మెట్టెలు ,చీర ,గాజులను అందించారు. నూతనంగా ఎన్నికైన ఐవీఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు సంబు పాండయ్య ,ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రమేష్ గుప్తా, కోశాధికారి బోనగిరి శ్రావణ్ కుమార్, సహాయ కోశాధికారి ఊరే నగేష్ గుప్తాలతో పాటు కార్యవర్గ సభ్యులను, మహిళా విభాగం, యువజన విభాగం సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాసగుప్త మాట్లాడుతూ వైశ్యులు వ్యాపారులకే పరిమితం కాకుండా సమాజ సేవలలో ముందుండాలని కోరారు. ఈ కార్యక్రమంలో అయితరాములు, చకిలం రమణయ్య, పీర్జాదిగూడ కార్పొరేటర్ రగోతంరెడ్డి, లతో పాటు ఐవీఎఫ్ నాయకులు, సభ్యులు, ఆర్యవైశ్య నాయకులు ,ఆయా విభాగాల కమిటీ అధ్యక్ష ,కార్యదర్శులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఉత్సాహంగా సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లు..

నవతెలంగాణ-సిటీబ్యూరో

జీహెచ్‌ఎంసి నిర్వహిస్తున్న సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లో 44 రకాల క్రీడా పోటీలలో 6 నుండి 16 సంవత్సరాల వయసు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు. కూకట్‌పలి, శేర్లింగంపల్లిలో అథ్లెటిక్స్ విభాగంలో నేషనల్ కోచ్ డగ్లెస్ ఆధ్వర్యంలో 118 మంది శిక్షణ పొందుతున్నారు. ఆక్సిటిక్స్ హడ్యూల్ ,జావలిన్ త్రో, హై జంప్, లాంగ్ జంప్ శిక్షణ అందిస్తున్నారు. ఖైరతాబాద్ జోన్ వాలీబాల్, విక్టరీ ప్లేగ్రౌండ్ వినోద్ కోచ్ ఆధ్వర్యంలో, షేక్‌పేట్ కోచ్ మురళి ఆధ్వర్యంలో600 విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. సికింద్రాబాద్ జోన్‌లో మారేడ్‌పల్లి ప్లే గ్రౌండ్‌లో కోచ్ రాజు ఆధ్వర్యంలో, టీచర్స్ కాలనీ కోచ్ వెంకటేష్ ఆధ్వర్యంలో 200 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. చార్మినార్ జోన్ లో కులీ కుతుబ్షా స్టేడియంలో క్రికెట్‌లో 200 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. ఎల్బీనగర్ జోన్ లో ఉప్పల్ స్టేడియంలో, విశ్వనాథం రామ్ కుమార్, బాలరాజు ఆధ్వర్యంలో కరాటే 1000 మంది శిక్షణ పొందు తున్నారు.





బండి సంజయ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన వెంకటేష్ నాయక్



నవతెలంగాణ-శామీర్‌పేట


బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ కుమార్ ను ఆదివారం బీజేపీ మేడ్చల్ జిల్లా గిరిజన మోర్చా ప్రధాన కార్యదర్శి గుగులోత్ వెంకటేష్ నాయక్ నాంపల్లిలోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మూడుచింతలపల్లి మండల సంస్థాగత విషయాలపై చర్చించారు. కాగా బండి సంజయ్ గుగ్లోత్ వెంకటేష్ నాయక్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షులు కేతావత్ సుధాకర్ నాయక్ పాల్గొన్నారు.

గిల్, సాహా దూకుడు

- ప్లే ఆఫ్స్‌లో గుజరాత్ టైటాన్స్ అడుగు
- ఛేదనలో క్వింటన్ డికాక్ పోరాటం వృథా
- లక్నో సూపర్‌జెయింట్స్‌పై భారీ విజయం

పాండ్య సోదరుల సమరంలో హార్దిక్ పాండ్య పైచేయి సాధించాడు. లక్నో సూపర్‌జెయింట్స్‌పై తిరుగులేని ఆధిపత్యం చెలాయించిన గుజరాత్ టైటాన్స్ 56 పరుగుల తేడాతో భారీ విజయం నమోదు చేసింది. ఈ విజయంతో 16 పాయింట్లు ఖాతాలో వేసుకున్న గుజరాత్ టైటాన్స్ ఐపీఎల్16 ప్లే ఆఫ్స్‌కు చేరుకున్న తొలి జట్టుగా నిలిచింది. తొలుత గుజరాత్ టైటాన్స్ 227 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఛేదనలో లక్నో సూపర్‌జెయింట్స్ 171 పరుగులకే పరిమితమైంది. ఐపీఎల్‌లో లక్నో సూపర్‌జెయింట్స్‌తో ఆడిన నాలుగు మ్యాచుల్లో గుజరాత్ టైటాన్స్ విజయాలు సాధించటం విశేషం.





నవతెలంగాణ-అహ్మదాబాద్

గుజరాత్ టైటాన్స్ అడుగు పెట్టింది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2023 ప్లే ఆఫ్స్‌లో అధికారికంగా కాలుమోపింది. ఆదివారం లక్నో సూపర్‌జెయింట్స్‌పై 56 పరుగుల తేడాతో ఎదురులేని విజయం నమోద చేసిన గుజరాత్ టైటాన్స్.. సీజన్లో ఎనిమిదో గెలుపుతో ప్లే ఆఫ్స్‌లో చోటు ఖాయం చేసుకుంది. శుభ్‌మన్ గిల్ (94 నాటౌట్, 51 బంతుల్లో 2 ఫోర్లు, 7 సిక్స్‌లు), వృద్ధిమాన్ సాహా (81, 43 బంతుల్లో 10 ఫోర్లు, 4 సిక్స్‌లు) ధనాధన్ అర్థ సెంచరీలతో చెలరేగారు. ఓపెనర్లు విజృంభించిన వేళ గుజరాత్ టైటాన్స్ తొలుత భారీ స్కోరు నమోదు చేసింది. 20 ఓవర్లలో 2 వికెట్లకు 227 పరుగులు సాధించింది. భారీ ఛేదనలో లక్నో సూపర్‌జెయింట్స్ చతికిల పడింది. క్వింటన్ డికాక్ (70, 41 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) పోరాడినా ఫలితం దక్కలేదు. 20 ఓవర్లలో 7 వికెట్లకు లక్నో సూపర్‌జెయింట్స్ 171 పరుగులే చేసింది. 56 పరుగుల భారీ వ్యత్యాసంతో గుజరాత్ టైటాన్స్ ఏకపక్ష విజయం నమోదు చేసింది. అజేయ అర్థ సెంచరీతో దంచికొట్టిన దంచికొట్టిన శుభ్‌మన్ గిల్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు. 11 మ్యాచుల్లో గుజరాత్ టైటాన్స్‌కు ఇది ఎనిమిదో విజయం కాగా, 11 మ్యాచుల్లో లక్నో సూపర్‌జెయింట్స్‌కు ఇది ఐదో పరాజయం. పాయింట్ల పట్టికలో గుజరాత్ టైటాన్స్ (16) అగ్రస్థానంలో నిలువగా, లక్నో సూపర్‌జెయింట్స్ (11) మూడో స్థానంలో కొనసాగుతుంది.

ఛేదనలో చతికిల :

లక్నో సూపర్‌జెయింట్స్ లక్ష్యం 228 పరుగులు. ఈ సీజన్లోనే అత్యధిక స్కోరు సాధించిన రికార్డు ఆ జట్టు సొంతం. తొలి పది ఓవర్లలో లక్నో సూపర్‌జెయింట్స్ ఇన్నింగ్స్ లక్ష్యం దిశగా సాగింది. కానీ చివరి పది ఓవర్లలో లక్నో ఇన్నింగ్స్ గతి తప్పింది. ఫలితంగా ఆ జట్టు 56 పరుగుల తేడాతో భారీ పరాజయం పాలైంది. ఓపెనర్లు కైల్ మేయర్స్ (48, 32 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), క్వింటన్ డికాక్ (70, 41 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) ధనాధన్ ఆరంభాన్ని అందించారు. పవర్‌ప్లేలో లక్నో వికెట్ నష్టపోకుండా 72 పరుగులు పిండుకుంది. 24 బంతుల్లోనే 50 పరుగుల భాగస్వామ్యం జోడించిన మేయర్స్, డికాక్.. టైటాన్స్ బౌలర్లకు సవాల్ విసిరారు. ఏడు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 31 బంతుల్లో క్వింటన్ డికాక్ అర్థ సెంచరీ నమోదు చేశాడు. అర్థ సెంచరీ ముంగిట కైల్ మేయర్స్ నిష్క్రమణతో లక్నో తడబాటు మొదలైంది. దీపక్ హుడా (11), మార్కస్ స్టోయినిస్ (4), నికోలస్ పూరన్ (3), కెప్టెన్ కృనాల్ పాండ్య (0) ఒత్తిడికి చిత్తయ్యారు. ఆయుశ్ బదాని (21, 11 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు) ఒక్కడే మిడిల్ ఆర్డర్‌లో చెప్పుకోదగిన ప్రదర్శన చేశాడు. మేయర్స్ డగౌట్‌కు చేరుకున్నాక.. లక్నో సూపర్‌జెయింట్స్ మానసికంగా ఓటమికి సిద్ధపడింది. 20 ఓవర్లలో 7 వికెట్లకు ఆ జట్టు 171 పరుగులే చేసింది. గుజరాత్ టైటాన్స్ బౌలర్లలో మోహిత్ శర్మ (4/29) నాలుగు వికెట్లతో రాణించాడు. మహ్మద్ షమి, రషీద్ ఖాన్, నూర్ అహ్మద్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

గిల్, సాహా ఉతికేశారు :

టాస్ నెగ్గిన లక్నో సూపర్‌జెయింట్స్ తొలుత ఫీల్డింగ్ ఎంచుకుంది. సొంతగడ్డపై తొలుత బ్యాటింగ్‌కు వచ్చిన గుజరాత్ టైటాన్స్‌కు ఓపెనర్లు బ్యాంగ్‌బ్యాంగ్ అందించారు. సీనియర్ ఓపెనర్ వృద్ధిమాన్ సాహా (81, 43 బంతుల్లో 10 ఫోర్లు, 4 సిక్స్‌లు), యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ (94 నాటౌట్, 51 బంతుల్లో 2 ఫోర్లు, 7 సిక్స్‌లు) అర్థ సెంచరీలతో కదం తొక్కారు. పవర్‌ప్లేలో వృద్ధిమాన్ సాహా లక్నో బౌలర్లను ఊచకోత కోశాడు. సాహా విధ్వంసక విన్యాసంతో తొలి ఆరు ఓవర్లలోనే టైటాన్స్ 78 పరుగులు పిండుకుంది. ఆరు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 20 బంతుల్లోనే సాహా అర్థ సెంచరీ మార్క్ అందుకున్నాడు. మరో ఎండ్‌లో గిల్ భిన్నమైన ఆటతీరు కనబరిచాడు. నాలుగు సిక్సర్లతో 29 బంతుల్లో అర్థ సెంచరీ సాధించాడు. సహజంగా బౌండరీలు ఎక్కువగా సాధించే గిల్.. లక్నోపై సిక్సర్ల వర్షం కురిపించాడు. తొలి వికెట్‌కు సాహా, గిల్ జోడీ 142 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పింది. కెప్టెన్ హార్దిక్ పాండ్య (25, 15 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు), డెవిడ్ మిల్లర్ (21 నాటౌట్, 12 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడారు. ఓ ఎండ్‌లో గిల్ ఏడు సిక్సర్లతో అజేయంగా 94 పరుగులు సాధించాడు. గిల్ మెరుపులతో గుజరాత్ టైటాన్స్ 227 పరుగుల భారీ స్కోరు సాధించింది. లక్నో సూపర్‌జెయింట్స్ ఎనిమిది మంది బౌలర్లను ప్రయోగించినా ప్రయోజనం దక్కలేదు. మోహ్సిన్ ఖాన్, అవేశ్ ఖాన్‌లు చెరో వికెట్ ఖాతాలో వేసుకున్నారు. ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్ చేతిలో లక్నో సూపర్‌జెయింట్స్‌కు ఇది వరుసగా నాల్గో పరాజయం.

స్కోరు వివరాలు :

గుజరాత్ టైటాన్స్ : వృద్ధిమాన్ సాహా (సి) ప్రేరక్ మన్కడ్ (బి) అవేశ్ ఖాన్ 81, శుభ్‌మన్ గిల్ నాటౌట్ 94, హార్దిక్ పాండ్య (సి) కృనాల్ పాండ్య (బి) మోహ్సిన్ ఖాన్ 25, డెవిడ్ మిల్లర్ నాటౌట్ 21, ఎక్స్‌ట్రాలు : 6, **మొత్తం : (20 ఓవర్లలో 2 వికెట్లకు) 227.**

వికెట్ల పతనం : 1-142, 2-184.

బౌలింగ్ : మోహ్సిన్ ఖాన్ 3-0-42-1, అవేశ్ ఖాన్ 4-0-34-1, కృనాల్ పాండ్య 4-0-38-0, యశ్ ఠాకూర్ 4-0-48-0, రవి బిష్ణోయ్ 2-0-21-0, కైల్ మేయర్స్ 1-0-16-0, స్వప్నిల్ సింగ్ 1-0-7-0, మార్కస్ స్టోయినిస్ 1-0-20-0.

లక్నో సూపర్‌జెయింట్స్ : కైల్ మేయర్స్ (సి) రషీద్ ఖాన్ (బి) మోహిత్ శర్మ 48, క్వింటన్ డికాక్ (బి) రషీద్ ఖాన్ 70, దీపక్ హుడా (సి) రాహుల్ తెవాటియ (బి) మహ్మద్ షమి 11, మార్కస్ స్టోయినిస్ (సి) మహ్మద్ షమి (బి) మోహిత్ శర్మ 4, నికోలస్ పూరన్ (సి) మహ్మద్ షమి (బి) నూర్ అహ్మద్ 3, ఆయుశ్ బదాని (సి) నూర్ అహ్మద్ (బి) మోహిత్ శర్మ 21, స్వప్నిల్ సింగ్ నాటౌట్ 2, కృనాల్ పాండ్య (సి) డెవిడ్ మిల్లర్ (బి) మోహిత్ శర్మ 0, రవి బిష్ణోయ్ నాటౌట్ 4, ఎక్స్‌ట్రాలు : 8, **మొత్తం :(20 ఓవర్లలో 7 వికెట్లకు) 171.**

వికెట్ల పతనం : 1-88, 2-114, 3-130, 4-140, 5-153, 6-166, 7-166.

బౌలింగ్ : మహ్మద్ షమి 4-0-37-1, హార్దిక్ పాండ్య 3-0-37-0, రషీద్ ఖాన్ 4-0-34-1, నూర్ అహ్మద్ 4-0-26-1, మోహిత్ శర్మ 4-0-29-4, అల్జారీ జొసెఫ్ 1-0-5-0.

సోదరుల సమరం



అన్నదమ్ములు కలిసి ఒకే జట్టుకు ఆడటం, ప్రత్యర్థి జట్ల తరఫున ప్రాతినిధ్యం వహించటం ఇప్పటి వరకు మనం చూశాం. ఇర్ఫాన పఠాన్, యూసుఫ్ పఠాన్, మైకల్ హస్సీ, డెవిడ్ హస్సీ, టామ్ కరణ్, శామ్ కరణ్, షాన్ మార్ష్, మిచెల్ మార్ష్, అల్బీ మోర్కెల్, మోర్ని మోర్కెల్, దీపక్ చాహర్, రాహుల్ చాహర్, బ్రెండన్ మెక్‌కలమ్, నాథన్ మెక్‌కలమ్, డ్వేన్ బ్రావో, డారెన్ బ్రావో, మార్కో జాన్సెన్, డ్వాన్ జాన్సెన్.. ఇలా ఎందరో అన్నదమ్ములు ఐపీఎల్‌లో కలిసి, ఒకరితో ఒకరు పోటీపడ్డారు. కానీ ఐపీఎల్ చరిత్రలో తొలిసారి రెండు జట్లకు సోదరులు సారథ్యం వహించి ముఖాముఖి తలపడ్డారు. గుజరాత్ టైటాన్స్, లక్నో సూపర్‌జెయింట్స్ మ్యాచ్‌లో ఇది చోటు చేసుకుంది. హార్దిక్ పాండ్య టైటాన్స్‌కు, కృనాల్ పాండ్య సూపర్‌జెయింట్స్‌కు కెప్టెన్సీ వహించారు. ' మా కల నిజమైంది. హార్దిక్, నేను మా జట్లకు సారథ్యం వహిస్తున్నాం. మా కుటుంబానికి ఇది భావోద్వేగ రోజు. మా నాన్న కచ్చితంగా గర్వపడతారు. ఇలా రెండు జట్లకు సోదరులు సారథ్యం వహించటం ఇదే ప్రథమం. మాటలు రావట్లేదు. కానీ మా కుటుంబం గర్వపడుతుంది' అని పాండ్య సోదరులు భావోద్వేగం పంచుకున్నారు.

ఎంపీలపై అనర్హత వేటు..

- 1988 తర్వాత 42 మంది ఎంపీలపై చర్య
- 14వ లోక్‌సభలో అత్యధికంగా 19 మంది తొలగింపు

న్యూఢిల్లీ : 1988 తర్వాత ఇప్పటి వరకూ పార్లమెంటులో 42 మంది ఎంపీలు అనర్హత వేటుకు గురై సభ్యత్వాలు కోల్పోయారు. 14వ లోక్‌సభ అత్యధికంగా 19 మందిపై వేటు వేసింది. ప్రశ్నలు అడిగినందుకు ముడుపులు తీసుకున్న ఉదంతం, క్రాస్ ఓటింగ్ వంటి కారణాలతో ఎక్కువ మంది సభ్యుల సభ్యత్వాలు రద్దయ్యాయి.

పార్టీ ఫిరాయింపులు, సభలో ప్రవర్తన, రెండేండ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం జైలుశిక్ష పడడం వంటి కారణాలతో ఎంపీల సభ్యత్వాలను రద్దు చేశారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, ఎన్సీపీ నేత మహమ్మద్ ఫైజల్, బీఎస్పీ నాయకుడు అఫ్జల్ అన్సారీలకు న్యాయస్థానాలు జైలు శిక్ష విధించడంతో వారి సభ్యత్వాలు రద్దయ్యాయి. వీరిలో ఫైజల్ కోర్టు నుంచి స్టే పొందారు. 1985లో ఫిరాయింపుల నిరోధక చట్టం అమలులోకి వచ్చిన తర్వాత మొట్టమొదటిసారిగా కాంగ్రెస్ సభ్యుడు లాల్‌దుహోమాపై వేటు పడింది. తొమ్మిదవ లోక్‌సభలో జనతాదళ్ నేత విపి సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు 9 మంది సభ్యులపై ఫిరాయింపుల నిరోధక చట్టం కింద వేటు పడింది.

2005లో ముడుపులు తీసుకొని ప్రశ్నలు అడిగినందుకు ఉభయసభలకు చెందిన 11 మందిని, 2008 జూలైలో ప్రభుత్వంపై విశ్వాస పరీక్ష సందర్భంగా క్రాస్ ఓటింగ్‌కు పాల్పడినందుకు 9 మంది లోక్‌సభ సభ్యులను అనర్హులుగా ప్రకటించారు. 10వ లోక్‌సభలో పీవీ నరసింహారావు ప్రధానిగా ఉన్నప్పుడు పార్టీ ఫిరాయించిన నలుగురిపై వేటు పడింది. రాజ్యసభ కూడా 1989 నుండి ఇప్పటివరకూ నలుగురిపై వేటు వేసింది. పార్లమెంట్ సభ్యుడిగా ఉంటూ లాభాలు ఆర్జించే వేరే పదవిని నిర్వహించినందుకు 2001లో జేఎంఎం నేత శిబూ సొరేన్, 2006లో సమాజ్‌వాదీ పార్టీ సభ్యురాలు జయాబచ్చన్‌లపై అనర్హత వేటు వేశారు. అవినీతి కేసులో శిక్ష పడిన కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు రషీద్ మసూద్, దాణా కుంభకోణం కేసులో శిక్ష పడిన ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్, జేడీ (యు) సభ్యుడు జగదీష్ శర్మ కూడా అనర్హతకు గురయ్యారు.

కేరళలో హౌస్‌బోట్ బోల్తా :15 మంది మృతి

మలపురం : కేరళలోని మలపురం జిల్లాలో ఆదివారం సాయంత్రం ఒక హౌస్‌బోట్ బోల్తా పడిన మునిగి పోయిన ప్రమాదంలో 15 మంది మరణించారు. మృతుల్లో ఎక్కువ మంది చిన్నారులు ఉన్నారు. జిల్లాలోని తనూర్ ప్రాంతంలోని తువల్తిరం బీచ్ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం వార్త తెలిసిన వెంటనే అక్కడకు చేరుకున్న రాష్ట్ర క్రీడల మంత్రి వి అబ్దురహిమాన్ సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. వేసవి సెలవులు కారణంగా విద్యార్థులు అధికసంఖ్యలో రైడ్‌కు వచ్చారని, అందుకే మృతుల సంఖ్యలో వీరే అధికంగా ఉన్నారని అధికారులు చెప్పారు. ప్రమాదానికి కారణం ఇంకా వెల్లడి కాలేదని, పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని అధికారులు తెలిపారు.

మణిపూర్‌లో సాధారణ పరిస్థితులు!

- మూడు గంటల పాటు కర్ఫ్యూ సడలింపు
- నేడు సుప్రీం విచారణ

ఇంఫాల్ : మణిపూర్‌లో క్రమక్రమంగా సాధారణ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. దీంతో ఆదివారం కొన్ని గంటల పాటు కర్ఫ్యూ సడలించారు. రాష్ట్రంలో గిరిజనులు, గిరిజనేతరుల మధ్య ఘర్షణలు జరగడంతో 54 మందికిపైగా మరణించిన సంగతి తెలిసిందే. వందల మంది గాయపడగా, వేలాది మంది నిరాశ్రయులయ్యారు. దీంతో కొన్ని ప్రాంతాల్లో ఈ నెల 3 నుంచి కర్ఫ్యూ అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఆదివారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకూ మూడు గంటల పాటు కర్ఫ్యూను సడలించడంతో ఆహారం, మందులు, ఇతర నిత్యావసర వస్తువులు కొనుగోలు కోసం పెద్ద సంఖ్యలో ప్రజలు బయటకు వచ్చారు. 10 గంటలకు కర్ఫ్యూ సడలింపు ముగిసిన వెంటనే ఆర్మీ, అస్సాం రైఫిల్స్ వంటి భద్రతా సిబ్బంది ఫ్లాగ్ మార్చ్ నిర్వహించాయి. శనివారం కూడా సాయంత్రం 3 గంటల నుంచి 5 గంటల వరకూ కర్ఫ్యూను సడలించినట్లు అధికారులు చెప్పారు. ప్రస్తుతం మణిపూర్‌లో పది వేలకు పైగా సైన్యం, పారా మిలటరీ, సీఆర్‌పీఎఫ్‌కు చెందిన సైనికులు మోహరించి ఉన్నారు. సాధారణ నిఘాతో పాటు గగనతల నిఘా వ్యవస్థను సైన్యం పెంచినట్లు రక్షణ శాఖ ప్రతినిధి ఒకరు తెలిపారు. 'సైన్యం గగనతల నిఘా వ్యవస్థను పెంచింది. ఇందుకోసం డ్రోన్లను, హెలికాప్టర్లను మోహరించాం' అని చెప్పారు.

రాష్ట్రంలో క్షేత్రస్థాయి నుంచి శాంతి భద్రతలు పునరుద్ధరణ కోసం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోనూ శాంతి కమిటీలను ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి ఎన్.బీరెన్ సింగ్ తెలిపారు. ఇప్పటి వరకూ 23 వేల మందికి పైగా పౌరులను రక్షించి, సురక్షిత శిబిరాలకు తరలించినట్లు చెప్పారు.మణిపూర్‌లో అల్లర్ల విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటుచేయాలని కోరుతూ దాఖలైన పిటీషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం విచారించనుంది. ఢిల్లీకి చెందిన మణిపూర్ గిరిజన ఫోరం వేసిన ఈ పిటీషన్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం విచారణకు షెడ్యూల్ చేసింది. మణిపూర్‌లో పరిస్థితి తీవ్రంగా ఉందని, ఈ దాడులకు రాష్ట్రం, కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ నుంచి పూర్తి మద్దతు ఉందని పిటీషన్‌లో ఫోరం ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ దాడులు ఢిల్లీకి వ్యాపించాయని, మేఘాలయాలోనూ ఇలాంటి దాడులు జరుగుతున్నాయని తెలిపారు. గిరిజనులపై దాడికి పాల్పడుతున్న సాయుధులు సెమీ ఆటోమేటిక్ ఆయుధాలతో తిరుగుతూ ఇళ్లల్లో లూటీకి పాల్పడుతున్నట్లు కొన్ని వీడియోలు, ఫోటోల్లో కనిపిస్తోందని పేర్కొన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

డార్విన్ జీవ పరిమాణ సిద్ధాంతంపై
వెయ్యి సదస్సులు

- జేవీవీ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డాక్టర్ కోయ వెంకటేశ్వరరావు, శ్రీనాథ్

నవతెలంగాణ-నల్లగొండ

రాష్ట్రవ్యాప్తంగా డార్విన్ జీవపరిణామ సిద్ధాంత ప్రచారంలో భాగంగా 1000 సదస్సులను నిర్వహించనున్నట్టు జనవిజ్ఞానవేదిక రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డాక్టర్ కోయ వెంకటేశ్వరరావు, శ్రీనాథ్ తెలిపారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని మనోరమ హోటల్‌లో రెండు రోజుల పాటు జరిగిన జేవీవీ రాష్ట్ర 4వ వార్షిక సభలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీవ శాస్త్రానికి వెన్నెముకైన పరిణామ సిద్ధాంతాన్ని పదవ తరగతి పాఠ్యాంశం నుంచి తొలగించినందుకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా అనేక పాఠశాలలు, కళాశాలల్లో రానున్న రెండు, మూడు నెలల్లో 1000 పైగా సదస్సులు నిర్వహించనున్నట్టు తెలిపారు. సమకాలీన శాస్త్ర అంశాలను విద్యార్థులకు నిరంతరం తెలియజేయడం కోసం రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 1500 పైగా పాఠశాలల్లో సైన్స్‌క్లబ్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. తామ చేపట్టిన శాస్త్ర ప్రచార కార్యక్రమాలకు మద్దతు ఇవ్వాల్సిందిగా శాస్త్రవేత్తలు, ఉపాధ్యాయులు, మేధావులను కోరారు. విద్యార్థులతో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. నేడు పాలకులు అభివృద్ధి పేరుతో శాస్త్ర పరిశోధనల ఆవిష్కరణలను దుర్వినియోగం చేస్తున్నారని, దాని ఫలితమే మనం ఎదుర్కొంటున్న అనేక పర్యావరణ సమస్యలని తెలిపారు.

కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్ తయారి ఇద్దరి అరెస్ట్



నవతెలంగాణ-రాజేంద్రనగర్

కల్తీ అల్లం పేస్ట్ తయారు చేస్తున్న పరిశ్రమపై ఎస్‌ఓటీ పోలీసులు దాడులు చేసి ఇద్దరిని అరెస్టు చేశారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాటేదాన్‌లోని శాంతినగర్‌లో ఫిరోజ్, హాజిల్ అనే ఇద్దరు వ్యక్తులు కొన్నేండ్ల నుంచి గుట్టు చప్పుడు కాకుండా కల్తీ ఆహార పదార్థాలను తయారు చేస్తున్నారు. కల్తీ అల్లం పేస్ట్, మాంగో డ్రింక్ తయారు చేస్తున్నారు. ఈ కల్తీ అల్లం పేస్ట్‌లో ప్రమాదకర ఎసిటిక్ యాసిడ్‌ను ఉపయోగిస్తున్నారు. అత్యంత విశ్వసనీయ సమాచారం ప్రకారం ఆ పరిశ్రమలపై ఎస్‌ఓటీ దాడులు నిర్వహించగా పెద్ద ఎత్తున కల్తీ అల్లం పేస్ట్ లభ్యమైంది. ఫిరోజ్, హాజిల్ అదుపులోకి తీసుకొని విచారించగా కల్తీ వ్యాపారం చేస్తున్నట్టు ఒప్పుకున్నారు. వీరిద్దరిని అరెస్టు చేసి మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పండ్ల తోటలోకి వెళ్లిన బాలికను
కట్టేసి కొట్టారు

గద్వాల జిల్లాలో ఘటన



నవతెలంగాణ -మల్దకల్

బత్తాయి తోటలో పండ్లకోసమని వెళ్లిన బాలిక ప్రవళికపై దొంగతనం మోపిన తోట యజమాని శ్రీలత.. మండుటెండలో గొలుసులతో బాలికను కట్టి నరకయాతన పెట్టిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గద్వాల జిల్లా మల్దకల్ మండలం విఠలాపురం గ్రామంలో శనివారం జరిగిన ఈ ఘటన సోషల్ వీడియాలో హల్‌చల్ చేస్తోంది. కాగా, తోట యాజమాని శ్రీలతపై కేసునమోదు చేయాలని ప్రవళిక తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బాలిక ప్రవళిక బత్తాయి తోటలోకి వెళ్లగా.. ఆమెను చూసిన తోట యజమాని భార్య శ్రీలత.. ఆమెపై దొంగతనం మోపి గొలుసులతో చెట్టుకు కట్టేసింది. దాహంతో మంచినీళ్లు అడిగినా.. కనికరించకుండా గంటల తరబడి మండుటెండలో నరకయాతన పెట్టింది. విషయం తెలుసుకున్న ప్రవళిక తల్లిదండ్రులు తోటకు వెళ్లి యజమాని కాళ్లావేళ్లా పడ్డా విడిచిపెట్టలేదు. పైగా ఎవరికి చెప్పు కుంటారో చెప్పుకోండంటూ నిర్లక్ష్యంగా వ్యవహరిం చారు. అంతేకాదు, ఏ పోలీస్‌స్టేషన్‌లో అయినా కేసు పెట్టుకోండి.. మమ్మల్ని ఎవ్వరూ ఏమీచేయలేరంటూ బాలిక తల్లిదండ్రులపై విరుచుపడ్డారు. మీ గొర్రెలు ఈ ఊర్లో ఎలా మేపుకుంటారో చూస్తామని, మీ అంతుచూస్తామంటూ బాలిక తల్లిదండ్రులను బెదిరించారు. ఈ సంఘటన సోషల్ మీడియాలో హల్‌చల్ కావడంతో తోట యాజమాని బాలిక తల్లిదండ్రులతో బేరసారాలకు ప్రయత్నాలు చేసినట్టు సమాచారం. కాగా, తోట యజమాని మహేందర్ రెడ్డి భార్యపై బాలిక తల్లిదండ్రులు కేసు నమోదు చేశారు. ఘటనపై పూర్తి దర్యాప్తు జరిపి న్యాయం చేస్తామని ఏఎస్ఐ ఈశ్వరయ్య తెలిపారు.

తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం

వాటినే కాపీ కొట్టి అమలుచేస్తున్న కేంద్ర ప్రభుత్వం : ఆర్థిక, వైద్యఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు



నవ తెలంగాణ-కొండపాక

రాష్ట్ర ప్రభుత్వ పథకాలను కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలో మెచ్చుకుంటూ, వాటిని కాపీ కొట్టి దేశవ్యాప్తంగా అమలుచేస్తున్నారని, మరోపక్క గల్లీల్లో తిడుతున్నారని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. రైతుబంధు, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ పథకాలను కాపీ కొట్టారని అన్నారు. సీఎం కేసీఆర్ తెలంగాణలో చేపట్టిన పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని తెలిపారు. సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ సమీపంలో పీవీ నరసింహారావు తెలంగాణ పశు వైద్య కళాశాల భవన నిర్మాణానికి పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, సిద్దిపేట జిల్లా జడ్పీ చైర్ పర్సన్ రోజా రాధా కృష్ణశర్మతో కలిసి ఆదివారం మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గొర్రెల పంపిణీ పథకంతో ఒకప్పుడు మాంసం దిగుమతి చేసుకున్న రాష్ట్రం నేడు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసే స్థాయికి చేరుకుందన్నారు. మూడు శాతం జనాభా ఉన్న రాష్ట్రానికి 38 శాతం అవార్డులు, దక్షిణ భారతదేశంలోనే అత్యధిక కేంద్ర ప్రభుత్వ అవార్డులు అందుకున్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని తెలిపారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ఘాట్ నిర్మాణానికి నాటి కాంగ్రెస్ పెద్దలు ఢిల్లీలో అనుమతి ఇవ్వలేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం హైదరాబాదులో పీవీ ఘాట్ నిర్మించడంతో పాటు వెటర్నరీ విశ్వవిద్యాలయానికి పీవీ నరసింహారావు పేరు పెట్టి గౌరవించుకున్నామన్నారు. కాళోజీ పేరిట హెల్త్ విశ్వవిద్యాలయం, కొండా లక్ష్మణ్ బాపూజీ పేరిట హార్టికల్చర్ యూనివర్సిటీలను ఏర్పాటు చేసుకున్నట్టు గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో చెరువులు, రిజర్వాయర్లు జలకళను సంతరించుకున్నాయన్నారు. విద్యకు తెలంగాణ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు.

అనంతరం మంత్రి తలసాని మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమైందన్నారు. 2014తో పోలిస్తే నేడు తెలంగాణ పల్లెల్లో అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. తెలంగాణ అభివృద్ధి విషయంలో బీజేపీ నేతలు అబద్దాలు మాట్లాడుతున్నారన్నారు. తెలంగాణలో మాదిరిగా రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ప్రధాని మోడీ సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో లేదన్నారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో 3,72,000 మంది మత్స్యకారులకు సభ్యత్వం అందించామని, మరో లక్ష మందికి అందించనున్నట్టు వెల్లడించారు. 18 ఏండ్లు నిండిన మత్స్యకారులకు మెంబర్ షిప్, 18 ఏండ్లు నిండిన గొల్ల కురుమలకు గొర్రెల పంపిణీ చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. మంత్రి హరీశ్‌రావు లాంటి నాయకుడు సిద్దిపేటకు దొరకడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్, జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, డీసీసీబీ చైర్మెన్ చిట్టి దేవేందర్ రెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ లక్కిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కొండపాక ఎంపీపీ రాగల సుగుణ దుర్గయ్య, దుద్దెడ సర్పంచ్ ఆరేపల్లి మహదేవ్ గౌడ్, ఎంపీటీసీ గురజాడ బాలాజీ, నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

కేటీఆర్‌కు మరో అంతర్జాతీయ ఆహ్వానం

ఏసియా బెర్లిన్ సమ్మిట్‌కు హాజరుకావాలని పిలుపు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావుకు మరొక అంతర్జాతీయ ఆహ్వానం అందింది. జర్మనీలోని బెర్లిన్‌లో జరిగే ఏషియా బెర్లిన్ సమ్మిట్-2023కు హాజరు కావాలంటూ నిర్వాహకులు ఆహ్వానాన్ని పంపించారు. ఈ సమావేశం జూన్ 12 నుంచి 15 వరకు జర్మనీలోని నగరంలో కొనసాగనుంది. 'కనెక్టింగ్ స్టార్టప్ ఈకో సిస్టం' అనే అంశంపై జరిగే ఈ సదస్సుకు హాజరై ప్రసంగించాలని కేటీఆర్‌ను వారు కోరారు. జర్మనీ సెనెట్‌కు చెందిన ఎకనామిక్స్, ఎనర్జీ, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖ ఆధ్వర్యంలో మంత్రి కేటీఆర్‌ను ఆ సమ్మిట్‌కు ఆహ్వానించారు. ఈ సదస్సులో ప్రసంగించడం ద్వారా భారత్‌తో పాటు తెలంగాణ, ఇతర దేశాల మధ్య బలమైన భాగస్వామ్యా లను ఏర్పాటు చేసుకోవడానికి అవసరమైన ప్రయత్నాలను బలోపేతం చేయాలని ఆ సంస్థ కేటీఆర్‌ను కోరింది. ప్రతి ఏటా ఈ సదస్సు ద్వారా జర్మనీ, ఆసియా దేశాల మధ్య ఆర్థిక సంబంధాలను, భాగస్వామ్యాలను మెరుగుపర్చేందుకు నిర్వహించ నున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ముఖ్యంగా జర్మనీలో ఉన్న స్టార్టప్‌లను ఆసియా ఖండంలోని మార్కెట్లతో అనుసంధానం చేసేందుకు ఈ సదస్సు ఎంతగానో ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. సదస్సులో మొబిలిటీ, లాజిస్టిక్స్, ఎనర్జీ, గ్రీన్‌టెక్, వాతావరణ మార్పులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి ప్రధానమైన అంశాలను విస్తతంగా చర్చించనుందని తెలిపారు. దీంతోపాటు ఈ సమా వేశంలో భాగంగా పెట్టుబడి దారులకు ప్రత్యేకమైన సెషన్ ఉంటుందని, అద్భుతమైన ఆలోచనలున్న స్టార్టప్ కంపెనీలు ఈ అవకాశా న్ని వినియోగిం చుకోవచ్చని కోరారు. జర్మనీలో ఉన్న స్టార్టప్ ఈకో సిస్టం బలాన్ని ఆసియా ఖండంలోని స్టార్టప్‌లతో పంచుకునేందుకు ఈ సదస్సు ఎంతో ఉపయోగపడు తుందని నిర్వాహకులు కేటీఆర్‌కు పంపిన ఆహ్వానంలో పేర్కొన్నారు.

రెజ్లర్లకు న్యాయం చేయాలి : పీఓడబ్ల్యూ డిమాండ్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

దేశ పేరు ప్రతిష్టలను ఇనుమడింపచేస్తూ, పతకాలు సాధిస్తున్న మహిళా రెజ్లర్లపై లైంగిక వేదింపులు దారుణమనీ, దీనిపై ఢిల్లీలో ఆందోళన చేస్తున్న రెజ్లర్లకు న్యాయం చేయాలని పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ వీ సంధ్య డిమాండ్ చేశారు. మీడియాతో పాటు పాలకులు కూడా ఈ సమస్యపై సరిగా స్పందించట్లేదని ఆమె అభిప్రాయపడ్డారు. న్యాయం కోసం పోరాడుతున్న రెజ్లర్లపై దాడులకు పాల్పడుతున్నారనీ, పోలీసులు కూడా అభ్యంతరకరంగా ప్రవర్తిస్తూ, అవమానాలకు గురిచేస్తున్నారని చెప్పారు. దీనిపై సుప్రీం కోర్టు జడ్జితో సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

ఓఆర్‌ఆర్ కాంట్రాక్టు పెద్ద కుంభకోణం

- కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రానికి బంగారుబాతు లాంటి ఆర్థిక వనరు అయిన ఔటర్ రింగురోడ్డును ఐఆర్‌బీకి 30 ఏండ్ల పాటు కాంట్రాక్టు ఇవ్వడం వెనుక పెద్ద కుంభకోణం ఉందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆరోపించారు. ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చి పెట్టే ఓఆర్‌ఆర్‌ను ప్రయివేటు సంస్థలకు కాంట్రాక్టు ఇవ్వాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. ఆదివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ నేతలు ప్రకాశ్‌రెడ్డి, రచనారెడ్డిలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజలను నమ్మించి మోసం చేయడంలో కల్వకుంట్ల కుటుంబం ఆరితేరిందని విమర్శించారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను ప్రయివేటీకరిస్తున్నారనీ, దాన్ని వ్యతిరేకిస్తూ టెండర్లలో పాల్గొంటామని ఊదరగొట్టిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఓఆర్‌ఆర్‌ను ఎందుకు ప్రయివేటుపరం చేస్తోందని ప్రశ్నించారు. ఓఆర్‌ఆర్‌పై ఏటేటా ఆదాయం పెరుగుతుందనీ, అలాంటప్పుడు ఆదాయం తగ్గించి టెండర్ ఎలా పిలుస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టేలా ఐఆర్‌బీకి టెండర్ కట్టబెట్టారని విమర్శించారు. హెచ్ఎమ్‌డీఏ మాస్టర్ ప్లాన్‌కు 2031 వరకు మాత్రమే ఆమోదం ఉందనీ, అలాంటప్పుడు 30 ఏండ్లకు ఓఆర్‌ఆర్ టెండర్ ప్రక్రియ చేపట్టడం నిబంధనలకు విరుద్ధమని చెప్పారు. క్రిసిల్ కంపెనీ ఓఆర్‌ఆర్‌పై అధ్యయనం చేసి ఒక రిపోర్టు ఇచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆ రిపోర్టును బయటపెట్టడం లేదని విమర్శించారు. మణిపూర్‌లో చెలరేగుతున్న హింసపై మంత్రి స్పందిస్తూ...అల్లర్లు, హింస ద్వారా ప్రయోజనమేమీ ఉండదనీ, చర్చల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని చెప్పారు.

బీజేపీ ఆఫీసులో అల్లూరి సీతారామరాజు వర్ధంతి

బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ బండి సంజయ్‌కుమార్, కేంద్ర పర్యాటక, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

కిరణ్ సేవలు ఎనలేనివి..

- విద్యుత్ కార్మికుల కోసం చేసిన త్యాగాలు వెలకట్టలేనివి : 4వ వర్ధంతి సభలో టీఎస్‌యూఈఈయూ నేతలు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (టీఎస్‌యూఈఈయూ-సీఐటీయూ) మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్ చేసిన సేవలు ఎనలేనివని పలువురు నేతలు కొనియాడారు. ఆదివారంనాడిక్కడి మింట్ కాంపౌండ్‌లోని యూనియన్ రాష్ట్ర కార్యాలయంలో కిరణ్ నాల్గవ వర్ధంతి సభ జరిగింది. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కే ఈశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీ గోవర్ధన్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ జే ప్రసాదరాజు, కోశాధికారి జే బస్వరాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిరణ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. కిరణ్ అమర్‌రహే, కిరణ్ ఆశాలు సాధిస్తాం అంటూ నినాదాలు చేశారు. రాష్ట్రంలోని 23 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను ఆర్టిజన్స్‌గా గుర్తించడంలో కిరణ్ చేసిన కృషి మరువలేనిదని అన్నారు. ఇటీవల జరిగిన వేతన ఒప్పంద సమయంలో, ఏప్రిల్ 25 నుంచి జరిగిన ఆర్టిజన్ కార్మికుల సమ్మెలో 200 మందిని సర్వీస్ నుంచి తొలగించిన ఘటనల్లో కిరణ్ లేని లోటు స్పష్టంగా కన్పించిందని భావోద్వేగానికి లోనయ్యారు.

చిన్నా పెద్ద భేదం లేకుండా అన్ని యూనియన్లు, అందరు నేతల్ని కలుపుకొని వెళ్లడంలో కిరణ్ వ్యక్తిత్వం చాలా గొప్పదని కొనియాడారు. విద్యుత్ కార్మికుల భవిష్యత్ కోసం నిరంతరం తపనపడుతూ కిరణ్ అనేక త్యాగాలు చేశారనీ, ఆ స్ఫూర్తితోనే రాబోయే రోజుల్లో ఆర్టిజన్స్ కన్వర్షన్, పీస్ రేట్ కార్మికులకు కనీస వేతనాలు, అన్మెండ్ కార్మికుల్ని ఆర్టిజెన్స్‌గా గుర్తించడం కోసం పోరాటాలు కొనసాగిస్తామన్నారు. కిరణ్ వర్ధంతి సభలు రాష్ట్రవ్యాప్తంగా 45 కేంద్రాల్లో జరిగాయి. ఆయా సభల్లో విద్యుత్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని కిరణ్‌కు నివాళులు అర్పించారు.

మణిపూర్ నుంచి తెలంగాణ విద్యార్థుల తరలింపు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మణిపూర్‌లో చదువుకుంటున్న తెలంగాణ విద్యార్థులను సురక్షితంగా హైదరాబాద్‌కు తరలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. ఆదివారం రాత్రిగానీ, సోమవారం ఉదయంగానీ ఇంఫాల్ నుంచి ప్రత్యేక విమానంలో వారు బయలుదేరనున్నారు. కలకత్తా మీదుగా శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకోనున్నారు. ఇప్పటికే ఢిల్లీకి హర్షవర్ధన్ అనే విద్యార్థి చేరుకున్నాడు. అతడు బస చేసేందుకు తెలంగాణ భవన్‌లో అధికారులు ఏర్పాట్లు చేశారు. తెలంగాణ భవన్‌తో పాటు హైదారాబాద్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. విద్యార్థుల తరలింపుపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, మణిపూర్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో సంప్రదించి అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. మరో వైపు విద్యార్థుల భద్రతపై మణిపూర్ రాష్ట్ర పోలీసులతో డీజీపీ అంజనీకుమార్ ఎప్పటికప్పుడు సంప్రదిస్తున్నారు.

ఆస్తి పంచివ్వలేదని..
తల్లి మృతదేహాన్ని తీసుకెళ్లని కూతుర్లు

- కామారెడ్డిలో అమానవీయ ఘటన

నవతెలంగాణ-కామారెడ్డి(తాద్వాయి)

ప్రస్తుతం సమాజంలో రోజురోజుకూ డబ్బుపై పెరుగుతున్న వ్యామోహం.. కుటుంబ బాంధవ్యాలను చిన్నాభిన్నం చేస్తుంది. ఇన్ని రోజులు తల్లిదండ్రుల బాగోగులు చూడని కొడుకులను చూశాం. తాజాగా ఓ ఇద్దరు కూతుర్లు తమకు ఆస్తి పంపకాలు చేపట్టలేదని తల్లి మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు నిరాకరించిన అమానవీయ ఘటన కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కామారెడ్డి పట్టణంలోని ఆర్‌బీనగర్‌కు చెందిన కిష్టవ్వ(70)కు ముగ్గురు కుమార్తెలు. ఇటీవల ఒక కూతురు మృతిచెందగా.. ఇద్దరు కూతుర్లు పట్టణంలోనే నివసిస్తున్నారు. కిష్టవ్వ పేరు మీద ఇల్లుతో పాటు బ్యాంక్‌లో రూ.1.15 లక్షలున్నట్టు సమాచారం. ఆమె ఆస్తులకు సంబంధించి సమీప బంధువు నామినీగా ఉన్నారు. అయితే ఆ డబ్బులను తమకు ఇవ్వాలని కొన్ని రోజులుగా ఇద్దరు కూతుర్లు వచ్చి అడిగారు. ఈ విషయంలో కొన్ని రోజులుగా గొడవలు చోటుచేసుకోవడంతో కిష్టవ్వ అనారోగ్యానికి గురైంది. గత నెల 21 నుంచి కామారెడ్డి జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. మృతిచెందినట్టు వైద్య సిబ్బంది వారి కూతుర్లకు సమాచారం ఇచ్చారు. ఆమె బతికి ఉన్నప్పుడు బ్యాంక్ డబ్బులు అడిగితే ఇవ్వలేదని, తాము ఆమె మృతదేహాన్ని తీసుకెళ్లబోమని కూతుర్లు తెలిపినట్టు వైద్య సిబ్బంది తెలిపారు.దాంతో సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కూతుర్లు ఉండి కూడా అనాథ శవంగా ఆస్పత్రిలో ఆమె మృతదేహం ఉండటం స్థానికులను చలించింది. కాగా ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపడుతున్నారు.

జీఎస్‌టీ ఆటోమేషన్‌లో లోపాలు

- రాష్ట్ర ప్రభుత్వాల రెవెన్యూకు మించి ఖర్చు: 'ఎక్కడ ఆర్థిక సమైఖ్యవాదం?' చర్చలో సాయిప్రసాద్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

జీఎస్‌టీ వసూళ్లల్లో లోపాలున్నాయని, ఈ పన్ను విధానం అమలై ఐదేండ్లు కావొస్తున్నా ఆటోమేషన్ చేయడంలేదని డీజీఏ ఇండిపెండెంట్ డైరెక్టర్ సీహెచ్‌వీ సాయిప్రసాద్ అన్నారు. ఆదివారం ప్రజ్ఞాభారతి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎఫ్‌టీసీసీఐ ఆడిటోరియంలో ఆ సంస్థ అధ్యక్షులు శిశిర్ అధ్యక్షతన నిర్వహించిన 'ఎక్కడ ఆర్థిక సమైఖ్యవాదం?' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భారతదేశ సమైఖ్య వ్యవస్థలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రత్యేక అధికారాలు ఉన్నాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి స్థానిక ప్రభుత్వాలైన(స్థానిక సంస్థలకు) నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 2015లకు ముందు ఫైనాన్స్ కమిషన్స్, వివిధ మంత్రిత్వ శాఖల ద్వారా నిధులు కేటాయించిందని గుర్తుచేశారు. 13వ ఆర్థిక సంఘం ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలకు 32శాతం ఉన్న నిధులను 14వ ఆర్థిక సంఘం నాటికి 42శాతం పెరిగాయని వివరించారు. స్థానిక సంస్థలకు 58శాతం నిధులు కేటాయించినట్టు తెలిపారు. దేశంలో మౌలిక వసతుల కల్పనలో ప్రయివేటు సంస్థల భాగస్వామ్యం పెరగడంతో ప్రయివేటు ఆర్థిక వ్యవస్థ కూడ పెరిగిందని అన్నారు. దీంతోపాటు రాష్ట్ర ప్రభుత్వాలు తమ రెవెన్యూకు మించి సంక్షేమ పథకాల పేరుతో ఖర్చుచేస్తున్నాయని వివరించారు. రాష్ట్ర జీఎస్‌డీపీ ప్రకారం 3శాతం అప్పులు తీసుకోవాలనే నిబంధన ఉన్నా అంతకుమించి అప్పులు చేస్తున్నాయని తెలిపారు. ఎన్నికల్లో చేసిన వాగ్దానాలను అమలు చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పులు చేయాల్సిన పరిస్థితి తప్పడంలేదని అన్నారు.

'కోణార్క్'లో సాంకేతిక లోపం

నవతెలంగాణ-బోనకల్

ఖమ్మం జిల్లా బోనకల్ - మోటమర్రి రైల్వే స్టేషన్ల మధ్యలో గోవిందాపురం(ఏ) గ్రామ సమీపంలో ఇంజన్‌లో ఏర్పడిన సాంకేతిక లోపంతో కోణార్క్ ఎక్స్‌ప్రెస్ గంటన్నర పాటు నిలిచిపోయింది. దాంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముంబై నుంచి భువనేశ్వర్ బయలుదేరిన కోణార్క్ ఎక్స్‌ప్రెస్ బోనకల్ రైల్వే స్టేషన్ దాటిన కొద్దిసేపటికి ఉదయం 9.20 గంటల సమీపంలో ఇంజన్‌లో సాంకేతిక లోపం ఏర్పడింది.

గురుకుల ప్రిన్సిపల్స్ సంఘం ఆవిర్భావం

- గౌరవ సలహాదారుగా బోయినపల్లి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర గురుకులాల ప్రిన్సిపల్స్ సంఘం రాష్ట్ర గౌరవ సలహాదారుడిగా ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. రాష్ట్రంలో ఉన్న 1,062 ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, జనరల్ గురుకుల పాఠశాలలకు చెందిన ప్రిన్సిపాళ్లు ఆదివారం హైదరాబాద్‌లో నూతన సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. నూతన రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా డాక్టర్ ఆర్. అజయ్‌కుమార్, రాంబాబు ఎన్నికయారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని విద్యార్థులకు బంగారు భవిష్యత్తును కల్పించడమే ఏకైక లక్ష్యంగా తమ సంఘం పని చేస్తున్నదని తెలిపారు. సీఎం కేసీఆర్ ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు అంకిత భావంతో కషి చేయాలని బోయినపల్లి తమరికి ఈ సందర్భంగా సూచించారు. నూతన కార్యవర్గ సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోరండ్ల చంద్ర మోహన్, కోశాధికారి జక్కని రాజేశం, ఉపాధ్యక్షులుగా బి రాజేష్, ఎం నీరజ, స్వాతి, కార్యదర్శులుగా జి శ్రీకాంత్, సునీత, వాణి, సహ కార్యదర్శులుగా బిక్షపతి, మహిళా కార్యదర్శి నీలిమా దేవి, గ్రేటర్ హైదరాబాద్ ఇంచార్జి విద్యాసాగర్, వరంగల్ గ్రేటర్ ఇంచార్జి టి.శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

సిటీ సెంట్రల్‌లో చిన్నారికి ప్రమాదం



నవతెలంగాణ - బంజారాహిల్స్

హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 1లో ఉన్న సిటీ సెంట్రల్ మాల్‌లో విషాదం చోటుచేసుకుంది. మాల్‌లోని ప్లే జోన్‌లో మూడేండ్ల చిన్నారి చేయి మిషన్‌లో పెట్టడంతో ఆమె మూడు చేతి వేళ్ల తెగిపోయాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బంజారాహిల్స్‌లోని ఇబ్రహీంనగర్‌కు చెందిన దంపతులు ముగ్గురు పిల్లలను తీసుకుని సిటీ సెంట్రల్ మాల్‌కు వచ్చారు. పిల్లలు ప్లే జోన్‌లో ఆడుకుంటుండగా మెహ్విష్ లుబ్నా అనే 3 ఏండ్ల చిన్నారి ఓ యంత్రంలో చేయి పెట్టడంతో విషన్‌లో వెళ్ల ఇరుక్కొని కుడి చేతి మూడు వేళ్ల తెగిపోయాయి. దాంతో పాపను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అక్కడ బాలిక 3 వేళ్లను వైద్యులు తొలగించినట్టు తెలిసింది. అనంతరం మాల్ నిర్వాహకులపై చిన్నారి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణం నిర్వాహకుల నిర్లక్ష్యమేనని బాలిక తండ్రి ఆరోపించాడు. సరైన సదుపాయాలు అందుబాటులో లేకపోవడం వల్లే ప్రమాదం జరిగిందన్నాడు.

ప్రశాంతంగా ముగిసిన నీట్

- రాష్ట్రం నుంచి 65 వేల మంది హాజరు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎంబీబీఎస్, బీడీఎస్ తదితర మెడికల్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఆదివారం నిర్వహించిన నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్) ప్రశాంతంగా ముగిసింది. దేశవ్యాప్తంగా సుమారు 20.5 లక్షల మంది హాజరుకాగా..మన రాష్ట్రం నుంచి 65 వేల మంది పరీక్ష రాశారు. అల్లర్లు జరుగుతున్న నేపథ్యంలో మణిపూర్‌లో ఈ పరీక్షను వాయిదా వేశారు. మన రాష్ట్రంలో గ్రేటర్ హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, రంగారెడ్డి, వరంగల్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, జయశంకర్ భూపాలపల్లి, గద్వాల, జగిత్యాల, జనగాం, కొత్తగూడెం, మహబూబాబాద్, మంచిర్యాల, మేడ్చల్, నల్లగొండ, నిజామాబాద్, సిద్దిపేట, సూర్యాపేట్ ప్రాంతాలలో పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేశారు. అరగంట ముందు వరకూ విద్యార్థులను హాల్‌లోపలికి అనుమతించారు. ఒకటిన్నర తర్వాత వచ్చిన విద్యార్థులను పరీక్షాకేంద్రాల్లోకి అనుమతించలేదు. ఎగ్జామ్ రాసిన విద్యార్థులు ఈసారి ప్రశ్నాపత్రం మధ్యస్తంగా వచ్చిందనీ, ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల నుంచే ఎక్కువ ప్రశ్నలు వచ్చాయని తెలిపారు. రాష్ట్రం నుంచి 40 నుంచి 45 వేల మంది అర్హత సాధించే అవకాశం ఉండగా..8 వేలకుపైగా ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో ఉన్నాయి.

ఆరోగ్య సూచీల్లో నెంబర్ వన్‌గా నిలవాలి

సమీక్షా సమావేశంలో మంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆరోగ్య సూచిల్లో తెలంగాణ రాష్ట్రాన్ని మొదటి స్థానానికి చేర్చాలని, దానికోసం ప్రతి ఒక్కరూ పోటీతత్వంతో పని చేయాలని వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ప్రభుత్వం ప్రజారోగ్య సంరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నదని తెలిపారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ పరిధిలో అమలవుతున్న ఆరోగ్య కార్యక్రమాలపై ఆదివారంనాడాయన సమీక్షా సమావేశం నిర్వహించారు. హెల్త్ సెక్రెటరీ రిజ్వీ, కుటుంబ సంక్షేమ విభాగం కమిషనర్ శ్వేత మహంతి, డీఎంఇ రమేష్ రెడ్డి, డీహెచ్ శ్రీనివాస రావు, టీవీవీపీ కమిషనర్ అజయ్‌కుమార్, టీఎస్ఎంఎస్ఐడీసీ ఎండీ చంద్రశేఖర్‌రెడ్డి, అన్ని జిల్లాల డీఎంహెచ్‌ఓలు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు, ప్రోగ్రాం ఆఫీసర్లు, వైద్యాధికారులు పాల్గొన్నారు. మెటర్నల్ హెల్త్, కేసీఆర్ న్యూట్రీషన్ కిట్స్, ఇమ్మ్యునైజేషన్, ఎన్సీడీ ప్రోగ్రాం, టెలి మానస్, బస్తీ దవాఖానలు, తెలంగాణ డయాగ్నోస్టిక్స్, ఆరోగ్య మహిళ సహా పలు కార్యక్రమాల అమలు తీరును ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనీ, మందులు, వైద్య పరికరాలు, సిబ్బంది కొరత లేకుండా చూసుకుంటామన్నారు. ప్రభుత్వ కషికి తోడు ఆరోగ్య శాఖలోని ప్రతి ఒక్క సిబ్బంది బాధ్యతతో సహకరించాలన్నారు. జిల్లా ప్రజల ఆరోగ్య సంరక్షణ విషయంలో డీఎంహెచ్‌ఓలు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలదే కీలక పాత్ర అని చెప్పారు. ఒక పేషెంట్ పీహెచ్‌సీ పరిధి దాటి రిఫరల్ ఆస్పత్రి వద్దకు వచ్చి చికిత్స చేయించుకొని తిరిగి వెళ్లాక, ఆ పేషెంట్ ఆరోగ్య పరిస్థితిపై మానిటరింగ్ చేయాల్సిన బాధ్యత స్థానికి ఆరోగ్య అధికారులకు ఉంటుందన్నారు. జిల్లా పరిధిలోనే మెడికల్ కాలేజీలు అందుబాటులోకి వచ్చాయనీ, అందువల్ల అక్కడే మంచి వైద్యం అందించాలన్నారు. అవసరం అయితేనే ఉస్మానియా, నిమ్స్, గాంధీ ఆస్పత్రులకు రిఫర్ చేయాలన్నారు. బస్తీ దవాఖానాల్లో ఓపీ పెరగాలని, ఆదివారం మధ్యాహ్నం 2 గంటల వరకు దవాఖాన తెరిచి ఉంటుందని బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. 24 గంటల్లోగా తెలంగాణ డయాగ్నోస్టిక్స్ ద్వారా పరీక్ష ఫలితాలు అందించి, చికిత్స అందేలా చూడాలన్నారు. పాలియేటివ్ సేవల గురించి ప్రచారం కల్పించాలనీ, మహిళల సమగ్ర ఆరోగ్య సంరక్షణ కోసం నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళ కార్యక్రమం గొప్పదని, ప్రతి మంగళవారం పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందేలా చూడాలన్నారు. వైద్యాధికారులు ప్రతి మంగళవారం క్లినిక్స్ సందర్శించాలన్నారు. మానసిక సమస్యలతో బాధపడుతున్న వారికి పరిష్కారంగా ప్రారంభించిన టెలి మానస్ 14416 టోల్ ఫ్రీ నెంబర్‌కు విస్తృత ప్రచారం కల్పించాలని ఆదేశించారు. ప్రభుత్వాస్పత్రుల్లో డెలివరీలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని, సాధారణ డెలివరీలను ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో గైనకాలజిస్టుల వారీగా పరిశీలన నిర్వహిస్తామన్నారు. ప్రయివేటు ఆసుపత్రుల్లో సిజేరియన్లు ఎక్కువగా జరుగుతుండటంపై పరిశీలన చేయాలనీ, వాటిని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓలను ఆదేశించారు.

వ్యాక్సినేషన్ వంద శాతం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్వోలు, డీఎంహెచ్వోలు ఎక్కువగా ఫీల్డ్ విజిట్స్ చేయాలని, పనితీరును మెరుగుపర్చుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పనిచేసే వైద్య సిబ్బందికి ప్రోత్సాహకాలు ఉంటాయనీ, అదే సమయంలో విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు ఉంటాయని మంత్రి స్పష్టం చేశారు.